అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 12-2-2023 సమగ్ర తెలుగు దినపత్రిక www.navatelangana.com

సంపుటి : 9 సంచిక : 42 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 12 పేజీలు + సోపతి (వెబ్‌లో) వెల : 8.00



ఫోటో కెఎస్.హరి

టాప్ స్పీడ్‌తో దుమ్మురేపిన జెన్3 రేసింగ్ కార్లు

ఘనంగా హైదరాబాద్ గ్రాండ్ ప్రీ మోడల్ 300 కిమీ స్పీడ్‌తో దూసుకెళ్లిన కార్లు

ఫార్ములా-ఈ కిక్కు



హైదరాబాద్ గ్రాండ్ ప్రీ మెడల్ పోడియంపై జీన్ ఎరిక్, నిక్ కాసిడి, ఆంటోనియో ఫెలిక్స్, టైటిల్ ప్రదానం చేసిన తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు

నవతెలంగాణ-హైదరాబాద్: ప్రపంచ స్థాయి ఫార్ములా రేసు టెలివిజన్ తెరలపైనే వీక్షించిన భారతీయ క్రీడాభిమానుల కల నెరవేరింది. ఏబీబీ ఎఫ్ఐఏ ఫార్ములా-ఈ ప్రపంచ చాంపియన్‌షిప్ మన గడ్డపైకి వచ్చింది. హైదరాబాద్ గ్రాండ్ ప్రీతో ఫార్ములా-ఈ రేసు భారత్‌లో అరంగేట్రం చేసింది. మోటార్‌స్పోర్ట్స్ దిగ్గజ జట్లు పోటీపడిన ఎలక్ట్రిక్ కార్ల టాప్ రేసింగ్ హైదరాబాద్ సూపర్ హిట్టు కొట్టింది. 11 జట్లు, 22 మంది డ్రైవర్లు పోటీపడిన ఈ-రేసులో న్యూజిలాండ్ రేసర్ జీన్ ఎరిక్ వేన్ విజేతగా నిలిచాడు. 2.835 కిలోమీటర్ల హైదరాబాద్ స్ట్రీట్ సర్క్యూట్‌పై జీన్ ఎరిక్ 32 ల్యాప్‌లను (రౌండ్లు) 46.01.099 సెకండ్లలో పూర్తి చేసి టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. నిక్ కాసిడి (46.01.499), ఆంటోనియో ఫెలిక్స్ (46.02.958) ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. చారిత్రక హైదరాబాద్ గ్రాండ్ ప్రీ రేసుకు సినీ, క్రీడా, రాజకీయ ప్రముఖులు తరలివచ్చారు. ప్రథమ హైదరాబాద్ గ్రాండ్ ప్రీ రేసును ప్రత్యక్షంగా 25000 మంది అభిమానులు వీక్షించారు.

వివరాలు ఆటలులో..

ఆరెస్సెస్ విస్తరణకు
అడ్డంగా నిలబడదాం

దేశవ్యాప్తంగా బలమైన శాంతి ఉద్యమాలు రావాలి



- ఐప్సో రాష్ట్ర మూడో మహాసభలో వక్తలు
- అసమానతలు, మతోన్మాదంపై పోరాడదాం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దేశానికి ప్రమాదంగా మారుతున్న ఆరెస్సెస్ విస్తరణను అడ్డుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ప్రపంచంలో అశాంతికరమైన పరిస్థితులు నెలకొన్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మనదేశంలో కూడా బలమైన శాంతి ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరముందని వారు అభిప్రాయపడ్డారు. సామ్రాజ్యవాద విధానాలను ఎదుర్కొని, ఆనాడు రష్యా నిలబడిందని గుర్తు చేశారు. అమెరికా దేశం పెట్టుబడిదారీ వ్యవస్థలకు నేతృత్వం వహిస్తూ...అనేక దేశాల్లో యుద్ధ పరిస్థితులను సృష్టిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా, నాటో కూటమి ఉక్రెయిన్ దేశంలో స్థావరాలు ఏర్పరచుకుని రష్యా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. మనదేశ సరిహద్దుల్లో ఉద్రిక్తత పరిస్థితులను రెచ్చగొట్టి బీజేపీ లబ్దిపొందుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) రాష్ట్ర మూడో మహాసభను శనివారం హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐప్సో జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ కె యాదవరెడ్డి జెండావిష్కరణ చేశారు. అనంతరం ప్రారంభమైన సభలో జనరల్ సెక్రటరీ జి నాగేశ్వరరావు ప్రజాఉద్యమాల్లో మరణించిన నేతలకు, ఉగ్రవాద చర్యలకు బలైన వారికి, ఇటీవల మరణించిన సినీనటులకు, భూకంప ప్రమాదంలో మరణించిన వారికి సంతాప తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. ఐప్సో డిప్యూటీ జనరల్ సెక్రటరీ హరిచంద్ సింగ్ భట్ మహాసభలను ప్రారంభిస్తూ...సారూప్యత కలిగిన నేతలతో ఐప్సో ఏర్పడిందని గుర్తు చేశారు.ప్రపంచ శాంతి, సామరస్యాల కోసం అది అనేక కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ప్రజలపై హింసకు వ్యతిరేకంగా, సరిహద్దుల్లో యుద్ధ వాతావరణాన్ని

...5లో

శత్రుదేశం మీద పగబట్టినట్టు... తెలంగాణపై
బీజేపీ పగబట్టింది

రాష్ట్రాభివృద్ధికి సహకరించని కేంద్రం

- మెట్రోరైల్ విస్తరణకు మోడీ సర్కార్ మోకాలడ్డుతోంది :శాసనసభలో మంత్రి కేటీఆర్

కేంద్రంలోని బీజేపీ సర్కార్ తెలంగాణాపై శత్రు దేశంపై పగబట్టినట్టు పగబట్టిందని రాష్ట్ర మంత్రి కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధి గురించి ప్రతిపాదనలు ఇద్దామంటే కేంద్ర మంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రం ముందుకు రావడం లేదని విమర్శించారు. మెట్రో రైల్ విస్తరణ విషయంలోనూ మోడీ సర్కార్ అదే తీరును ప్రదర్శిస్తున్నదని చెప్పారు.

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



బీజేపీ అధికారంలో ఉన్న ఉత్తర్‌ప్రదేశ్‌లో హైదరాబాద్ కన్నా ఆరు చిన్న పట్టణాలకు 20 శాతం కేంద్రం వాటా, సావరీన్ గ్యారంటీ ఇస్తూ మెట్రోకు కేంద్రం అనుమతులిచ్చింది. గుజరాత్‌లోని అలహాబాద్, గాంధీనగర్‌తో పాటు చెన్నై మెట్రోలకు కూడా ఓకే చెప్పిందన్నారు. కానీ రూ, 8,455 కోట్లతో హైదరాబాద్‌లోని బీహెచ్ఇఎల్ నుంచి లక్డికాపూల్, ఎల్.బీ.నగర్ నుంచి నాగోల్ వరకు మెట్రోను విస్తరించేందుకు ప్రతిపాదనలను సమర్పించేందుకు కూడా కేంద్ర మంత్రి హర్‌దీప్‌సింగ్ కలిసేందుకు ప్రయత్నించినా పడనివ్వలేదని తెలిపారు. పైపెచ్చు వయబిలిటీ ఉందా? ప్రయాణికులున్నారా? అంటూ కొర్రీలను పెట్టారని విమర్శించారు.. హైదరాబాద్ కన్నా చిన్న పట్టణాల్లో ప్రయాణికులుంటే హైదరాబాద్‌లో ఉండరా? అని ప్రశ్నించారు. హైదరాబాద్ మెట్రోను గమనిస్తే ప్రయాణికుల రద్దీ ఎలా ఉందో అర్థమవుతుందని హితవు పలికారు. కేంద్ర మంత్రి కలవకపోవడంతో రాష్ట్ర కార్యదర్శి ద్వారా కేంద్ర కార్యదర్శికి ప్రతిపాదనలు, డీపీఆర్ సమర్పించారని తెలిపారు. శనివారం శాసనసభ ప్రశ్నోత్తరాల సందర్భంగా మెట్రో రైల్ ప్రాజెక్టు పొడిగింపుపై బీఆర్ఎస్ సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి, తోల్కంటి ప్రకాష్ గౌడ్, అరెకపూడి గాంధీ, దానం నాగేందర్, మాగంటి గోపీనాథ్, మాధవరం కృష్ణారావు, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ఎంఐఎం సభ్యులు జాఫర్ హుస్సేన్, కౌసర్ మొజంఖాన్‌లు మెట్రో విస్తరణకు పలు సూచనలు చేశారు.

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క మాట్లాడుతూ, మెట్రో రైల్ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిందని గుర్తుచేశారు. ప్రస్తుతం మెట్రో ఛార్జీలు పెంచారనీ, ప్రకటనల హోర్డింగ్‌లను ఏకపక్షంగా కట్టబెడుతున్నారని విమర్శించారు. ఇందుకు మంత్రి కేటీఆర్ బదులిస్తూ, 55 ఏండ్లు పాలించిన పార్టీగా కాంగ్రెస్ ఆ మాత్రం చేయకపోతే ఎలా? అని ఎదురు ప్రశ్నించారు. మెట్రో రైల్ తెచ్చామనీ చెప్పుకుంటే సరిపోదనీ, చేసుకున్న ఒప్పందాలేంటో తెలుసుకోవాలని సూచించారు. ఆ ఒప్పందాల మేరకే ఛార్జీలు, ప్రకటనలు ఉంటున్నాయని తెలిపారు. మెట్రో రెండో దశలో మియాపూర్ నుంచి బీహెచ్ఇఎల్‌కు విస్తరిస్తామని

...5లో

ఆరోగ్యశ్రీని తీసేయొద్దు
కొనసాగిస్తేనే పేదలకు మేలు



- చలాన్లు వేయడంపైనే ట్రాఫిక్ పోలీసుల దృష్టి
- ఉర్దూ కమిషన్‌ను నియమించాలి
- శాసనసభలో ప్రతిపక్ష నేత అక్బరుద్దీన్

...6లో



దేశ భవిష్యత్తు నిర్మాణంలో ఐపీఎస్‌లది

గురుతర బాధ్యత

ఐపీఎస్‌ల పాసింగ్ అవుట్ పరేడ్‌లో కేంద్ర మంత్రి అమిత్ షా

నవ తెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

దేశ భవిష్యత్తు నిర్మాణంలో ఐపీఎస్ అధికారుకు గురుతర బాధ్యత ఉందనీ, దానిని సక్రమంగా నిర్వహించటంలో యువ ఐపీఎస్‌లు కీలక పాత్ర పోషించాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలో

...5లో

పాల్వంచ కేటీపీఎస్‌లో ప్రమాదం

ముగ్గురికి గాయాలు



నవతెలంగాణ-పాల్వంచ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్) ఏడో దశలో ప్రమాదం జరిగింది. కోల్ ప్లాంట్‌లోని సైలో దగ్గర శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ఎలక్ట్రికల్ సిబ్బంది బ్రేకర్ వద్ద మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అక్కడ పని చేస్తున్న ఏఈ విజయ్, ఆర్టిజన్‌లు వరద రాజులు, మల్లిఖార్జున్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే తోటి కార్మికులు వారిని అంబులెన్స్ ద్వారా కేటీపీఎస్ ఆస్పత్రికి తరలించారు. వారికి 35 శాతం గాయాలయ్యాయి. డాక్టర్ల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం యాజమాన్యం సికింద్రాబాద్ యశోద హాస్పిటల్‌కు తరలించింది. ప్రమాదానికి గల కారణాలను అధికారులు విచారిస్తున్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో పేలుడు..

9మంది కార్మికులకు తీవ్రగాయాలు

విశాఖ : ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ స్టీల్ మెల్టింగ్ షాపులో కన్వేర్ ల్యాడిల్‌లో ద్రావకాన్ని తీసుకెళ్లే పైపు పగిలిపోవడంతో ఉక్కు ద్రావకం విరజిమ్మింది. ఈ ప్రమాదంలో 9 మంది కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద స్థలంలో డీజీఎం, సీనియర్ మేనేజర్, ఇద్దరు టెక్నీషియన్లు ఐదుగురు కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నారు. వీరిలో డీజీఎం-80, సీనియర్ మేనేజర్-80శాతం, ఇద్దరు కాంట్రాక్ట్ కార్మికుల్లో ఒకరికి 90శాతం, మరొకరికి 60శాతం తీవ్రంగా కాలిన గాయాలు అయ్యాయి. మిగతా వారికి 20శాతం నుంచి 30శాతం వరకు కాలిన గాయాలయ్యాయి. స్థానిక పోలీసులకు సమాచారాన్ని అందించటంతో.. క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. కొంతమంది కార్మికులను మెరుగైన చికిత్స కోసం నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

ప్రజాబలంతో
ఎదుర్కొంటాం..

అర్థబలం, అంగ బలంతో బీజేపీ : సీతారాం ఏచూరి

- రాష్ట్రంలో తిరిగి ప్రజస్వామ్యం రావాలన్నదే ప్రజల ఆకాంక్ష
- త్రిపురలో స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని ఈసీని కోరాం..



అర్థబలం, అంగబలంతో త్రిపుర ఎన్నికల్లో గెలవడానికి బీజేపీ ప్రయత్నిస్తున్నదని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆరోపించారు. వామపక్షాలు, కాంగ్రెస్ కూటమి ప్రజాబలంతో ముందుకు వెళ్తున్నదని చెప్పారు. రాష్ట్రంలో తిరిగి ప్రజాస్వామ్య, రాజ్యాంగ బద్ధమైన పాలన ఏర్పడాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని చెప్పారు. త్రిపుర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 16న జరగనున్నది. వామపక్షాలు, కాంగ్రెస్ ఒక కూటమిగా అధికార బీజేపీని ఎదుర్కొంటున్నాయి. బీజేపీ వ్యతిరేక ఓటు చీలిపోకూడదనే ఉద్దేశంతోనే వామపక్షాలు, కాంగ్రెస్ ఒక్కటయ్యాయి. ఎన్నికల ప్రచారం నిమిత్తం త్రిపురలో విస్తృతంగా పర్యటిస్తున్న ఏచూరి శనివారం న్యూస్ వెబ్‌పోర్టల్ 'న్యూస్ క్లిక్'కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే..

త్రిపురలో ప్రస్తుత పరిస్థితి ఏంటి? ప్రజల మూడ్ ఎలా ఉంది?

ప్రస్తుతం త్రిపుర ప్రజలు అధికార మార్పును కోరుకుంటున్నారు. గత ఐదేండ్లుగా దాడులు, బెదిరింపులతో సీపీఐ(ఎం)ను దెబ్బకొట్టడానికి బీజేపీ ప్రయత్నిస్తున్నది. అధికార బీజేపీ ఎంతోమంది వామపక్ష కార్యకర్తలను పొట్టనబెట్టుకుంది. రాష్ట్రంలో ప్రజాస్వామ్య, రాజ్యాంగ బద్ధమైన పాలన లేదు. ప్రజలు అణచివేతకు గురవుతున్నారు. దీంతో ప్రజలు స్వేచ్ఛను కోరుకుంటున్నారు. ఎన్నికల ర్యాలీల్లో ఈ విషయం స్పష్టంగా తెలుస్తున్నది. ఎన్నికల పోలింగ్ తేదీకి ఐదు రోజుల ముందు త్రిపురకు ప్రధాని మోడీ వస్తున్నారు. అమిత్ షా పర్యటించబోతున్నారు. రెచ్చగొట్టే ప్రసంగలతో ఓటర్లను ప్రభావితం చేయటమే వారి పని. అధికారం, ఆర్థిక బలంతో ఎన్నికల్లో గెలవాలన్నది బీజేపీ వ్యూహం. ప్రజాబలంతోనే బీజేపీని ఓడించగలం. ఈ విషయాన్ని వామపక్షాలు, కాంగ్రెస్ ఓటర్లలోకి తీసుకెళ్తున్నాయి.

కాంగ్రెస్‌తో కలిసి వెళ్లటం కలిసొస్తుందా?

గత ఐదేండ్లుగా రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల్ని దృష్టిలో పెట్టుకొని.. వామపక్షాలు, కాంగ్రెస్ ఒక్కటయ్యాయి. అధికార బీజేపీని ఓడించడానికి ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు ఒక్కటవ్వాలని పిలుపునిచ్చాం. వామపక్షాల పిలుపును ప్రజలు ఆమోదిస్తున్నారు. ఓట్లు చీలిపోకూడదనేది ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం. ప్రతిపక్షాల

...5లో



సాగునీటి కోసం..
అర్ధరాత్రి పడిగాపులు

- నిజాంసాగర్ కాలువ వద్ద వంతు కోసం రైతుల పాట్లు
- సరిపడా సాగునీరు ఇవ్వాలని డిమాండ్
- కరెంట్ లేక బోర్లూ పోయడం లేదని ఆవేదన



విత్తనం నాటింది మొదలు పంట చేతికి వచ్చేంతవరకూ రైతులు పడే కష్టం ఇంతా అంతా కాదు. పంటను కంటికి రెప్పలా కాపాడుకునేందుకు అనేక పాట్లు పడుతున్నారు. నిజామాబాద్ జిల్లా బోధన్ డివిజన్‌లో నిజాంసాగర్ కాలువ నీటి కోసం రైతులు అర్ధరాత్రి వరకు పడిగాపులు కాస్తున్నారు. సాలూర మండలం సాలూర క్యాంప్ శివారులో నిజాంసాగర్ కెనాల్ పరిధిలోని సబ్ డివిజన్ 14వ నెంబర్ కెనాల్ సాలుర క్యాంప్, జాడి జమాల్ పూర్, ఫతేపూర్ వద్ద పంటలకు సాగునీటి వసరు.

నవతెలంగాణ-బోధన్

కానీ పంటలకు సరిపడా నీరు అందక పంటలు తడుపుకోవడానికి రైతులు అవస్థలు పడుతున్నారు. తమ వంతు కోసం అర్ధరాత్రి వేళ కాలువ వద్ద పడిగాపులు కాస్తున్నారు. విష పురుగులు ఉన్నా పంటల కోసం ప్రాణాలను పణంగా పెట్టి సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు.

కాలువల వద్దనే రైతుల నిద్ర

రైతులు తాము వేసిన మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, వరి పంటలకు సరిపడా సాగునీరు అందించడానికి నిజాం సాగర్ కెనాల్ వద్ద రాత్రి, పగలు

...5లో

కేరళలో యువ న్యాయవాదులకు వేతన భృతి

- నెలకు రూ.3 వేలు చొప్పున అందజేత



తిరువనంతపురం : కేరళలోని వామపక్ష ప్రభుత్వం మరో ప్రజానుకూల పథకాన్ని ప్రారంభించింది. యువ న్యాయవాదులకు నెలకు రూ.3 వేలు చొప్పున వేతన భృతి (స్టైఫండ్) అందజేసేందుకు ఉద్దేశించిన ప్రత్యేక పథకాన్ని ముఖ్యమంత్రి పినరయి విజయన్ శనివారం ఇక్కడ ప్రారంభించారు. రాష్ట్రంలోని రూ.లక్ష లోపు ఆదాయమున్న జూనియర్ లాయర్లకు నెలకు రూ.మూడు వేలు చొప్పున ఈ పథకం కింద అందజేస్తారు. మూడేండ్లు ప్రాక్టీస్ మించకుండా 30 ఏండ్ల లోపు వయసున్న యువ న్యాయవాదులు ఈ పథకానికి అర్హులు.

ఎస్టీ జాబితాలో బీసీ కులాలను చేర్చొద్దు

- ఆ తీర్మానాన్ని వెనక్కు తీసుకోవాలి :

తెలంగాణ గిరిజన సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో బీసీ జాబితాలో ఉన్న వాల్మీకి, బోయలతో పాటు బేదర, కిరాత, మాలి, తలయారి, చుండు వాళ్ళు, కాయత లంబాడా, భాట్ మధురాలు, చమర్ మధురాలను ఎస్టీ తెగల జాబితాలో చేర్చేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని తెలంగాణ గిరిజన సంఘం(టీజీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. ధర్మా నాయక్, ఆర్. శ్రీరాం నాయక్‌లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓటుబ్యాంకు రాజకీయాల కోసం ఎస్టీ జాబితాలో ఇతర కులాలను కలిపేందుకు ఉమ్మడి రాష్ట్రం నుండి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గిరిజనులకు రిజర్వేషన్లు పెంచకుండానే గత నెలలో కొత్తగా 15 బీసీ కులాలను ఎస్టీ జాబితాలో కలిపి గిరిజనులకు ద్రోహం చేసిందని పేర్కొన్నారు. వాల్మీకి బోయలను ఎస్టీలో కలిపేందుకు 2004 లో వై ఎస్ రాజశేఖర రెడ్డి ఆంధ్రా యూనివర్సిటీ ఆంత్రో పాలజీ డిపార్ట్‌మెంట్ ద్వారా సర్వే చేయించారని తెలిపారు. వాల్మీకి బోయలకు గిరిజన తెగల లక్షణాలు లేవంటూ ఆ నివేదిక తేల్చి చెప్పిందని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ సైతం 2017 లో సెంట్రల్ యూనివర్సిటీ హైదరాబాద్ ఆంత్రో పాలజీ డిపార్ట్‌మెంట్ ద్వారా మరోసారి సర్వే చేయించినా గిరిజన తెగల లక్షణాలు లేవని ఆ నివేదిక విశదీకరించిందని పేర్కొన్నారు. ఆయా కులాలను బలవంతంగా ఎస్టీ జాబితాలో కలిపేందుకు మరోసారి తీర్మానం చేయడం గిరిజనులను మోసం చేయడమేననీ విమర్శించారు.

శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ పదవికి బండ ప్రకాశ్ నామినేషన్ దాఖలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ పదవికి ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ నామినేషన్ దాఖలు చేశారు. ఈమేరకు శనివారం అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి నరసింహాచార్యులుకు ఆయన నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూధానాచారి, గంగాధర్ గౌడ్, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తదితరులు ఉన్నారు. అనంతరం శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో మండలి డిప్యూటీ చైర్మెన్‌గా వ్యవహరించిన నేతి విద్యాసాగర్ పదవీకాలం 2021, జూన్ 3న ముగిసింది. అప్పటినుంచి ఆ పదవి ఖాళీగా ఉన్నది. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఒకే ఒక నామినేషన్ దాఖలు కావడంతో బండ ప్రకాశ్ ఏకగ్రీవ ఎన్నిక లాంఛనమే కానుంది.

మండలి చీఫ్‌విప్‌గా భానుప్రసాదరావు

శాసనమండలి చీఫ్‌విప్, విప్‌లను నియమిస్తూ అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు ఉత్తర్వులు జారీ చేశారు. శాసనమండలి చీప్‌విప్‌గా టి. భానుప్రసాదరావు, విప్‌లుగా శంభీపూర్ రాజు, పాడి కౌశిక్ రెడ్డిలను నియమించారు.

నేటి నుంచి 317 జీవో టీచర్ల దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

హైకోర్టు ఆదేశాల ప్రకారం 317 జీవో ద్వారా వేరే జిల్లాకు బదిలీ అయిన ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో ఆదివారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈనెల 14వ తేదీ వరకు వాటి సమర్పణకు అవకాశమున్నది. అయితే ఆ టీచర్లకు పూర్వ జిల్లా సర్వీసును పరిగణనలోకి తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఉపాధ్యాయ బదిలీలకు ఇప్పటికే 59,909 దరఖాస్తులొచ్చాయి.

కంటి వెలుగులో 33,60,301 మందికి నేత్ర పరీక్షలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కంటి వెలుగు కార్యక్రమంలో రికార్డు స్థాయిలో పరీక్షలు నిర్వహించి ప్రపంచ రికార్డు సాధిస్తామని వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు చెప్తున్నారు. గ్రామాలు, మున్సిపల్ వార్డులు, గ్రామ సచివాలయం, శాసన సభ, డీజీపీ కార్యాలయం, విద్యాసంస్థలు, కార్యాలయాలు, భారీ సమూహాలు ఉండే ప్రాంతాల్లో కంటి వెలుగు శిబిరాలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్టు సమాచార, పౌరసంబంధాల శాఖ శనివారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 33 లక్షల 60 వేల 301 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్టు పేర్కొన్నారు. వారిలో 6 లక్షల 76 వేల 732 మందికి కంటి అద్దాలు ఇచ్చినట్టు తెలిపారు.

కంటివెలుగు గణాంకాలు ఇలా...

మొత్తం కంటిపరీక్షలు: 33,60,301
రీడింగ్ గ్లాసెస్ పంపిణీ: 6,76,732
ప్రిస్కిప్షన్ గ్లాసెస్ కోసం రెఫర్: 4,60,775
కంటి సమస్యలు లేనివారు: 22,22,669 మంది

శ్రీచైతన్య నాలెడ్జ్ హబ్ కోచింగ్ సెంటర్లు ప్రారంభం

- 8 నుంచి 12వ తరగతి వరకు

ఐఐటీ-జేఈఈ, నీట్ శిక్షణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఐఐటీ-జేఈఈ, నీట్ శిక్షణలో విప్లవాత్మకంగా పాఠశాల సమయం అనంతరం విద్యార్థుల కోసం శ్రీ చైతన్య నాలెడ్జ్ హబ్ కోచింగ్ సెంటర్లను ప్రారంభించింది. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్, ఇన్ఫినిటీ లెర్న్ కో ఫౌండర్ సుష్మ బొప్పన మాట్లాడుతూ ఎనిమిదో తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థుల వరకు ఐఐటీ-జేఈఈ, నీట్ శిక్షణ ఇస్తామని చెప్పారు. శ్రీచైతన్యతోపాటు ఇతర పాఠశాలల్లో చదివే విద్యార్థులకూ ఐఐటీ, నీట్‌లో చేరాలనే కల సాకారం చేసుకోవడానికి ఇది అద్భుత అవకాశమని అన్నారు. మొదటి విడతలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్రలో 11 బ్రాంచీల్లో ప్రారంభిస్తున్నామని వివరించారు. హైదరా బాద్‌లో దిల్‌సుఖ్‌నగర్, హిమాయత్‌నగర్, తిరుమలగిరి, అమీర్‌పేట, కూకట్‌పల్లి, కొండాపూర్‌లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రాబోయే రెండు, మూడేండ్లలో దేశవ్యాప్తంగా 200 సెంటర్లకు విస్తరిస్తామని అన్నారు. పాఠశాలల్లో చెప్పే పాఠాలను ఇక్కడ వివరణాత్మకంగా విద్యార్థుల కు అర్థమయ్యేలా బోధిస్తామని వివరించారు. ఆన్‌లైన్‌లో వారాంతపు పరీక్షలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాలెడ్జ్ హబ్ సీఈవో శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నో ప్రాజెక్టులు పూర్తి చేశాం..

మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సాగు, తాగు నీళ్ల గురించి రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన వైఖరి ఉందనీ, అందుకే ఎన్నో ప్రాజెక్టులు పూర్తిచేశామని రాష్ట్ర ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్‌రావు చెప్పారు. శనివారం శాసన సభలో పద్దుల పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ప్రాజెక్టులను తమ హయాంలోనే నిర్మించామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలను తప్పు బట్టారు. కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యం వల్లే పాలమూరు వాసులు వలసలు పోయారని గుర్తుచేశారు. ప్రాజెక్టులు నిర్మిస్తే వారు ఎందుకు వలసలు పోయారో చెప్పాలని కాంగ్రెస్ పక్ష నేత భట్టి విక్రమార్కను ప్రశ్నించారు. గోదావరిలో ప్రతి నీటి చుక్కను వినియోగించుకుంటున్నామని చెప్పారు. కొత్తగా ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టటం వల్లనే సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. కాళేశ్వరంపై బురదజల్లే ప్రయత్నం చేయొద్దని హితవు పలికారు. ఆ ప్రాజెక్టును రికార్డు సమయంలో పూర్తిచేశామనీ, దాంతో సాగు, తాగు, పరిశ్రమల అవసరాలు తీరుతున్నాయని వివరించారు. కృష్ణా నది నీటి వాటా గురించి పోరాటం చేస్తున్నామన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నెట్టం పాడు, కల్వకుర్తి, భీమా ప్రాజెక్టుల కింద కేవలం 27,300 ఎకరాలు మాత్రమే పారిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో పంపు హౌజ్‌లు పూర్తి కాలేదు..దాంతో కాలువలు నిర్మించలేదనీ, పంపులు, మోటార్లు గడ్డ మీద పెట్టింది నిజం కాదా'? అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం , రూ.3,663 కోట్లను ఖర్చుపెట్టి అసంపూర్తిగా ఉన్న మూడు ప్రాజెక్టులను పూర్తి చేసి రూ.5.69 లక్షల ఎకరాలకు నీరందించిందని తెలిపారు. టీడీపీ హయాంలో ప్రాజెక్టుల వద్ద బాబు కొబ్బరి కాయలు కొట్టగా కాంగ్రెస్ హయాంలో ప్రాజెక్టుల వద్ద రాజశేఖర్‌రెడ్డి మొక్కలు నాటి డ్రామాలు ఆడారని ఎద్దేవా చేశారు. 13.9.22న పాలమూరు డీపీఆర్‌ను కేంద్రానికి సమర్పించామని చెప్పారు.రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మీద 12.5.22 నాడు కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు మీటింగ్‌లో అభ్యంతరం వ్యక్తం చేశామని తెలిపారు. ఎన్‌జీటీ, కేఆర్‌ఎంబీతో ఏపీ ప్రభుత్వానికి పనులు ఆపాలని ఉత్తర్వులు ఇప్పించగలిగామని చెప్పారు. వీటితో పాటు మిషన్ కాకతీయ ద్వారా చెరువుల మరమ్మతులు చేపట్టి, పెద్ద సంఖ్యలో చెక్ డ్యాంలు నిర్మించడం వల్ల పాలమూరు పచ్చబడి, వలసపోయిన వారు వాపసు వచ్చారని ఆయన స్పష్టం చేశారు.

కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి..

కృష్ణా నదిలో తెలంగాణ వాటా తేల్చటంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని మంత్రి ఈ సందర్భంగా చెప్పారు. ఈ విషయంలో కేంద్ర జలవనరుల శాఖ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవటం లేదని చెప్పారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నాన్చుడు ధోరణి వల్ల రాష్ట్రానికి తీవ్ర నష్ట జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి రావాల్సిన న్యాయబద్ధమైన వాటాను తేల్చటంలో తాత్సారం, మొండి వైఖరి ఎందుకని ప్రశ్నించారు. ఈ విషయంలో ఇక్కడున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు నోరు మెదపటం లేదని ఎద్దేవా చేశారు.

పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు..

పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించటమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి హరిశ్‌రావు చెప్పారు. ప్రయివేటు ఆస్పత్రులపై ఇప్పటివరకు ఎలాంటి నియంత్రణ లేదనీ, వాటిపై నియంత్రణ తీసుకొచ్చేందుకు క్లినికల్ ఎస్టాబ్లిష్ యాక్ట్‌ను తీసుకురావడానికి ప్రభుత్వం ఆలోచిస్తుందని చెప్పారు. పేదలకు తగిన వైద్య సేవలు అందించే ఉద్దేశంతోనే జిల్లాకో మెడికల్ కాలేజీలను తీసుకొస్తున్నామని తెలిపారు. మెడికల్ కాలేజీ వస్తే ప్రొఫెసర్లు వస్తారనీ,.. 650 పడకల ఆస్పత్రి వస్తుందనీ,.. ఆపరేషన్ థియేటర్లు వస్తాయని చెప్పారు. దీని ద్వారా పేద ప్రజలకు వాళ్ల జిల్లాలోనే కార్పొరేట్ వైద్యం అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నలువైపులా నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మిస్తున్నట్టు తెలిపారు.

ఎల్బీనగర్, ఎర్రగడ్డ, ఆల్వాల్, గచ్చిబౌలిలో 4200 పడకలతో నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను.. నిమ్స్‌లో 2వేల పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను.. వరంగల్‌లో 1100 కోట్లతో 2వేల పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను నిర్మిస్తున్నామని తెలిపారు. దాదాపు 10 వేల సూపర్ స్పెషా లిటీ పడకలను ప్రజలకు అందుబాటు లోకి తీసుకొస్తున్నామని వివరించారు. ఈ 10 వేల పడకలు అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం ఉండదని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా కార్పొరేట్ సేవలందించే దిశగా ప్రభుత్వం వెళ్తోందని తెలిపారు.

జూన్ 2 నాటికి...కాళోజీ కళాక్షేత్రం

- మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హనుమకొండలోని బాలసముద్రంలో మూడెకరాల్లో రూ.50 కోట్లతో నిర్మిస్తున్న కాళోజీ కళాక్షేత్రం ఈ ఏడాది జూన్ 2 నాటికి అందుబాటులోకి వస్తుందని రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలోని తన కార్యాలయంలో హనుమకొండ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్‌తో కలిసి ఈ అంశంపై మంత్రి సమీక్షించారు. పనులను జూన్ 2 నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్రీడలు, పర్యాటకం, సాంస్కృతిక శాఖల కార్యక్రమాల క్యాలెండర్‌లను రూపొందించాలని ఆయా శాఖల ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండి మనోహర్, రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, ప్రొఫెసర్ తిరుమలరావు పాల్గొన్నారు.

రేపు అంబేద్కర్ వర్సిటీలో స్పెషల్ బీఎడ్ స్పాట్ అడ్మిషన్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో బీఎడ్ (స్పెషల్ ఎడ్యుకేషన్) స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ సోమవారం జరగనుంది. ఈ మేరకు విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ ఎల్వీకే రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తిగల అభ్యర్థులు స్పాట్ అడ్మిషన్లకు కావాల్సిన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తేవాలని సూచించారు. వర్సిటీ నిర్వహించిన ప్రవేశ పరీక్ష రాసి అందులో ర్యాంకు పొందిన వారే హాజరు కావాలని కోరారు. ఖాళీగా ఉన్న సీట్లు, ఇతర వివరాలకు www.braou.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

హైదరాబాద్‌లో తగ్గిన నివాస రిజిస్ట్రేషన్లు

- నైట్ ఫ్రాంక్ వెల్లడి

హైదరాబాద్ : కొత్త ఏడాది జనవరిలో హైదరాబాద్‌లో నివాస రిజిస్ట్రేషన్లలో తగ్గుదల చోటు చేసుకుందని నైట్‌ఫ్రాంక్ ఓ రిపోర్టులో తెలిపింది. గడిచిన నెలలో హైదరాబాద్‌లో 4,872 యూనిట్ల నివాస ప్రాపర్టీలు నమోదయ్యాయని పేర్కొంది. వీటి మొత్తం విలువ రూ.2,494 కోట్లుగా ఉంటుందని అంచనా వేసింది. ఏడాదికేడాదితో పోల్చితే యూనిట్ల పరంగా 35 శాతం, విలువ పరంగా 26 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. హైదరాబాద్ నివాస మార్కెట్‌లో హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి అనే నాలుగు జిల్లాలను నైట్‌ఫ్రాంక్ పరిగణలోకి తీసుకుంటుంది. గత కొన్ని త్రైమాసికాల్లో నగరం సగటు ధరలలో పెరుగుదలను కూడా చూసిందని తెలిపింది. ఇది మొత్తం అమ్మకాల ఊపు మందగించడానికి ఓ కారణమని పేర్కొంది.

ప్రతి పక్షాలకు సమస్యల పట్ల చిత్తశుద్ధి లేదు : మంత్రి వేముల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజా సమస్యల పట్ల ప్రతిపక్షాలకు చిత్తశుద్ధి లేదని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. శనివారం సభలో మరో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పద్దులపై మాట్లాడుతుండగా ప్రతిపక్ష సభ్యులెవరూ సభలో లేరు. ఈ విషయాన్ని వేముల స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలు తమకు సమయం ఇవ్వటం లేదంటూ బయట విమర్శలు గుప్పిస్తున్నాయనీ, సమయమిస్తే మాత్రం తమకు కావాల్సిన రాజకీయాలు మాట్లాడి సభ నుంచి వెళ్లిపోతున్నారంటూ విమర్శించారు. ఇది చాలా అన్యాయమని అన్నారు. రాష్ట్ర ప్రజలకు సంబంధించిన ముఖ్యమైన పద్దులపై మంత్రులు సమాధాన మిస్తుంటే ప్రతిపక్ష సభ్యులు సభలో లేకపోవడం విచారకరమని తెలిపారు. వారిని పిలిచి మాట్లాడాలంటూ స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు.

SRI HAVISHA HOSPITALITY & INFRASTRUCTURE LIMITED
(FORMERLY SHRI MATRE POWER & INFRASTRUCTURE LTD & SHRI SHAKTI LPG LIMITED)
Regd. office: Venus Plaza, Begumpet, Hyderabad-500 016

31 డిసెంబర్, 2022తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలల కొరకు ఆర్థిక ఫలితాల యొక్క ఆడిట్ చేయని నివేదిక
(రూ.లక్షల్లో, ఒకవేళ పేర్కొనబడితేకపోయినట్లయితే)

క్ర. సం.	వివరాలు	ముగిసిన త్రైమాసికం 31.12.2022 ఆడిట్‌చేయనివి	30.09.2022 ఆడిట్‌చేయనివి	31.12.2021 ఆడిట్‌చేయనివి	ముగిసిన 9 నెలలు 31.12.2022 ఆడిట్‌చేయనివి	31.12.2021 ఆడిట్‌చేయనివి	ముగిసిన సం॥ 31.03.2022 ఆడిట్‌చేసినవి
I	ఆపరేషన్ల నుండి ఆదాయం	423.30	415.20	228.70	1,267.02	450.05	734.62
II	ఇతర ఆదాయం	43.78	46.88	43.27	135.27	126.41	174.52
III	పూర్తి ఆదాయం (1+2)	**467.08**	**462.08**	**271.97**	**1,402.29**	**576.46**	**909.14**
IV	వ్యయాలు						
	వినియోగించిన మెటీరియల్ యొక్క వ్యయం	74.14	51.73	38.85	212.00	80.20	112.85
	ఉద్యోగి ప్రయోజన వ్యయం	134.04	119.53	73.67	349.54	205.78	324.89
	ఫైనాన్షియల్ కాస్ట్	4.24	3.00	-	9.06	-	12.02
	డిప్రిసియేషన్ మరియు అమార్టిజేషన్ వ్యయం	29.74	29.74	47.91	89.22	143.73	99.71
	ఇతర వ్యయాలు	163.03	222.35	57.06	574.54	183.96	351.97
	పూర్తి వ్యయం(4)	**405.20**	**426.35**	**217.49**	**1,234.36**	**613.67**	**901.44**
V	లాభం/(నష్టం) పన్నుకు ముందు (3-4)	**61.88**	**35.73**	**54.48**	**167.93**	**(37.21)**	**7.70**
VI	పన్ను వ్యయాలు:						
	ప్రస్తుత పన్ను	-	-	-	-	-	-
	డిఫర్డ్ పన్ను	-	-	(6.25)	-	(18.76)	(50.13)
	పూర్తి పన్ను వ్యయాలు	-	-	**(6.25)**	-	**(18.76)**	**(50.13)**
VII	నికర లాభం/(నష్టం) సం.కొరకు పన్ను తర్వాత (5-6)	**61.88**	**35.73**	**60.73**	**167.93**	**(18.45)**	**57.83**
VIII	ఇతర సమగ్ర ఆదాయం (పన్ను యొక్క నికర)						
	ఈ ఐటమ్స్‌కు సంబంధించిన లాభ నష్టాల పద్దుకు రీక్లాసిఫైడ్	-	-	-	-	-	-
	చేయబడనటువంటివి	-	-	-	-	-	-
IX	పూర్తి సమగ్ర ఆదాయం /(నష్టం (7-8)	**61.88**	**35.73**	**60.73**	**167.93**	**(18.45)**	**57.83**
X	వాటా ఒక్కింటికి ఆదాయం						
	ప్రతి వాటాపై బేసిక్ ఆదాయం	0.02	0.01	0.02	0.06	(0.01)	0.02
	ప్రతి వాటాపై డైల్యూటెడ్ ఆదాయం	0.02	0.01	0.02	0.06	(0.01)	0.02

గమనిక:

1) పై ఫలితాలు ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు ఫిబ్రవరి11, 2023న నిర్వహించబడిన వారి సదరు సమావేశంలో కంపెనీ యొక్క బోర్డు ఆఫ్ డైరెక్టర్లచే రికార్డుచేయబడినవి. డిసెంబర్ 31, 2022తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలల కొరకు ఆర్థిక ఫలితాలు కంపెనీ యొక్క చట్టబద్ధ ఆడిటర్లచే సమీక్షించబడినవి. డిసెంబర్ 31, 2022తో ముగిసిన త్రైమాసిక అంకెలు అనునవి మార్చి 31, 2022తో ముగిసిన తొమ్మిది నెలల కొరకు ఆడిట్‌చేయని బ్యాలెన్స్ అంకెలు మరియు సెప్టెంబర్ 30, 2022తో ముగిసిన వార్షికం కొరకు ఆడిట్‌చేయని అంకెలు ప్రచురించబడినవి.
2) 31,డిసెంబర్,2021తో ముగిసిన త్రైమాసికానికి సంబంధించి మరియు 31,డిసెంబర్,2021తో ముగిసిన తొమ్మిది నెలల కొరకు అంకెలు చూపబడినవి మరియు అమాల్గమేషన్ యొక్క ప్రభావం మేరకు (దిగువ పేర్కొనబడిన పాయింట్4 రిఫర్ చేయండి)మరియు 31,డిసెంబర్,2021తో ఆడిట్ చేయని వార్షికానికి సంబంధించిన అంకెలు చూపబడినవి.
3) ఈ ఫలితాలు కంపెనీల (ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్)(సవరణ) రూల్స్, 2015 (ఇండ్ ఏఎస్)తో అనుసరించి సిద్ధంచేయబడినవి. సెక్యూరిటీస్ & ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (లిస్టింగ్ ఆబ్లిగేషన్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 (సవరించినట్లు)(లిస్టింగ్ రెగ్యులేషన్స్) యొక్క నియమాలు మరియు పాలసీస్ మరియు దాని క్రింద జారీచేయబడిన మరియు ఇతర సంబంధిత అకౌంటింగ్ పాలసీలతో చదువబడే కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 133 క్రింద సిఫారసేయబడిన కంపెనీస్ (ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్) రూల్స్, 2015తో అనుసరించి ఫలితాలు సిద్ధంచేయబడినవి.
4) ఎ) గౌరవ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్ (గౌరవ ఎన్‌సిఎల్‌టి)వారు మెసర్స్ శ్రీ శక్తి రిసార్ట్స్ & హోటల్స్ లిమిటెడ్ (ట్రాన్స్‌ఫరర్ కంపెనీ) మరియు శ్రీ హవిషా హాస్పిటాలిటీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ట్రాన్స్‌ఫరీ కంపెనీ) మరియు వారి యొక్క సంబంధిత వాటాదారులు మరియు క్రెడిటార్లు (స్కీమ్)కు సంబంధించి 16,నవంబర్,2021 తేదీన వెలువడిన ఉత్తర్వుల ప్రకారం స్కీమ్ ఆఫ్ అమాల్గమేషన్ మంజూరు కోసం ఆదేశించబడినది. (అపాయింటెడ్ తేది:01,ఏప్రిల్,2020)
బి) స్కీమ్ ఆఫ్ అరేంజ్‌మెంట్‌కు అనుగుణంగా, శ్రీ శక్తి రిసార్ట్స్ & హోటల్స్ లిమిటెడ్ వారు డిజాల్వ్ చేశారు మరియు శ్రీ హవిషా హాస్పిటాలిటీ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌తో మెర్జ్ చేయబడింది. గౌరవ ఎన్‌సిఎల్‌టి, హైదరాబాద్ బెంచ్, తెలంగాణ వారి యొక్క 16,నవంబర్,2021 ఆదేశం మేరకు అపాయింటెడ్ తేది:01,ఏప్రిల్,2020 మరియు అకౌంటింగ్ అమాల్గమేషన్ కోసం మంజూరు చేయబడినది "పూలింగ్ ఇంటరెస్ట్ మెథడ్" అకౌంటింగ్ స్టాండర్డ్-14ప్రకారం పేర్కొనబడింది. ఐఎన్‌డి ఏఎస్ 103 ప్రకారం అపెండిక్స్-సి అనుగుణంగా అకౌంటింగ్ (అపెండిక్స్ సి కామన్ కంట్రోల్ విధానంలోని కాంబినేషన్ ప్రకారం బిజినెస్ ఎంటిటీలు చూపబడినవి)
5) ప్రస్తుతమున్న 30బిండ్లలో లీజు పిరియడ్‌లో భాగంగా ఏపిఎం ఎక్స్‌టెన్షన్‌లో భాగంగా తదుపరి ధ్రువీకరణ చూపబడింది. సంబంధిత డాక్యుమెంట్‌కు సంబంధించిన ప్రాసెస్ చూపబడినది. అకౌంటింగ్ పాలసీలు (ఐఎన్‌డి ఏఎస్ 116 ప్రకారం) లీజు డీడ్ తర్వాత మళ్లీ అస్సైన్ చేయబడి ఎగ్జిక్యూట్ చేయబడుతుంది.
6) గత సంవత్సరం పిరియడ్ యొక్క రీగ్రూప్ చేయబడినవి/రీక్లాసిఫైడ్ చేయబడినవి.
7) కంపెనీ "హోటల్ బిజినెస్" సెగ్మెంట్ ద్వారా సింగిల్ బిజినెస్‌గా చూపబడింది.
8) ఇన్వెస్టర్స్ కంప్లైంట్స్ స్థితి- నిల్.

బోర్డు ఆదేశం మేరకు
For Sri Havisha Hospitality and Infrastructure Limited
సం/-
డి.వి.మనోహర్
చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్
DIN: 00223342

ప్రదేశం: హైదరాబాద్
తేది: 11.02.2023

Apollo Micro Systems Limited
apollo microsystems
(CIN: L72200TG1997PLC026556)
Registered office: Plot No. 128/A, Road No. 12, BEL Road, IDA Mallapur, Hyderabad - 500076, Telangana.
Telephone: +91 40 27167000 - 99; Facsimile: +91 40 2715 0820; E-mail: cs@apollo-micro.com; Website: www.apollo-micro.com

31 డిసెంబర్, 2022తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలల కొరకు ఆడిట్‌చేయని కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల సారాంశం
పూర్తి మొత్తాలు లక్షల రూపాయల్లో ఒకవేళ పేర్కొనకపోయినట్లయితే

వివరాలు	ముగిసిన త్రైమాసికం 31.12.2022 (ఆడిట్‌చేయనివి)	30.09.2022 (ఆడిట్‌చేయనివి)	31.12.2021 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన తొమ్మిది నెలలు 31.12.2022 (ఆడిట్‌చేయనివి)	31.12.2021 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన సంవత్సరానికి 31.03.2022 (ఆడిట్‌చేసినవి)
ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం	8,269.16	5,239.45	6,484.39	19,149.89	13,826.68	24,395.05
మినహాయింపుగల ఐటంలు & పన్నుకు ముందు లాభం	1,095.62	491.58	597.58	1,943.32	1,144.15	2,025.13
పన్నుకు ముందు కాలవ్యవధి కొరకు నికర లాభం	915.32	491.58	597.58	1,763.02	1,144.15	2,025.13
పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం	660.23	328.67	338.26	1,152.62	671.69	1,461.52
కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం	660.23	328.67	338.26	1,152.62	671.69	1,460.87
చెల్లించిన ఈక్విటీ వాటా మూలధనం	2,076.39	2,076.39	2,076.39	2,076.39	2,076.39	2,076.39
ఇతర ఈక్విటీ						29,926.85
వాటా ఒక్కింటికి రాబడి (ముఖ విలువ రూ.10/- చొప్పున)						
(ఎ) బేసిక్	3.18	1.58	1.63	5.55	3.23	7.04
(బి) డైల్యూటెడ్	3.18	1.58	1.63	5.55	3.23	7.04

కంపెనీ యొక్క ఆడిట్‌చేయని స్టాండ్‌అలోన్ ఫలితాల యొక్క కీ నెంబర్లు దిగువ విధంగా కలవు:

వివరాలు	ముగిసిన త్రైమాసికం 31.12.2022 (ఆడిట్‌చేయనివి)	30.09.2022 (ఆడిట్‌చేయనివి)	31.12.2021 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన తొమ్మిది నెలలు 31.12.2022 (ఆడిట్‌చేయనివి)	31.12.2021 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన సంవత్సరానికి 31.03.2022 (ఆడిట్‌చేసినవి)
ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం	8,269.16	5,239.45	6,484.39	19,149.89	13,826.68	24,395.01
మినహాయింపుగల ఐటంలు & పన్నుకు ముందు లాభం	1,096.13	491.84	597.72	1,944.23	1,144.63	2,025.76
పన్నుకు ముందు లాభం	915.84	491.84	597.72	1,763.93	1,144.63	2,025.76
పన్ను తరువాత లాభం	660.58	328.80	338.41	1,153.24	672.06	1,461.95
పూర్తి సమగ్ర ఆదాయం	660.58	328.80	338.41	1,153.24	672.06	1,462.30

గమనిక:

1. సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 (సవరించినట్లు) యొక్క రెగ్యులేషన్ 33 నియమాలు & అదులోని సంబంధిత రూల్స్ మరియు సెబీ సర్క్యులర్ తేదీ.5, జులై, 2016 తో చదువగల కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 133 క్రింద నిర్దేశించిన ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్ ('ఐఎన్‌డి ఏఎస్')ను అనుసరించి ఆర్థిక ఫలితాలు సిద్ధం చేయబడినవి.
2. సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్ఛేంజీలతో దాఖలుచేసిన 31, డిసెంబర్, 2022తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలల కొరకు ఆడిట్‌చేయని కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల యొక్క వివరణాత్మక ఫార్మాట్‌కు పై పేర్కొన్నవి సారాంశం. 31, డిసెంబర్, 2022తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలల కొరకు ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల (స్టాండ్‌అలోన్ & కన్సాలిడేటెడ్) యొక్క పూర్తి వివరాలు కంపెనీ యొక్క వెబ్‌సైట్ అనగా ఇన్వెస్టర్ ఇన్ఫర్మేషన్ సెక్షన్ క్రింద www.apollo-micro.com పై మరియు స్టాక్ ఎక్స్ఛేంజీల వెబ్‌సైట్స్ అనగా www.bseindia.com.మరియు www.nseindia.com పై అందుబాటులో ఉన్నాయి.

For and on behalf of the Board of Directors of Apollo Micro Systems Limited
సం/-
కరుణాకర్ రెడ్డి బద్దం
మేనేజింగ్ డైరెక్టర్
DIN: 00790139

ప్రదేశం : హైదరాబాద్
తేది: 10, ఫిబ్రవరి,2023

SoftSol India Limited
Regd. Off: Plot No. 4, Software units layout, Cyberabad, Hyderabad-500 081- India, T:+91(40)- 42568500, E: cs@softsol.com, URL: www.softsolindia.com, CIN:L72200TG1990PLC011771

31, డిసెంబర్, 2022తో ముగిసిన అర్ధ సంవత్సరం కొరకు ఆడిట్‌చేయని స్టాండ్‌అలోన్ & కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల సారాంశం

పార్ట్-1 (రూపాయలు లక్షల్లో ఇపిఎస్ మినహా)

క్ర. సం.	వివరాలు	స్టాండ్‌అలోన్ ముగిసిన త్రైమాసికం 31.12.2022 (Unaudited)	30.09.2022 (Unaudited)	31.12.2021 (Unaudited)	ముగిసిన తొమ్మిది నెలలు 31.12.2022 (Unaudited)	31.12.2021 (Unaudited)	ముగిసిన సం॥ 31.03.2022 (Audited)	కన్సాలిడేటెడ్ ముగిసిన త్రైమాసికం 31.12.2022 (Unaudited)	30.09.2022 (Unaudited)	31.12.2021 (Unaudited)	ముగిసిన తొమ్మిది నెలలు 31.12.2022 (Unaudited)	31.12.2021 (Unaudited)	ముగిసిన సం॥ 31.03.2022 (Audited)
1	ఆపరేషన్ల నుండి మొత్తం ఆదాయం (నికర)	748.04	849.38	609.91	2,420.99	1,708.56	2,421.08	1,923.58	2,145.61	2,077.80	2,077.80	5,158.21	7,426.39
2	కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (పన్ను, మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంలకు ముందు)	236.44	286.86	111.72	750.57	496.68	656.82	753.24	(229.41)	783.40	(1,152.00)	1,864.26	1,219.02
3	పన్నుకు ముందు కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల మరియు/ లేదా అసాధారణ ఐటంల తరువాత)	236.44	286.86	111.72	750.57	496.68	656.82	753.24	(229.41)	783.40	(1,152.00)	2,598.30	1,961.04
4	పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల మరియు/ లేదా అసాధారణ ఐటంల తరువాత)	177.33	220.42	92.20	562.93	409.90	432.59	685.30	(302.78)	1,117.93	(1,357.08)	2,484.98	1,672.39
5	కాలవ్యవధి కొరకు మొత్తం సమగ్ర ఆదాయం (కాలవ్యవధి కొరకు కంప్రైసింగ్ లాభం/(నష్టం) (పన్నుతరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత)	289.72	497.39	158.41	1,214.90	636.91	1,081.00	853.73	24.82	1,196.58	(495.56)	2,671.26	2,463.14
6	ఈక్విటీ వాటా మూలధనం (ముఖ విలువ రూ.10/- చొప్పున)	1,723.65	1,723.65	1,723.65	1,723.65	1,723.65	1,723.65	1,723.65	1,723.65	1,723.65	1,723.65	1,723.65	1,723.65
7	గత సంవత్సరం యొక్క ఆడిట్‌చేసిన బ్యాలెన్స్ షీట్‌లో చూపినట్లుగా రిజర్వు (రివ్యాల్యూయేషన్ రిజర్వు మినహాయించి)	-	-				14,493.48					-	16,306.18
8.	సెక్యూరిటీ ప్రీమియం ఖాతా	670.11	670.11	670.11	670.11	670.11	670.11	670.11	670.11	670.11	670.11	670.11	670.11
9.	నికర విలువ	17,432.03	17,142.32	15,773.05	17,432.03	15,773.05	16,217.13	18,097.81	17,244.08	18,249.25	18,097.81	18,249.25	18,593.37
10.	చెల్లించిన క్యాపిటల్/ బాకీపడిన డెట్	1,723.65	1,723.65	1,723.65	1,723.65	1,723.65	1,723.65	1,723.65	1,723.65	1,723.65	1,723.65	1,723.65	1,723.65
11.	ఔట్‌స్టాండింగ్ రిడీమబుల్ ప్రిఫరెన్స్ షేర్స్	-	-	-			-	-	-	-	-	-	-
12.	డెట్/ ఈక్విటీ షేర్	-	-	-			-	0.09	0.09	0.03	0.09	0.03	0.07
13.	వాటా ఒక్కింటికి రాబడి (రూ.10/- చొప్పున) (కొనసాగుతున్న మరియు నిలిచిపోయిన ఆపరేషన్ల కొరకు)-రెండు- బేసిక్& డైల్యూటెడ్ (రూ.)	1.05	1.31	0.55	3.34	2.43	2.57	4.07	(1.80)	6.64	(8.06)	14.76	9.93
14.	క్యాపిటల్ రిడెంప్షన్ రిజర్వు	180.51	180.51	180.51	180.51	180.51	180.51	180.51	180.51	180.51	180.51	180.51	180.51
15.	డిబెంచర్ రిడెంప్షన్ రిజర్వు	-	-	-	-		-	-	-	-	-	-	-
16	డెట్ సర్వీస్ కవరేజ్ రెషియో	-	-	-	-		-	-	-	-	-	-	-
17.	ఇంట్రెస్ట్ సర్వీసు కవరేజ్ రెషియో	-	-	-	-		-	-	-	21.29	-	21.29	20.04

గమనిక:

(1) సెబీ (లిస్టింగ్ అండ్ అదర్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌తో దాఖలు చేయబడిన త్రైమాసిక ఆర్థిక ఫలితాల యొక్క వివరణాత్మక ఫార్మాట్‌కు పై పేర్కొన్నవి సారాంశం. త్రైమాసిక ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు స్టాక్ ఎక్స్ఛేంజ్ వెబ్‌సైట్: www.bseindia.com మరియు కంపెనీ వెబ్‌సైట్: www.softsolindia.com పై అందుబాటులో ఉంటాయి.
(2) పైన పేర్కొన్న ఆడిట్‌చేయని స్టాండ్‌లోన్ & కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాలు బోర్డు యొక్క ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు 10,ఫిబ్రవరి, 2023న నిర్వహించబడిన వారి సమావేశంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ద్వారా ఆమోదించబడినవి.
(3) ఈ నివేదిక అనునది కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 133 క్రింద నిర్దేశించిన కంపెనీస్ (ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్) రూల్స్, 2015 (ఐఎన్‌డి ఏఎస్) మరియు ఇతర గుర్తించబడిన అకౌంటింగ్ ప్రాక్టిసెస్ మరియు ఎక్స్‌టెండ్ వర్తింపు పాలసీలతో అనుసరించి తయారు చేయబడినవి. 1 ఏప్రిల్, 2017 (ట్రాన్సిషన్ తేది.1 ఏప్రిల్, 2016) నుండి ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్ (ఐఎన్‌డి ఏఎస్)ను కంపెనీ ఆమోదించింది.
(4) గత త్రైమాసికం కొరకు అంకెలు అనునవి పూర్తి ఆర్థిక సంవత్సరానికి సంబంధిత ఆడిట్‌చేసిన అంకెలు & ఆర్థిక సంవత్సరపు 3వ త్రైమాసికం వరకు సంవత్సరం నుండి తేది వరకు బ్యాలెన్సింగ్ అంకెలు.

For Softsol India Limited
(DIN: 00474589)

ప్రదేశం: హైదరాబాద్
తేది: 10-02-2023

రవాణా రాబడి డబుల్

- ఈ ఏడాది జనవరి నాటికి ఆర్టీఏకు రూ.5,304 కోట్ల ఇన్‌కమ్
- మార్చి నాటికి మరో వెయ్యి కోట్లతో రూ.6,350 కోట్ల రాబడి అంచనా
- గతేడాది మొత్తం రూ.3,971 కోట్లు ఆర్జించిన రవాణాశాఖ
- లైఫ్, క్వార్టర్లీ, గ్రీన్‌ట్యాక్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా పెరిగిన ఆదాయం

నవతెలంగాణ-సిటీబ్యూరో

రవాణాశాఖ వార్షిక ఆదాయం భారీగా పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2022-23లో దాదాపు రెండింతల ఆదాయం సాధించే దిశగా దూసుకెళ్తోంది. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే లైఫ్ ట్యాక్స్(జీవితకాలపు పన్ను)తోపాటు క్వార్టర్లీ, గ్రీన్ ట్యాక్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫీజులు, సర్వీస్ చార్జీల ద్వారా వసూలయ్యే పన్నుల్లో భారీ వృద్ధి నమోదైంది. దాదాపు పదేండ్ల తర్వాత గతేడాది మే నెలలో ఒక్కొక్క సర్వీస్‌కు సంబంధించిన పన్నులను రవాణాశాఖ సవరిస్తూ వచ్చింది. దీంతో గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పన్నుల ద్వారా రవాణాశాఖ రూ.5304 కోట్లు రాబడి సాధించి రికార్డుకెక్కింది. మార్చి నాటికి మరో రూ.1063 కోట్ల ఆదాయం రానుందని.. మొత్తం రూ.6,367 కోట్లు ఆదాయం రావచ్చునని ఆర్టీఏ ఉన్నతాధికారుల అంచనా. వాస్తవానికి 2022-23 ఆర్థిక సంవత్సరానికి రవాణాశాఖ రూ.4,953 కోట్లు టార్గెట్ పెట్టుకోగా.. మే నెలలో వివిధ పన్నుల సవరణతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రవాణా ఆదాయం రూ.5345 కోట్లుగా అంచనా వేశారు. ప్రస్తుతం లెక్కల ప్రకారం చూస్తే రవాణాశాఖ మార్చి చివరి నాటికి అనుకున్న లక్ష్యాన్ని దాటిపోనుంది. కరోనా అనంతరం 2021-22లో రవాణాశాఖ రాష్ట్రవ్యాప్తంగా రూ.3971 కోట్లు ఆదాయం ఆర్జించిన విషయం తెలిసిందే. ఇక గ్రేటర్ హైదరాబాద్ ఆదాయ లక్ష్యం రూ.2916 కోట్లు కాగా.. ఇందులో ఇప్పటికే రూ.3వేల కోట్లకుపైగా వచ్చింది. హైదరాబాద్ జిల్లా పరిధిలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను రూ.982.98 కోట్లు, రంగారెడ్డి రూ.1150 కోట్లు, మేడ్చల్ జిల్లా రూ.900 కోట్లకుపైగా ఆదాయాన్ని ఆర్జించినట్టు ఆర్టీఏ ఉన్నతాధికారులు తెలిపారు. ప్రభుత్వానికి ఆదాయం తీసుకొచ్చే శాఖల్లో రవాణాశాఖ ముఖ్యమైనది. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే లైఫ్ ట్యాక్స్, త్రైమాసిక పన్ను, ఫీజులు, సర్వీసు చార్జీలు, డిటెక్షన్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా ఏటా కోట్లాది రూపాయలు ప్రభుత్వానికి సమకూర్చుతోంది. ఏ ఏడాదికి ఆ ఏడాది టార్గెట్ పెంచుకోవడం ఆనవాయితీ. రాష్ట్రవ్యాప్తంగా రవాణాశాఖకు మొత్తం 54 కార్యాలయాలు ఉండగా.. గ్రేటర్‌లోని మూడు జిల్లాల పరిధిలో 11 ఆఫీసులున్నాయి. వీటి పరిధిలో రోజూ 5వేలకు పైగా లావాదేవీలు జరుగుతుండగా.. ఒక్క గ్రేటర్ పరిధిలో ప్రతిరోజూ వెయ్యి నుంచి పదిహేను వందల వరకు వాహనాల రిజిస్ట్రేషన్ జరుగుతుంటాయి. పన్నుల సవరణ తరువాత.. ప్రస్తుతం రూ.లక్ష లోపు విలువ చేసే ద్విచక్ర వాహనం కొనుగోలు చేస్తే గతంలో రూ.9వేలు చెల్లిస్తే సరిపోయేది. ఇప్పుడు 12వేల వరకు జీవితకాల పన్ను చెల్లించాల్సి వస్తోంది. అంటే దాదాపు రూ.3వేలు అదనం. అలాగే, రూ.10లక్షల లోపు విలువ చేసే కారు కొనుగోలు చేస్తే గతంలో రూ.1.20లక్షల పన్ను రూపంలో చెల్లించేవారు. ఇప్పుడది రూ.1.40 లక్షలు వస్తుండగా.. అంటే రూ.20వేలు పెరిగింది. ఇదొక్కటే కాదు.. గ్రీన్ ట్యాక్స్ సైతం బైక్‌లకు 2వేలు, కార్లకు రూ.5వేల వరకు పెంచింది. ఈ నేపథ్యంలో కొత్త వాహనం కొనుగోలు సమయంలో టూ వీలర్‌కు 12 శాతం, పది లక్షలు దాటిన వాహనాల కొనుగోలుపై 14 లైఫ్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 5.26లక్షల మోటార్ సైకిళ్లు, 1.62లక్షల కార్లు, ఇతర వాహనాలు 1.11 లక్షలతో మొత్తం 7.98లక్షల వాహనాలు ఆర్టీఏలో నమోదు కాగా.. తద్వారా రూ.3,840 కోట్లు ఆదాయం సమకూరింది. అంటే 12శాతం వృద్ధి నమోదైంది. ఇక గ్రీన్‌ట్యాక్స్ ద్వారా రూ.52 కోట్లు, ఫీజుల ద్వారా రూ.458 కోట్లు, సర్వీసు చార్జీల ద్వారా 113 కోట్లు, డిటెక్షన్ల ద్వారా రూ.124కోట్లు వసూలైంది. ఇదిలావుంటే గ్రేటర్ పరిధిలో అన్నీ కలిపి రూ.3వేల కోట్ల వరకు వసూలైనట్టు ఆర్టీఏ అధికారులు తెలిపారు.

వార్షిక సంవత్సరం ఆదాయం (రూ.కోట్లల్లో)

వార్షిక సం.	నిర్దేశిత లక్ష్యం	సాధించిన లక్ష్యం
2021-22	రూ.4700	3971
2022-23	రూ. 5345	5304 (జనవరి చివరి వరకు)

2022-23 వార్షిక ఆదాయం ఇలా..

త్రైమాసిక పన్ను	రూ. 716 కోట్లు
జీవితకాలపు పన్ను	రూ.3840 కోట్లు
ఫీజులు	రూ.458 కోట్లు
సర్వీసు ఫీజు	రూ.113కోట్లు
గ్రీన్‌ట్యాక్స్	రూ.53కోట్లు
ఎన్‌ఫోర్స్‌మెంట్ (డిటెక్షన్)	రూ.124 కోట్లు

సహకార రంగాన్ని కాపాడాలి

- పీఏసీఎస్‌లను మరింత బలోపేతం చేయాలి
- వ్యవసాయం పద్దు చర్చలో చెన్నమనేని రమేశ్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ప్రోత్సహించడమేగాక మరింత బలోపేతం చేయాలని శాసనసభ్యులు చెన్నమనేని రమేశ్ అభిప్రాయపడ్డారు. కరోనాకాలంలోనూ కరీంనగర్ డీసీసీబీ లాభాలబాటలో నడిచిందని గుర్తు చేశారు. వ్యవసాయానికి సాగునీరు, విద్యుత్, ఇతర అవసరాలను అందిస్తూ ప్రోత్సహించడం మంచి పరిణామమని అన్నారు. మహిళలు, చేతివృత్తులు, అసంఘటిత రంగాలకు సహకార రంగం సహకరిస్తుందని వివరించారు. తద్వారా ఉత్పాదకశక్తి పెరిగి సహకార సంఘాలు లాభాల్లో నడుస్తున్నాయని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ప్రజలను భాగస్వాములను చేస్తే అత్యుత్తమ ఫలితాలు వస్తాయని వ్యాఖ్యానించారు. ఇటీవల దావోస్‌లోనూ ఈ రంగంపై చర్చ జరిగిందని గుర్తుచేశారు. మాంద్యంలోనూ సహకార రంగం ముందుకుపోవడం హర్షణీయమని చెప్పారు. దీర్ఘకాలికంగా మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. సామాజిక ఆర్థిక ప్రగతికి ఊతమిస్తుందన్నారు. సిరిసిల్లలోనూ సహకార సంస్థ వేగంగా వృద్ధిలోకి వచ్చిందని తెలియజేశారు. మరో సభ్యుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగలా మార్చారని చెప్పారు. మన సర్కారు విధానాలను దేశవ్యాప్తంగా అమలుచేస్తున్నారని సభ దృష్టికి తెచ్చారు. ఒకనాడు వ్యవసాయమంటే సంక్షోభమనీ, నేడది సంతోషమని వ్యాఖ్యానించారు. ఈ రంగాన్ని గట్టెక్కించడంలో సీఎం సఫలీకృతులయ్యారని చెప్పారు. నాటి ప్రభుత్వాల కాలంలో వ్యవసాయానికి రూ. 7994 కోట్లు కేటాయించగా, తెలంగాణ ప్రభుత్వం రూ.1.92 లక్షల కోట్లు ఖర్చుపెట్టిందన్నారు. చెరువుల పునరుద్ధరణ దగ్గర నుంచి ఉచిత విద్యుత్, రుణమాఫీ, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి, ఎరువులు, గోదాముల నిర్మాణం, రైతు వేదికలు, రైతుల్లో చైతన్యం నింపడం తదితర పనులు చేయడం కేసీఆర్‌తోనే సాధ్యమైందని అభిప్రాయపడ్డారు. రైతు బీమాతో చాలా కుటుంబాలకు ప్రయోజనం కలిగిందని వివరించారు. రాష్ట్రానికి రావాల్సిన బకాయిలను కేంద్ర ఇవ్వడం లేదని వ్యాఖ్యానించారు. పీఎం కిసాన్ పథకానికి నిధులు కొరత ఉందని చెప్పారు. దేశవ్యాప్తంగా బీజేపీ సర్కారు వ్యవసాయానికి రూ.90 వేల కోట్లు, ఉపాధి హామీ పథకానికి రూ. 29 వేల కోట్లు కోత పెట్టిందని గుర్తు చేశారు.

119 సభ్యులు..సభలో 21 మంది

అసెంబ్లీలో శనివారం వ్యవసాయ పద్దుపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా మొత్తం 119 శాసనసభ్యులకుగాను కేవలం 21 మంది మాత్రమే తొలుత సభలో కనిపించడం గమనార్హం. టీ బ్రేక్ అనంతరం స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి సభలోకి ప్రవేశించినప్పుడు కేవలం 11 మంది మాత్రమే సీట్లల్లో ఉన్నారు. అనంతరం ఆ సంఖ్య 21 పెరిగింది. మరో పావు గంటకు 30కి చేరారు. మొదటి నుంచి మంత్రులు టి. హరీశ్‌రావు, పి.సబితారెడ్డి, మహమూద్ అలీ, ఎస్.నిరంజన్‌రెడ్డి తమ తమ స్థానాల్లో ఆసీనులు కాగా, మరో మంత్రి మల్లారెడ్డి ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. మహిళా సభ్యురాలు గొంగిడి సునీత ఒక్కరే ముందు నుంచీ ఉన్నారు. అనంతరం చర్చ జరుగుతున్న క్రమంలో మంత్రి సత్యవతిరాథోడ్, బానోత్ హరిప్రియానాయక్ వచ్చారు. కొద్దిసేపటి తర్వాత మరో మహిళా సభ్యురాలు పద్మాదేవేందర్‌రెడ్డి వచ్చారు. ఎంఐఎం నుంచి మగ్గురు సభ్యులు మాత్రమే కనిపించారు. ఇకపోతే బీజేపీకి చెందిన ముగ్గురికిగాను ఒక్కరూ సభలో లేకపోవడం గమనార్హం. పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతున్న క్రమంలో బీజేపీ సభ్యులు సభలో ఉంటే బాగుండేదని వ్యాఖ్యానించడం గమనార్హం. కాగా కాంగ్రెస్ సభ్యులు డి.శ్రీధర్‌బాబు చర్చ ప్రారంభంలో ఉండి, మధ్యలో బయటకెళ్లారు. అలాగే ఇద్దరు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పద్దుపై చర్చను గమనించకుండా దినపత్రికలు చదువుతూ కనిపించారు. మరికొందరు పద్దు పత్రాలు సీరియేస్‌గా చదువుతూ, పాయింట్లను నోట్‌చేసుకోవడం మీడియా కంటపడింది. కీలకపద్దుపై చర్చ జరుగుతున్న సమయంలో అత్యధిక సభ్యులు సభలో లేకపోవడంపై మీడియా గ్యాలరీలో చర్చకు ఆస్కారమేర్పడింది.

ఇంటర్ పరీక్షల నిర్వహణకు డీఈసీల ఏర్పాటు

- ఉత్తర్వులు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణ కోసం జిల్లా పరీక్షల కమిటీ (డీఈసీ)లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఈనెల 15 నుంచి మార్చి రెండో తేదీ వరకు ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమవుతున్న విషయం తెలిసిందే. ఆదివారం నుంచి వార్షిక పరీక్షలు పూర్తయ్యేంత వరకు డీఈసీ కన్వీనర్లు, సభ్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. మార్చి నాలుగో తేదీన నైతికత, మానవ విలువలు పరీక్ష, ఆరో తేదీన పర్యావరణ విద్య పరీక్షలుంటాయని పేర్కొన్నారు. అదేనెల 15 నుంచి ఏప్రిల్ నాలుగో తేదీ వరకు ఇంటర్ వార్షిక పరీక్షలుంటాయని వివరించారు.

'ఉపాధి' హాజరు పెంచండి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఉపాధి హామీ పనులకు కూలీలు పెద్ద ఎత్తున హాజరయ్యేలా అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివద్ధి శాఖల ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అధికారులను ఆదేశించారు. శనివారం ఆ శాఖ కమిషనర్ హనుమంతరావుతో కలిసి అన్ని జిల్లాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, డీఆర్డీఓలు, పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కూలీల హాజరుపై సమీక్ష నిర్వహించారు. ప్రతి గ్రామ పంచాయతీలో రోజూ సగటున 50 మందికి తగ్గకుండా కూలీలు హాజరు ఉండాలనీ, జిల్లావ్యాప్తంగా పదివేల మంది కూలీలు పనులకు హాజరయ్యేలా కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. ఈనెల 20వ తేదీలోగా 10 లక్షల వేజ్ సీకర్లు ఉపాధి పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనులన్నీ నాణ్యతతో పూర్తి చేయాలని చెప్పారు. కూలీల సంఖ్యతోపాటు కనీస వేతనం రూ.257 వరకు అనుమతి ఉన్నందున సగటు కూలీ రేటు పెరగాలని అన్నారు. ఉపాధి హామీ పనులను మార్చి 25 లోగా పూర్తి చేసి, వివరాలను ఎఫ్‌టీవో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఇంజనీర్ ఇన్ చీఫ్ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ట్రి కలర్ 13వ వార్షికోత్సవం

నవతెలంగాణ-హైదరాబాద్

ట్రికలర్ 13వ వార్షికోత్సవ వేడుకలను శనివారం ఆ సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జాతీయ, అంతర్జాతీయంగా ఏడు బ్రాంచ్‌లు, ప్రాజెక్ట్‌లతో ఈ సంస్థ విజయవంతంగా ముందుకు సాగుతుండగా రాబోయే కాలంలో మరిన్ని ప్రాజెక్టులు , బ్రాంచ్‌లతో పాటు విభిన్న వ్యాపారాలకు శ్రీకారం చుట్టారు.

ప్రస్తుతం కన్‌స్ట్రక్షన్‌తో పాటు విద్యా సంస్థలు, హాస్పిటల్స్, మ్యాన్ పవర్, ఇంటర్‌నేషనల్ ఈట్స్ సిస్టర్ కంపెనీలను ప్రారంభించి సక్సెస్‌ఫుల్‌గా నిర్వహిస్తున్నారు.



వార్షికోత్సవం సందర్భంగా ట్రి కలర్ సంస్థ ఛైర్మెన్ , మేనేజింగ్ డైరెక్టర్ చందన్ కుమార్ ఝా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజన్‌కుమార్ ఝా వారి మార్కెటింగ్ సిబ్బంది, నిర్వహణ సిబ్బంది, వినియోగదారులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి హామీని ఎత్తేసేందుకు కేంద్రం కుట్ర

శాసన సభలో మంత్రి ఎర్రబెల్లి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉపాధి హామీ పథకాన్ని ఎత్తేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం శాసన సభలో పద్దులపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ పక్షనేత మల్లు భట్టి విక్రమార్క లేవనెత్తిన అంశాలపై ఆయన సమాధానం చెబుతూ..మోడీ సర్కార్ ఉపాధి పథకాన్ని నీరు గారుస్తున్నదని చెప్పారు. రాష్ట్రంలో మెటీరియల్, కాంపోనెంట్ కింద 11వేల కోట్లకు పైగా ఖర్చు చేశామని చెప్పారు. వాటికి అనేక కొర్రీలు పెట్టి నిధులను విడుదల చేయటం లేదని చెప్పారు. ఈ పథకాన్ని నిర్వీర్యం చేసి పేదల పొట్టకొట్టేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని చెప్పారు. 2022-23 బడ్జెట్‌లో ఉపాధికి గతానికంటే మరింత కోత పెట్టారని వివరించారు. ఇక్కడున్న బీజేపీ నేతలు ఈ విషయంపై మాట్లాడే స్థితిలో లేరని చెప్పారు.

సంపాదకీయం

మార్చడం... కూల్చడమేనా..?

పేర్లు మార్చడం, నిర్మాణాలు కూల్చడం, ఇదే మన మనుగడకు మూలమని తలుస్తున్నారు కాషాయనాథులు. వాళ్ళు చేయగలిగింది ఇంకేమున్నది మరి! చెప్పుకోవటానికీ ఏమీలేదు కదా! ఇక చేయగలిగింది ఇదొక్కటే. కట్టడాలు కూల్చడంలోంచే ఎదిగినవారు వాళ్లు. కూలగొట్టడం, విద్వేషాన్ని మూటగట్టడం, విభజన చిచ్చును రెచ్చగొట్టడం

> మొన్ననేమో ఢిల్లీలో రాష్ట్రపతి భవన్‌లోని మొఘల్ గార్డెన్ పేరును అమృత్ ఉద్యాన్‌గా మార్చారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి డెబ్బయి ఐదేండ్లు అయిన సందర్భంగా ఈ మార్పు చేస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అంతేకాదు, ఢిల్లీ యూనివర్సిటీలోని నార్త్ క్యాంపస్‌లో ఉన్న మొగల్ గార్డెన్‌ను గౌతమబుద్ధ సెంటినరీ గార్డెన్‌గా మార్చినట్టు అధికారులు చెప్పారు.

మొదలైనవాటిపై నుండే అధికారాన్ని వెంటబెట్టుకుంటున్న వాళ్లు. ఒక్క కట్టడాలే కాదు, తరతరాలుగా ఈ నేలవాసులు నిలుపుకున్న సౌహార్ధతను, సహనశీలతనూ కూల్చేపనికి పూనుకుంటున్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని కూలుస్తున్నారు. ప్రజాస్వామిక, లౌకిక విలువలనూ శిథిలం చేస్తున్నారు. డెబ్బయిఐదేండ్లుగా నిలబెట్టుకున్న మన రాజ్యాంగ మౌలిక సూత్రాలను, దాని ఉనికినీ కూల్చేసే ప్రయత్నాలూ చేస్తున్నారు. వీళ్లయినా మా బతుకులు మారుస్తారేమో అని ఆశపడ్డ ఈ దేశపు అశేష ప్రజల ఆకాంక్షలను కూల్చేసారు. దేశానికి అన్నం పెట్టే రైతుల జీవితాలనూ, సంపద సృష్టికర్తలైన కార్మికుల భవితను కూల్చారు. ఆఖరికి ప్రతిపక్ష ప్రభుత్వాలనూ అక్రమంగా కొల్లకొట్టారు. కూల్చడం వినా ఏమున్నది వీరి చరిత్ర.

ఇప్పుడు మన తెలంగాణలో కాషాయనాథుని ప్రకటన, వారి నైజాన్ని పునరనుద్ఘాటించింది. మేము అధికారంలోకి వస్తే సచివాలయ గుమ్మటాలను కూల్చేస్తామని, అవి నిజాం వారసత్వ నమూనాలుగా ఉన్నాయనీ వాటిని సమూలంగా తుడిచేస్తామని గర్జించారు. ప్రజలు అధికారమిచ్చేది కట్టడాలను కూల్చటానికా? నూతనంగా ఏదైనా నిర్మించడానికా! ప్రజలకు పేదలకు అందవలసిన తిండి, ఇల్లు, బట్ట, చదువు, వైద్యం, ఉపాధి మొదలైన విషయాలపైన వీరి డిమాండ్లుండవు. వాగ్దానాలూ ఉండవు. కూల్చడం మార్చడంపైనే వీరి దృష్టింతాను. అంతకు ముందు వీరి అనుచరులు కుతుబ్ మినార్‌నూ, తాజ్‌మహల్‌నూ కూలుస్తామన్నారు. వీరి ఈ కూల్చే విధానాలు వింటుంటే 1952లో నిర్మించిన బాలీవుడ్ సినిమా 'బైజు బావ్రా'లో రఫీ పాడిన పాటలోని చరణం గుర్తుకొస్తుంది. అందులో... "మందిర్ గిర్‌తా, ఫిర్ బన్ జాతా, దిల్‌కో కౌన్ సంభాలే!" అని అంటాడు. అవును కదా! భౌతిక నిర్మాణాలు కూలగొడితే మళ్ళీ నిర్మించుకుంటారు. కానీ మనుషుల హృదయాలు అలాకాదు కదా! వీళ్ళకు మనుషుల గురించీ వారి హృదయాలు, బాధల గురించి ఆలోచనలే లేవు.



మొన్ననేమో ఢిల్లీలో రాష్ట్రపతి భవన్‌లోని మొఘల్ గార్డెన్ పేరును అమృత్ ఉద్యాన్‌గా మార్చారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి డెబ్బయి ఐదేండ్లు అయిన సందర్భంగా ఈ మార్పు చేస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అంతేకాదు, ఢిల్లీ యూనివర్సిటీలోని నార్త్ క్యాంపస్‌లో ఉన్న మొగల్ గార్డెన్‌ను గౌతమబుద్ధ సెంటినరీ గార్డెన్‌గా మార్చినట్టు అధికారులు చెప్పారు. అంతేకాదు, అది మొఘల్ డిజైన్ ప్రకారం లేదనీ సెలవిచ్చారు. మొఘల్ గార్డెన్స్ అనేవి పర్షియన్ శైలిలో నిర్మించిన తోటలు. చార్‌బాగ్ విధానంలో కట్టినవి. పానిపట్టు యుద్ధంతో ఇక్కడ మొఘలుల సామ్రాజ్యం మొదలయింది. బాబరు మొదట నిర్మించిన గార్డెన్ ఆగ్రాలోని ఆరామ్ బాగ్. ఈ నిర్మాణాలు వారి ప్రియమైన సామ్రాజ్య కాలక్షేపం. ఆ తర్వాత ఇవి ఇండో ఇస్లామిక్ నిర్మాణ రీతిని అభివృద్ధి చేశారు. బాబరు తర్వాత అక్బర్ అనేక తోటలను నిర్మించాడు. గోల్‌బాగ్ అనేది భారత ఉపఖండంలో నమోదు చేయబడిన అతిపెద్ద ఉద్యానవనం. జమామసీదు, ఫతేపూర్ సిక్రి, ఆగ్రాఫోర్ట్, బులంద్ దర్వాజ, షాలిమార్ గార్డెన్స్, లాహోర్‌ఫోర్ట్, తాజ్‌మహల్, వీటి పేర్లన్నీ మారిస్తే చరిత్ర మొత్తం మారిపోతుందా! పేర్లను చెరిపేస్తే కొత్త చరిత్ర నిర్మాణం కాదు. ఏ కట్టడాలయినా రాజుల తమ రాజ్యాధికారానికి చిహ్నాంగా మలచినవే అయినప్పటికీ అవి అంత అందంగా సౌందర్యాత్మకంగా వెలుగొందటానికి ఆనాటి నిర్మాణ కార్మికులు, కళాకారులు, సాంకేతిక నిపుణులు శ్రమేకారణం. కట్టడాల్లో వారి పేర్లేవుండవు. తాజ్‌మహల్‌ని చూసి, దాని అందానికి ముగ్ధులవ్వని వాళ్లు ఉంటారా! ఒక చారిత్రక కట్టడాన్ని మతం, కులం, జాతి ఆధారంగా చూడటమేకాక, దాన్ని ధ్వంస మొనర్చాలనుకోవడం మూర్ఖమైన ఆలోచన. అవన్నీ ఇక్కడి సామాన్యుల చేతుల్లోంచి సృష్టించబడ్డవే. ఒక్క కట్టడాలే కాదు, ఆహారము, వస్త్రధారణ, సంప్రదాయాలు, భాషలు, సంగీతము, సాహిత్యము అనేకంగా ఆదాన ప్రదానాలు ప్రపంచ వ్యాపితంగా జరుగుతున్నవే. అలా జరిగిన మూలాన్నే అనేక కొత్త రీతులు, నైపుణ్యాలు పెంపొందాయి కూడా. వాటిని చెరిపేయాలని అనుకోవడం వెర్రితనమే. ప్రముఖ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయి అన్నట్టు.... "ఇంతకు ముందులాగా నేను మొఘలాయ్ పరోటా, ముర్గ్‌ము సల్లంలను తినవచ్చునా? లేక వాటి పేర్లను మార్చుకోవాల్సిందేనా? బాలివుడ్ సినిమా 'మొఘల్ ఏ ఆజం' పాట వింటున్నాం... ఎవరూ ఆ సినిమా పేరు మార్చమని అడగరనే ఆశిస్తున్నా...' అని ప్రకటించడం కంటే ఏం చేయగలరు? ఇప్పుడు వాళ్లు అలవాటు చేసిన బిర్యాని, సెమ్యా పాయసం తినటం కూడా మార్చేస్తారా! మానేస్తారా!

ఇకనైనా నరేంద్రమోడీ నోరువిప్పుతారా? కమిటీతో కాలయాపన చేస్తారా?



ఎం. కోటేశ్వరరావు


దేశం మొత్తాన్ని కుదిపివేసినా, ప్రపంచంలో మన కంపెనీల విశ్వసనీయత మీద అనుమానం తలెత్తినా, మదుపర్లు లక్షల కోట్లు పోగొట్టుకున్నా దేశ అత్యున్నత పార్లమెంటులో అదానీ-హిండెన్‌బర్గ్ వివాదం మీద ప్రధాని నరేంద్రమోడీ నోరు మెదపలేదు. మోడీ తీరు తెన్నులను గమనించిన వారు నోరు విప్పుతారని ఏ ఒక్కరూ ఆశించలేదన్నది కూడా పచ్చినిజం. ఎవరి స్టైల్ వారిది, తగిన తరుణం వచ్చినపుడు ఎవరి పద్ధతిలో వారు స్పందిస్తారు. పార్లమెంటులో ప్రతిపక్షాల డిమాండ్‌ను ఖాతరు చేయని అపర ప్రజాస్వామికవాది ఇప్పుడు సుప్రీం కోర్టుకైనా ఏదైనా నివేదిస్తారా? లేక దేశభద్రతకు సంబంధించిన అంశం కనుక కోర్టుకు చెప్పలేం అని తలాయిస్తారా? లేదా విచారణ, సూచనల కమిటీ పేరుతో కాలయాపన చేస్తారా? చూద్దాం!

శుక్రవారం నాడు సుప్రీం కోర్టు ముందు ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఎంఎల్ శర్మ, విశాల్ తివారీ అనే ఇద్దరు న్యాయవాదులు ఒక దావా వేశారు. అదానీ గ్రూప్‌నకు వ్యతిరేకంగా అమెరికా కేంద్రంగా ఉన్న హిండెన్‌బర్గ్ సంస్థ కుట్రలో భాగంగా విడుదల చేసిన పరిశోధన నివేదిక మదుపర్లకు భారీ నష్టం కలుగ చేసినందున సుప్రీం కోర్టు పర్యవేక్షణలో విచారణ జరిపించాలని విడివిడిగా కేసులు దాఖలు చేశారు. దీన్ని స్వీకరించిన కోర్టు సోమవారంనాడు విచారణకు తీసుకుంటామని వివాదం తలెత్తిన నేపథ్యంలో నియంత్రణ విధానం, తీసుకున్న చర్యల గురించి ఆరోజుకు నివేదిక ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి)ని ఆదేశించింది. ప్రభుత్వం,

> ఇక షార్ట్ సెల్లర్స్ అంటే ఎవరు అన్న ఆసక్తి చాలా మందిలో కలిగింది. అమరావతి ప్రాంత రైతులతో అగ్రిమెంటు చేసుకొని భూములు కొనుగోలు చేసి చేతులు కాల్చుకున్నవారి సంగతి తెలిసిందే. వైసీపీ ప్రభుత్వం రాగానే మూడు రాజధానుల ప్రతిపాదన రంగంలోకి తేవటంతో భూముల ధరలు ధమాల్ అన్నాయి. దాంతో ఒప్పందాలు చేసుకున్న వారు రైతులకు పెద్ద మొత్తంలో ఇచ్చిన బయానా సొమ్మును వదులుకొని లావాదేవీలను రద్దు చేసుకున్నారు. అదే అదనుగా ధరలు తగ్గటంతో కొందరు చౌకగా కొనుగోలు చేసిన వారూ ఉన్నారు. స్టాక్ మార్కెట్‌లో బ్రోకర్ల వద్ద కొందరు ఒక కంపెనీ వాటాలను అరువు తెచ్చుకుంటారు. వాటిని మార్కెట్‌లో ఉన్న ధరల కంటే కారుచౌకగా తెగనమ్ముతారు. దీన్నే షార్ట్ సెల్లింగ్ (తక్కువ ధరలకు అమ్మకం) అంటారు.

సెబీని సంప్రదించి భవిష్యత్‌లో ఇలాంటి ఉదంతం పునరావృతం కాకుండా నియంత్రణ వ్యవస్థలను ఎలా పటిష్టపరచాల్సిందీ, క్రమబద్ధీకరణ చట్టాలు, మార్కెట్ల నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన మార్పులు, అవసరమైతే దాని కోసం ఒక నిపుణుల కమిటీ ఏర్పాటుతో సహా ఒక నివేదికను అందచేయాలని సొలిసిటర్ జనరల్‌ను కోరింది. కేంద్ర ప్రభుత్వం అంగీకరిస్తే ఒక కమిటీని వేయవచ్చని కూడా చెప్పింది. తాము దీని గురించి ఏదైనా చెబితే మార్కెట్ ప్రవృత్తి, మదుపుదార్ల విశ్వాసం మీద ప్రభావం చూపవచ్చని కోర్టు పేర్కొన్నది. భారత మదుపుదార్ల ప్రయోజనాలను ఎలా కాపాడాలన్నదే నిజంగా తమ తాపత్రయమని కోర్టు పేర్కొన్నది. బంతి ఇప్పుడు ఎక్కడ ఉన్నదీ చెప్పనవసరం లేదు.

జరిగిన పరిణామాలపై సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తితో విచారణ జరిపించాలని, హిండెన్ బర్గ్ నివేదిక దేశ స్టాక్ ఎక్స్ఛేంజ్‌ను కుదిపివేయటమే కాదు, దేశంలోని వాణిజ్యవేత్తలను అనుసరిస్తున్న పద్ధతులను కూడా ప్రశ్నార్ధకంగా మార్చిందని పిటీషనర్లు పేర్కొన్నారు. నియంత్రణలు లేకుండా ప్రభుత్వ రంగ బ్యాంకులు రుణాలు ఇవ్వటం తీవ్ర ఆందోళన కరమైన అంశమని, బడా కార్పొరేట్లకు ఐదు వందల కోట్ల రూపాయలకు మించి ఇచ్చే రుణాలపై పరిశీలనకు ఒక ప్రత్యేక కమిటీని వేయాలని కూడా కోరారు. ఈ పిటీషన్ మీద



విచారణ ఎలా జరుగుతుందో, ఏమి తేలుస్తారో చెప్పలేము గానీ పార్లమెంటులో ఈ అంశాన్ని లేవనెత్తకుండా ఒకవేళ ఎవరైనా అడిగినా సమాధానం చెప్పకుండా తప్పించు కొనేందుకు వీలుగా సుప్రీం కోర్టు సూచించినట్లుగా ఒక కమిటీ ఏర్పాటుకు కేంద్రం అంగీకరిస్తే కథకంచికే. కోర్టు అందుకు అంగీకరిస్తే దాని నిర్ణయాన్ని తప్పు పట్టకూడదు గానీ ఇది నరేంద్రమోడీ-అదానీ ప్రయోజనం కోసం దాఖలైన పిటీషన్ అనుకొనేందుకు అవకాశం ఉంది.

ప్రపంచంలో హిండెన్‌బర్గ్ వంటి షార్ట్ సెల్లర్స్, వారి లీలలు కొత్త కాదు. ఇలాంటి వారు ఉండటం మార్కెట్‌కే మంచిదని సమర్ధించేవారు ఉన్నారు. అదానీ కంపెనీల మీద ఇప్పుడు కాకుండా మరోఐదేండ్ల తరువాత గనుక ఇలాంటి నివేదిక వచ్చి ఉంటే ఇంకా పెద్ద ముప్పు వచ్చి ఉండేదని అనేక మంది అనుకుంటున్నట్లుగా మీరాయె ఎసెట్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్స్ సిఐఓ రాహుల్ చద్దాతో నిర్వహించిన ఇంటర్వ్యూలో చెప్పిన అంశాన్ని ఫిబ్రవరి 9న టైమ్స్ ఆఫ్ ఇండియా రాసింది. "రానున్న 5-10సంవత్సరాల్లో భారత్ గనుక ప్రపంచంలో మూడవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారితే మన కంపెనీలలో ఎక్కువ భాగం మరింతగా తనిఖీకి గురికావచ్చు. దీన్ని గతంలో చూశాం. కొంత మంది షార్ట్ సెల్లర్స్ చైనా కంపెనీల గురించి నివేదికలు రాశారు. కొన్ని నివేదికలు వాస్తవమే, కొన్ని సంచలనం కలిగించాయి. మార్కెట్ దాన్ని పెద్ద అంగలు వేయటంగా చూసింది. ఎక్కడైతే నివేదికలు వాస్తవమో అక్కడ స్టాక్స్ ప్రభావితం అయ్యాయి. అదానీ గ్రూపు విషయానికి వస్తే ఎక్కువ మంది మదుపుదార్లు ప్రయివేటు సంభాషణల్లోనే మాట్లాడుతున్నారు. ప్రముఖంగా ప్రస్తావించిన కొన్ని అంశాలను చూస్తే ఒక విధంగా చెడ్డలో మంచిగా చూస్తున్నారు. ఇప్పుడు గాకుండా ఐదేండ్ల తరువాత ఈ సమస్య తలెత్తివుంటే పెద్ద వ్యవస్థాపరమైన ముప్పుగా ఉండేది. దీని నుంచి ప్రతివారూ పాఠం నేర్చుకున్నారని అనుకుంటున్నాను" అని చద్దా చెప్పారు. ఇటీవల తాను ఐరోపా వెళ్లినప్పుడు ప్రతి చోటా మదుపర్లు తనను అదానీ ఉదంతం గురించి అడిగితే పైన చెప్పుకున్న అంశాలనే వివరించాల్సి వచ్చిందని, ఇంత జరిగాక తానైతే ఆచితూచి పెట్టుబడులు పెడతానని కూడా చెప్పారు.

సంస్థాగత మదుపర్ల ఆలోచన ఎలా ఉందో చూశాం. ఎంతసేపూ షార్ట్ సెల్లర్లు, వారి వెనుక ఉన్న కుట్ర సిద్దాంతాల చుట్టూ చర్చను తిప్పేందుకు చూస్తున్నారు. హిండెన్‌బర్గ్ నివేదిక తరువాత అదానీ కంపెనీ ఎఫ్‌పిఓ పేరుతో రూ.20వేల కోట్లను సేకరించేందుకు వాటాలను జారీ చేసింది. చిన్న చిన్న మదుపుదార్లెవరూ ముందుకు రాలేదు. కానీ ఆశ్చర్యంగా కొందరు రంగంలోకి దిగి వాటిని కొని అదానీ పరువు నిలిపేందుకు చూశారు. అలా ఎల్ఐసీ కూడా మూడు వందల కోట్ల మేరకు దరఖాస్తు చేసిందని వార్తలు. వాటిని స్టాక్‌ఎక్స్ఛేంజ్‌లో పెడితే కొన్నవారంతా చేతులు కాల్చుకొనేవారే. కానీ అదానీ ఆ అమ్మకాలను రద్దు చేసి ఆదుకున్న తన మిత్రులను రక్షించారు. ఇదొక పెద్ద కుంభకోణం, దీని మీద విచారణ జరపాలి. అస్థిరపరిస్థితి ఉన్నప్పుడు అదానీ కోసం ముందుకు వచ్చిన వారెవరు అన్నది బహిరంగం కావాల్సి ఉంది.

ఇక షార్ట్ సెల్లర్స్ అంటే ఎవరు అన్న ఆసక్తి చాలా మందిలో కలిగింది. అమరావతి ప్రాంత రైతులతో అగ్రిమెంటు చేసుకొని భూములు కొనుగోలు చేసి చేతులు కాల్చుకున్నవారి సంగతి తెలిసిందే. వైసీపీ ప్రభుత్వం రాగానే మూడు రాజధానుల ప్రతిపాదన రంగంలోకి తేవటంతో భూముల ధరలు ధమాల్ అన్నాయి. దాంతో ఒప్పందాలు చేసుకున్న వారు రైతులకు పెద్ద మొత్తంలో ఇచ్చిన బయానా సొమ్మును వదులుకొని లావాదేవీలను రద్దు చేసుకున్నారు. అదే అదనుగా ధరలు తగ్గటంతో కొందరు చౌకగా కొనుగోలు చేసిన వారూ ఉన్నారు. స్టాక్ మార్కెట్‌లో బ్రోకర్ల వద్ద కొందరు ఒక కంపెనీ వాటాలను అరువు తెచ్చుకుంటారు. వాటిని మార్కెట్‌లో ఉన్న ధరల కంటే కారుచౌకగా తెగనమ్ముతారు. దీన్నే షార్ట్ సెల్లింగ్ (తక్కువ ధరలకు అమ్మకం) అంటారు. దాంతో ఆ కంపెనీలో ఏదో గోల్‌మాల్ జరిగిందని ఇతరులు కూడా మరింత నష్టపోకుండా చూసుకుందామని అమ్మకాలకు పాల్పడతారు. వాటి విలువ పడిపోతుంది. ఆ ఒక్క కంపెనీ వాటాల ధరలే కాదు, స్టాక్ మార్కెట్లో ఇతర కంపెనీల ధరలూ పతనం కావచ్చు. దాన్ని ఆసరా చేసుకొని అదే షార్ట్ సెల్లర్స్ భారీగా అదే కంపెనీ లేదా ఇతర కంపెనీల వాటాలను తక్కువ ధరలకు కొని పెద్ద మొత్తంలో లాభాలు పొందిన ఉదంతాలతో పాటు చేతులు కాల్చుకున్నవారు లేకపోలేదు. స్టాక్ మార్కెట్‌లో ఇదొక ఖరీదైన జూదం. షార్ట్ సెల్లర్స్‌కు వాటాలను అరువుగా ఇచ్చిన బ్రోకర్లకు ఎలాంటి నష్టమూ ఉండదు.లేదూ కొంత మంది బ్రోకర్లే షార్ట్ సెల్లింగ్‌కూ పాల్పడి జూదమాడవచ్చు. ఈ షార్ట్ సెల్లర్స్ ఎలాంటి వారంటే ప్రధాన పట్టణాల బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల వద్ద కొంత మంది ఆటో, టాక్సీ వాలాలు వచ్చిన వారిని ఎక్కించుకొని కష్టపడి నాలుగు డబ్బులు సంపాదించుకోకుండా పగలంతా పడిగాపులు పడి ఎవరైనా అమాయకులు దొరికితే దోచుకొనే ఒక సినిమాలో నిక్కర్ నారాయణ పాత్రను గుర్తుకు తెస్తారు.

ఇలాంటి జూదాన్ని స్టాక్‌మార్కెట్ నియంత్రణ సంస్థలు నిషేధించవచ్చుకదా అని కొందరు అడగవచ్చు. ప్రపంచంలో చైనాతో సహా ఎక్కడా స్టాక్‌మార్కెట్లలో అలా జరగలేదు. అనుమతిస్తూనే ఉన్నారు. భారీ ఎత్తున అమ్మకాలకు దిగినపుడు స్టాక్ ధరలు పతనమైతే ఒక పరిమితి దగ్గర కొద్దిసేపు అమ్మకాలను నిలిపివేస్తారు. అది భారీ ఎత్తున నిర్ణీత పరిమితికి మించి పెరుగుతున్నపుడు కూడా అదే పని చేస్తారు. పూర్తిగా నిషేధించే అవకాశాలు దాదాపు లేవనే చెప్పవచ్చు. అదానీ కంపెనీల వాటాల ధరలు విపరీతంగా పెరిగినపుడు లేని నిషేధాలు పతనమైనప్పుడు ఎలా పెడతారు? గతంలో కేతన్ పరేఖ్ అనే నేరస్తుడు ఇతర బ్రోకర్లతో కలసి కంపెనీల వాటాల ధరలను కృత్రిమంగా పెంచిన కుంభకోణం జరిగింది. జి టెలిఫిలిమ్ వాటా ధర రూ.127 ఉంటే దాన్ని పదివేలకు, విజువల్ సాఫ్ట్ రూ.625ను రూ.8,448, సోనాటా సాఫ్ట్ రూ.90ని రూ.2,936కు పెంచి మదుపుదార్లను ముంచారు. వైస్ జగన్‌మోహనరెడ్డి సాక్షి పత్రిక, టీవీ కంపెనీలో పది రూపాయల విలువగల వాటాలను వందల రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన వారిని మీరెందుకు అలా కొన్నారని ప్రశ్నిస్తే మేం వ్యాపారులం, లాభాలు వస్తాయనే అంచనాతో కొన్నాం, ఒక వేళ రాలేదనుకోండి నష్టపోయేది మేమే కదా! మాకు లేని ఇబ్బంది ఇతరులకు ఎందుకు అని ప్రశ్నించిన సంగతి తెలిసిందే. దాని వెనుక అసలు కథ ఏమంటే అదే వ్యాపారులు రాజశేఖరరెడ్డి సర్కార్ నుంచి భారీ మొత్తంలో లబ్ది పొందారని దానికి బల్లకింద గాక బల్లమీదనే బహిరంగంగా చట్టపరంగానే అలా ప్రతిఫలం చెల్లించారనే విమర్శలున్న సంగతి తెలిసిందే. వాటి మీద ఇప్పుడు కేసులు నడుస్తున్నాయి. దీన్నే నీకది నాకిది అంటారు. హిండెన్‌బర్గ్ ఉదంతంపై సోమవారం నాడు లేదా తరువాత సుప్రీం కోర్టు ఏం చేస్తుందనేది ఆసక్తిగా మారింది.

> నియంత్రణలు లేకుండా ప్రభుత్వ రంగ బ్యాంకులు రుణాలు ఇవ్వటం తీవ్ర ఆందోళనకరమైన అంశమని, బడా కార్పొరేట్లకు ఐదు వందల కోట్ల రూపాయలకు మించి ఇచ్చే రుణాలపై పరిశీలనకు ఒక ప్రత్యేక కమిటీని వేయాలని కూడా కోరారు. ఈ పిటీషన్ మీద విచారణ ఎలా జరుగుతుందో, ఏమి తేలుస్తారో చెప్పలేము గానీ పార్లమెంటులో ఈ అంశాన్ని లేవనెత్తకుండా ఒకవేళ ఎవరైనా అడిగినా సమాధానం చెప్పకుండా తప్పించు కొనేందుకు వీలుగా సుప్రీం కోర్టు సూచించినట్లుగా ఒక కమిటీ ఏర్పాటుకు కేంద్రం అంగీకరిస్తే కథకంచికే.

సెల్: 8331013288



ఇరాన్ మహిళా గర్జన



కె. శాంతారావు
9959745723

'మత నాయకులారా! మా అడ్డు తొలగండి.' ఇప్పుడు ఈ నినాదం మత రాజ్యం ఇరాన్‌లో దిక్కులు పిక్కటిల్లేలా ప్రతిధ్వనిస్తున్నది.

ఇరాన్‌లో రాజరికం కుప్పకూలి 44ఏండ్లు కావస్తున్నది. 1979లో ఇరాన్‌రాజు షా మహమ్మద్ రెజా పెహ్లావి రాజరికం కూలిపోయిన తర్వాత అయితుల్లా ఖొమైనీ నాయకత్వంలో అక్కడ ఇస్లామిక్ మత ప్రభుత్వం ఏర్పడింది.

ఆసియా ఖండంలో ఇరాన్ ఓ మధ్య ప్రాచ్యదేశం. జనాభా దాదాపు ఏడుకోట్లు. గతంలో ఇరాన్‌ను పర్షియా అని కూడా పిలిచేవారు. ఇరాన్ పేరుకు అర్థం స్థలి ఆర్యన్. అంటే ఆర్యభూమి.

ఇప్పుడు ఆ దేశంలో ఉన్న ఇస్లామిక్ రిపబ్లిక్ ప్రభుత్వం. గతంలోని మత రాజరికం కన్నా ఏ విధంగానూ మెరుగైనది కాదని అక్కడి ప్రజలు అభిప్రాయపడుతున్నారు. గత నాలుగైదు నెలలుగా ఇరాన్‌లో ప్రజల నిరసనాగ్రహ జ్వాలలు పెద్ద ఎత్తున చెలరేగుతున్నాయి.

గత సెప్టెంబర్‌లో 'మహసా అమినీ' అనే యువతి హిజాబ్ వస్త్రధారణ సరీగా పాటించలేదనే నెపంపై ఆమెను పోలీసులు నిర్బంధించారు. ఆ నిర్బంధంలో చిత్రహింసలు పెట్టిన కారణాన ఆమె మరణించడంతో ప్రజా నిరసన మిన్నంటింది. ఆ నిరసనను అణగదొక్కాలనే కాంక్షతో ప్రభుత్వం రకరకాల నిరంకుశ చర్యలకు ఒడికట్టింది. నిరసన చెలరేగుతున్న ప్రాంతాలను గుర్తించి అంతర్జాల (నెట్) సౌకర్యాన్ని బంద్ చేసింది. సామాజిక మాధ్యమాలపై నిషేధం విధించింది. ఉద్యమ శిబిరుపై పోలీసుల దమనకాండ నిత్యకృత్యమైపోయింది. బలైపోతున్నది, బాధలు పడుతున్న కార్యకర్తలు పెద్ద సంఖ్యలోనే ఉంటున్నారు. అయినా హిజాబ్ వస్త్రధారణను బాహాటంగా ఉల్లంఘిస్తూ సివంగిల్లా యువతులు రుద్రనేత్రలై కదలడం ప్రభుత్వ అధికారులకే కాదు మత ఛాందసులకు మింగుడు పడలేదు.

మహిళల జీవితం మహిళలదే! మతం ముసుగులో మగ పెత్తనం ఏమిటి? మహిళలకు స్వేచ్ఛ కావాలి? నియంతలు నశించాలి. పురుషులతో పాటు మహిళలకు సమాన హక్కులు లేవా? మగవాళ్ళు ఎక్కువేంటి? ఆడవాళ్ళు తక్కువేంటి. ఇలాంటి నినాదాలకు అక్కడి మహిళాలోకంతో పాటు ప్రజాస్వామ్య వాదులూ గళం కలుపుతున్నారు. ఇప్పుడు ఈ నినాదాలు విద్యాసంస్థల్లో కూడా వ్యాపిస్తూ ప్రపంచాన్ని ఆకర్షిస్తున్నాయి.

ఇటీవల ఫ్రాన్స్‌లోని స్ట్రాస్‌బర్గ్ నగరంలో ఇరాన్ నిరసన కారులకు సంఘీభావంగా వేలాదిమందితో ప్రదర్శన జరిగింది 3కానిక్ ఈఫిల్ టవర్‌కూడా ఆ ఉద్యమంలో భాగమైంది. మద్దతుదారులు ఈఫెల్ టవర్‌ను విద్యుత్ కాంతులతో నింపివేసారు. వుమెన్ లైఫ్ ఫ్రీడం - స్టాప్ ఎగ్జిక్యూషన్ ఇన్ ఇరాన్ (మహిళకు కావాలి స్వేచ్ఛా జీవితం, ఇరాన్‌లో అణచివేత చర్యలు ఆపండి) అన్న నినాదాలు మిన్నంటాయి. ఇదంతా ట్విటర్ ద్వారా వైరల్ అయింది.

ఈ ఉద్యమంలో ఇరాన్ ప్రభుత్వనేత అయితుల్లా ఖొమైనీని ధిక్కరించడం ఇప్పుడు సాధారణమైపోయింది. ఈ క్రమంలోనే 'మత నాయకులారా! మాకు అడ్డుతొలగండి' అనే నినాదం సార్వజనీనమైన నినాదంగా ముందుకొచ్చింది.

ఇరాన్ ప్రభుత్వం మహిళలను ఇప్పటికే రెండవ శ్రేణి పౌరులుగానే గుర్తించడం ఎంత దారుణం? వారిని పాలకులు సక్రమంగా ఎదగనివ్వడం లేదు. బాలికలను చదువుకోనివ్వడం లేదు. ఇష్టమైన వృత్తిని, జీవిత భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛను యువతులకు ఇవ్వడం లేదు. దాంపత్యం నరకప్రాయమైనప్పుడు విడాకులు తీసుకునే స్వేచ్ఛ ఆ మహిళకు లేదు. ఇక వస్త్రధారణ విషయంలో అయితే అటు ప్రభుత్వ ఆధిపత్యాన్నే కాదు మత ఛాందస మూక వేధింపులను ఆ మహిళా లోకం ఎదుర్కొవలసి వస్తున్నది.

ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబాన్‌ల ఆంక్షలు అక్కడి మహిళాలోకం ఎలా ప్రతిఘటిస్తున్నదో, ఇరాన్‌లో కూడా ఇప్పుడు జరుగుతున్న ఘటన అదే తీరులో ఉంటున్నది. అణచివేత ఎక్కువైనప్పుడు ప్రతిఘటన అనివార్యమనే సత్యం ఎల్లెడలా తెలుస్తున్నది.

ఇరాన్ పరిణామాల పట్ల నెదర్లాండ్స్ గామాన్ సంస్థ ఇటీవల ఓ సర్వే నిర్వహించింది. దాదాపు రెండు లక్షల మంది ఇరాన్ మహిళల అభిప్రాయాలు సేకరించింది. వారంతా ఇస్లామిక్ ప్రభుత్వ పాలనను తెగనాడుతున్నట్టు సంస్థ తెలిపింది. అలాగే ఇరాన్ ప్రజల అంతర్జాతీయ సంస్థ కూడా ఇరాన్ ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నది. తమకు వ్యతిరేకంగా సౌదీ అరేబియా కూడా కుట్ర పన్నుతున్నట్టు ఇరాన్ ప్రభుత్వం మరో పక్క ఆరోపిస్తున్నది.

పశ్చిమాసియాలో పెల్లుబికే ప్రజా ఉద్యమాలు ఆయా దేశాల ప్రభుత్వాలను గద్దెదింపడంలో కీలకపాత్ర వహిస్తాయనేది రాజకీయ పరిశీలకుల భావన. 2019-20లలో లెబనాన్, అల్జీరియా, ఇరాక్, సుడాన్‌లలో ఆ ప్రభుత్వాలు కూలిపోవడానికి ప్రజా ఉద్యమాలే ముఖ్యకారణం అని వారంటున్నారు. అందుకే ఇరాన్‌లో ఆరని కుంపటిలా రగులుకుంటున్న ప్రజా ఉద్యమం స్వభావం తెలుసుకునేందుకు గట్టిప్రయత్నం చేస్తున్నారు.

వెన్వెంటనే సమూలమైన మార్పులు రాకపోవచ్చు. కానీ ఉద్యమ తీవ్రత ప్రభావం త్వరగా సమసిపోతుంది అని చెప్పడానికి వీలులేదు. ఎందుకంటే ఇది తరతరాల అణచివేత, 80శాతం మంది మహిళలు ప్రస్తుత ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ ఉండాల్సిన అవసరం లేదని నిర్ద్వంద్వంగా చెప్పినట్టు ఆ సర్వే పేర్కొన్నది. అలాగే విదేశాల్లోని 99శాతం ఇరానియన్‌లు ఇస్లామిక్ రిపబ్లిక్‌ను వ్యతిరేకిస్తున్నారు. ప్రజా నిరసనోద్యమాల్లో న్యాయం ఉంటుందని, సమానత్వం హక్కులు ఉంటాయని, మార్పు తప్పదని, ప్రజాస్వామ్య వాదులు భావిస్తున్నారు. 'ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తుంది' అని చెప్పిన మహాకవి గురజాడ దార్శనికత ఇదే కదా!

చెవి... కన్ను... నోరు...



జె. రఘుబాబు

"అదో కొత్త దవాఖానా. దవాఖానా అంటే ధర్మాసుపత్రి కాదు. పైసలు తీసుకునే ఆసుపత్రీ కాదు. అందులో ఒక ప్రత్యేక విభాగం ఉంది. దాని గురించికూడా చెబుతా"

"మరి ఎలాంటి దవాఖానా ఖై జర సమజయ్యేటట్లు చెప్పు"

"చెప్తా చెప్తా అన్నీ చెప్తా వినడానికి చెవులున్నాయా..."

"ఉన్నాయ్"

"చూడడానికి కండ్లున్నాయా..."

"ఉన్నాయ్"

"చెప్పడానికి నోరుందా..."

"ఉంది"

"అన్నీ సరిగ్గా ఉన్నాయా..."

"ఉన్నాయి"

"అన్నీ పని చేస్తున్నాయా"

"చేస్తున్నాయి"

"మరి దేశంలో జరిగేవన్నీ చూస్తున్నావా, వింటున్నావా, వాటి గురించి మాట్లాడుతున్నావా"

"లేదు"

"ఎందుకని?"

"ఎందుకనంటే మరి..."

"చెప్పు ఎందుకని?"

"ఎందుకంటే దేశభక్తి మరి!!"

సరే ఆ దవాఖానాను చూద్దామని పోతే ఒక్కో రూముకు ఒక్కో పేరుంది. అన్నీ మామూలుగా చూసేవే అవి. ఇంకా పోతూ పోతూ ఉంటే కనిపించింది ఒక డిపార్టుమెంటు. చెవి, కన్ను, నోరు శాఖ అని. మామూలుగా చెవి, ముక్కు, గొంతు కదా ఉండాల్సింది, ఇదేమిటి ఇలా ఉంది. ఏమో ఇదో కొత్త శాఖనేమో. ప్రపంచ ఆరోగ్య సంస్థ వాళ్ళు కొత్తగా ప్రవేశ పెట్టారేమో? అయినా ఎవరినైనా అడిగితే పోలా అనుకుంటూ అక్కడ ఓ పెద్దాయన కనిపిస్తే అడిగా "ఈ శాఖ ఎప్పటినుండి మొదలు పెట్టారూ" అని.

"ఈరోజే మొదలు బాబూ" అన్నాడు.

"ఎందుకు..." అని అడిగా

"చూడు బాబూ మనిషికి చెవి, కన్ను ఉండేది బాగా వినమని, బాగా చూడమని. అందుకే అవి రెండు రెండు ఉంటాయి. నోరు మాత్రం ఒక్కటే, తక్కువ మాట్లాడమని. ఇది మా సారు చిన్నప్పుడు క్లాసులో చెప్పింది."

"అవును మా టీచరమ్మ కూడా చెప్పింది" నేనూ నా టీచర్ గురించి చెప్పుకోవాలి కదా

"కదా... మరి నేడు జరుగుతుంది ఏమిటి?"

"అందరూ బాగా వింటున్నారు, చూస్తున్నారు కదా?!"


"చూడ్డమంటే ఊరికే చూడడం కాదు బాబూ"

"మరి...?"

"ఏమి జరుగుతోందో, ఎందుకు జరుగుతోందో చూస్తున్నారా?"

"ఇప్పుడే కొద్దిగా అర్థమవుతోంది, మీరే చెప్పండి క్లియరుగా..."

"చెబుతా బాబూ. చెప్పడమే కాదు ఈ దవాఖానాలో కొత్తగా పెట్టిన ఈ శాఖలో కూడా అదే చేయబోతున్నా"



"ఏది"

"చెవితో సరిగ్గా వినడం ఎట్లా, ఎవరు చెప్పింది బాగా వినాలి, ఏది మెదడుకు పంపాలి, ఏది ఇంకో చెవిలోంచి వదిలేయాలి. పనిగట్టుకొని కొందరు పొద్దున లేచినప్పటినుండి చెప్పే విషయాలను ఎలా వినాలి అన్నవి చెవికి సంబంధించి. ఇక కన్ను... రోజూ పేపర్లలో, టీవీల్లో, వాట్సప్ లాంటి ఎలక్ట్రానిక్ మీడియాలో పెట్టే వార్తలు, దేశభక్తి సందేశాలు చదివి వాటిలో నిజమైనది ఏది అన్న విషయాన్ని కంటితో చూడడమే కాదు ఎలా అన్వయించుకోవాలో చెబుతాం. ఇక ముఖ్యమైనది నోరు. ఊరకే నోరుంది కదా అని మాట్లాడడం ఎంత తప్పో, అవసరమైనప్పుడు ఎలా మాట్లాడాలో కూడా తెలుసుకోవాలి. అదే ఇక్కడ చేస్తాం."



"మీరు వినిందే నిజమని, మీరు చదివిందే నిజమని, మీరు మాట్లాడిందే నిజమని మేమెందుకు అనుకోవాలి?"

"అసలైన పాయింటుకే వచ్చావు. అది నేర్పడానికే ఈ ప్రయత్నం. అలా ఎందుకు చేస్తున్నారో చూపాలన్నదే మా తాపత్రయం. మేము చెప్పేవే కాదు ఇతరులు చెప్పేవీ బాగా వినమంటున్నాం, అలాగే చూసేవి, చదివేవి కూడా."

"అయితే ఎవరివైపూ ఉండరన్నమాట"

"ప్రజలవైపు ఉందామనే కదా ప్రయత్నమంతా. కృష్ణుడు కుచేలుడిని చేరదీసే రోజులు పోయాయి. కుబేరుడికి షేక్ హ్యాండిచ్చేరోజులు, కుబేరుడిని ఆలింగనం చేసుకొనే రోజులు, అతడి ఆస్తులను కాపాడే రోజులొచ్చాయి. ఆ విషయాన్నే చూసేటట్టు, వినేటట్టు, మాట్లాడేటట్లు చేస్తాం ఈ ఆసుపత్రిలోని ఈ విభాగంలో..."

"ప్రొసీడ్ సార్ ప్రొసీడ్. గాంధీగారి మూడు కోతుల కథను తారుమారు చేయండి."

> "చెవితో సరిగ్గా వినడం ఎట్లా, ఎవరు చెప్పింది బాగా వినాలి, ఏది మెదడుకు పంపాలి, ఏది ఇంకో చెవిలోంచి వదిలేయాలి. పనిగట్టుకొని కొందరు పొద్దున లేచినప్పటినుండి చెప్పే విషయాలను ఎలా వినాలి అన్నవి చెవికి సంబంధించి. ఇక కన్ను... రోజూ పేపర్లలో, టీవీల్లో, వాట్సప్ లాంటి ఎలక్ట్రానిక్ మీడియాలో పెట్టే వార్తలు, దేశభక్తి సందేశాలు చదివి వాటిలో నిజమైనది ఏది అన్న విషయాన్ని కంటితో చూడడమే కాదు ఎలా అన్వయించుకోవాలో చెబుతాం. ఇక ముఖ్యమైనది నోరు. ఊరకే నోరుంది కదా అని మాట్లాడడం ఎంత తప్పో, అవసరమైనప్పుడు ఎలా మాట్లాడాలో కూడా తెలుసుకోవాలి. అదే ఇక్కడ చేస్తాం."

సెల్:9849753298

ఒక్కసారి చెక్ చేసుకోండి



'ఒక్క అవకాశం ఇచ్చుంటేనా..' కోరుకున్న హోదా దక్కనపుడు, తోటివాళ్ల విఫలమైనప్పుడు ఆఫీసులో సహజంగానే ఈ మాట వచ్చేస్తుంది. కానీ ఎప్పుడైనా ఆలోచించారా మిమ్మల్ని దాటి వాళ్లకే ఆ అవకాశం ఎందుకు వచ్చిందో? బహుశా ఈ నైపుణ్యాలు లోపించాయేమో చెక్ చేసుకోమంటున్నారు నిపుణులు.

ఆ పరిస్థితుల్లోనూ: ఆనందకరమైన వాతావరణంలో పనిచేయడంలో గొప్పేమీ లేదు. ఒత్తిడిలోనూ పనిచేయగలగాలి, ముగించే సమయంలో పొరపాటూ జరగొచ్చు. ఒక్కోసారి ఉద్యోగానికే ముప్పు కావొచ్చు. ఆ స్థితిలోనూ చేయడానికే ముందుకొచ్చే వారినే సంస్థలు నాయకులుగా పరిగణిస్తాయి.

నమ్మకం: 'ఇది తనైతే చేయగలదు' అన్న భరోసా మీ బృందానికి ఇవ్వగలిగారా? దేన్నైనా ఒకసారి తీసుకుంటే పూర్తిచేయగలదు అన్న భరోసా కల్పించినపుడే ముందుకు నడిపించగలరన్న నమ్మకమూ ఏర్పరచగలుగుతారు. ఇక్కడ పని పూర్తిచేయడమే కాదు.. పొరపాట్లకూ తావివ్వకుండా ఉండగలగాలి.

ఆ చికాకులు ప్రదర్శించవద్దు: ఇల్లు, ఉద్యోగం రెండూ చూసుకోవాలి మనం. అనారోగ్యం, బాధ్యతలతో సతమతం అవుతుండటం సాధారణమే. వాటిని పని దగ్గరికి తీసుకొచ్చినా, ఆ చిరాకులను ఇక్కడ ప్రదర్శించినా మీరు విఫలమైనట్టే. ఎంతసేపూ మీ ఇబ్బందుల గురించే ఆలోచించొద్దు. పక్కవాళ్లవీ తెలుసుకోగలగాలి. అవసరమైతే సాయం చేసేందుకు ముందుకు రావాలి. అప్పుడే మిమ్మల్ని అనుసరించడానికి ఇతరులూ ముందుకొస్తారు.

ఇతరులపై తోస్తున్నారా: అన్నిసార్లూ తీసుకున్న నిర్ణయం సరైనది కాకపోవచ్చు. అవాంతరాలు ఎదురవొచ్చు. మధ్యలోనే వదిలేయడం, తప్పు దొర్లినపుడు ఇతరులపై తోయడం మంచి పద్ధతి కాదు. విజయాన్నే కాదు.. అపజయాన్నీ స్వీకరించడానికి ముందుకు రావాలి.

కలుపుకుంటూ పోవాలి: పని చేసే చోట ఒక్కొక్కరూ ఒక్కోలా ఉంటారు. కొందరు వేగంగా పూర్తి చేయగలిగితే ఇంకొందరు నెమ్మదిగా చేస్తారు. ఎలా ఉన్నా కలుపుకొంటూ పోవడమే నాయకురాలి లక్షణం. వాళ్లని అవమానించేలా మాట్లాడటం, దూషించడం మంచి పద్ధతి కాదు. వాళ్ల పనితీరు వెనుక కారణాన్ని కనుక్కోవాలి. వేగంగా చేసేలా ప్రోత్సహించాలి. కావాలని చేస్తోంటే మాత్రం కఠినంగా వ్యవహరించాలి. అమ్మలా తోడ్పాటు ఇవ్వడమే కాదు.. సరైన దారిలో నడిచేలా చూడటమూ నాయకుల పనే! అయితే అన్నింటికీ 'బెత్తమే పరిష్కారం' అన్న ధోరణి మంచిది కాదు. ఈ లక్షణాలన్నీ మీలోనూ ఉన్నాయేమో ఓసారి పరిశీలించుకోండి.

ఇట్లు చేద్దాం




చేపలు శుభ్రం చేసిన తర్వాత వాటిని ఉంచిన పాత్రల నుంచి వచ్చే నీచు వాసన ఓ పట్టాన పోదు. ఇలాంటప్పుడు వాసన వచ్చే పాత్రలను కొద్దిగా వెన్నతో తోమాలి. ఆ తర్వాత సబ్బు ఉపయోగించి గోరువెచ్చని నీటితో శుభ్రం చేయాలి. ఇలా చేస్తే పాత్రల నుంచి నీచు వాసన రాకుండా ఉంటుంది.

అగ్రకుల అహంకారానికి బలైన మొదటి స్టార్ రోసీ



పి.కె.రోసీ... మలయాళ సినీ చరిత్రలో కన్నీటి బొట్టుగా మిగిలిపోయింది. ఆమె అనుభవించిన బాధ, చేసిన పోరాటం బహుశా సినీ పరిశ్రమలో ఇప్పటి వరకు ఎవరూ ఎదుర్కొని వుండరు. అందుకే ఆమె జీవితం ప్రజలతో ముడిపడి ఉంది. మహిళలు అడుగు కూడా బయట పెట్టలేని కాలంలో సినీ రంగంలోకి ప్రవేశించింది. దళితురాలిగా పుట్టి అగ్రవర్ణ పాత్రను పోషించినందుకు వారి ఆగ్రహానికి గురయింది. ఇటీవలె గూగుల్ ఆమెను గుర్తు చేసింది. ఆమె 120వ పుట్టినరోజు సందర్భంగా డూడుల్‌తో సత్కరించింది. మలయాళంలో మొదటి లీడ్ యాక్టర్‌గా చరిత్ర సృష్టించిన ఆమె బాధాకర ప్రయాణాన్ని గుర్తు చేసింది.

ఫిబ్రవరి 10వ తేదీ నాడు ఎవరైనా గూగుల్‌ను తెరిచినట్టయితే పి.కె రోసీని గౌరవించే అందమైన డూడుల్‌ను చూసి వుంటారు. గూగుల్ ఇంత గొప్పగా పరిచయం చేస్తున్న రోసీ ఎవరు? అనే సందేహం అందరికీ వచ్చి తీరుతుంది. తన విజయ మార్గంలో అనేక అడ్డంకులను అధిగమించిన ఒకప్పటి మలయాళ నటి. ఆమె దళిత క్రిస్టియన్ కమ్యూనిటీలో పుట్టారు. ఆమె పుట్టుకే ఆమె కష్టాలకు కారణమయింది. రోసీ మలయాళంలో మొదటి ప్రధాన నటి. 120 సంవత్సరాల కిందట ఫిబ్రవరి 10న జన్మించారు.



తండ్రి మరణించడంతో...

1903లో కేరళలోని తిరువనంతపురంలోని రోసమ్మగా జన్మించిన ఆమె 'విగతుకుమారన్' చిత్రంలో కథానాయికగా నటించారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా ఆమె సినిమాలపై తనకున్న ప్రేమను మాత్రం వదులుకోలేదు. రోసీ తల్లిదండ్రులు దినసరి కూలీలు. తండ్రి ఓ చర్చిలో వంటపని చేసేవాడు. జీవనోపాధి కోసం గడ్డి కోయడం, ఇండ్లల్లో వంట పని వంటి ఎన్నో పనులు వారు చేసేవారు. రోసీ చిన్నతనంలోనే తండ్రి మరణించడంతో కుటుంబం ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంది. అప్పటి నుండే ఆమె కక్కరిస్సీ నాటకం నేర్చుకొనేందుకు స్థానిక ప్రదర్శన కళల పాఠశాలకు వెళుతుండేవారు. అలా ఇండ్లల్లో వంట పని చేస్తూనే తమిళం, మలయాళం థియేటర్లలో ప్రదర్శనలు ఇచ్చేవారు.

ఇంటిని తగలబెట్టారు

1928లో ఆమె చలనచిత్ర రంగంలోకి ప్రవేశించారు. మొదటి చిత్రంలోనే అగ్రవర్ణ నాయర్ అమ్మాయి సరోజిని పాత్రను పోషించారు. ఇది ఆనాటి అగ్రకులం వారికి అంతగా నచ్చలేదు. ఫలితంగా చిత్ర దర్శకుడు డబ్బును పోగొట్టుకున్నాడు. ఇప్పటివరకు ఆ సినిమా కాపీని ఎవ్వరూ కొనలేదు. ఆ పాత్రలో నటించినందుకు రోసీ ఇంటిని తగలబెట్టారు. ఇలా నటన పట్ల ఆమెకున్న ప్రేమ ఎన్నో సమస్యలను ఎదుర్కొనేలా చేసింది.

పి.కె. రోసీ ఫిల్మ్ సొసైటీ

కండ్ల ముందే తల్లిదండ్రులు సజీవదహనం అయ్యారు. ప్రాణభయంతో ఆమె ఓ ట్రక్కులో ఎక్కి ఎటో పారిపోయారు. దాంతో ఆమె స్టార్ డమ్ గురించి ఎవరికీ తెలియకుండా కనుమరుగయింది. తర్వాత చాలా మంది ఆమె జీవితంపై బయోపిక్ తీయాలని, నవలలు రాయాలని నిర్ణయించుకున్నారు. ఆమె గౌరవార్థం మహిళా మలయాళ నటీనటుల బృందం కలిసి పి.కె. రోసీ ఫిల్మ్ సొసైటీని స్థాపించారు.

రహస్యంగా బతికారు

ప్రాణాలను కాపాడుకునేందుకు పారిపోయిన ఆమె తర్వాత కాలంలో ఎక్కడ ఉన్నారో ఎవరికీ తెలియదు. అయితే కొంత మంది జర్నలిస్టులు చేసిన పరిశోధన ఫలితంగా రోజీ తన జీవితం చివరి వరకు తమిళనాడులో ఉన్నట్టు తెలుస్తుంది. అయితే ఆమె కానీ, ఆమె భర్తకానీ వారి జీవితం గురించి బయటకు చెప్పుకోలేదు. ఏ పాత్ర అయితే పోషించినందుకు ఆమె దూషణలకు గురయ్యిందో ఆ కులానికి చెందిన వ్యక్తితోనే (నాయర్ కుటుంబానికి చెందిన వ్యక్తితో) ఆమెకు వివాహం జరిగింది. వారికి పద్మ అనే అమ్మాయి, నాగప్పన్ అనే కొడుకు ఉన్నట్టు సమాచారం. ప్రస్తుతం వాళ్ళు తమిళనాడులోనే నివసిస్తున్నారు.



రోసమ్మ కోసం పోటీ

1928 నాటికి ఆమె కక్కిరాసి, కోత పాటలు, జానపద పాటలను ప్రదర్శించే "చేరమార్ కళావేదిక" అని పిలిచే కళాకారుల సంఘంలో ఉండేవారు. ఇది కళలు దేవాలయ ప్రాంగణంలోకి ప్రవేశించడానికి శిక్షణా మైదానంగా మారింది. అప్పట్లో రోసమ్మ కోసం కక్కరాసి నాటక బృందం, రాజా పార్టీ డ్రామా ట్రూప్ ఒకదానితో ఒకటి పోటీ పడేవంట. ఈ పోటీనే నటి రోసమ్మ స్టార్ విలువను పెంచింది. అంతటి గుర్తింపు పొందిన ఆమె డేనిమల్ సినిమాలో మొదటి హీరోయిన్ పాత్రకు సరిపోతుందని ఎంపిక చేసుకున్నారు. అలా ఆమె ఆయన చిత్రంలో కథానాయికగా మారారు. ఈ చిత్రంలోనే ఆమె సరోజిని అనే నాయర్ మహిళ పాత్రను పోషించారు.

ఉగ్రరూపం దాల్చారు

'విగతుకుమారన్' విడుదలైనప్పుడు ఒక దళిత మహిళ నాయర్‌గా నటించడాన్ని చూసి భరించలేని నాయర్ సంఘం సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో విగతుకుమారన్ ప్రారంభోత్సవం చేయడానికి సినీ పరిశ్రమలోని చాలా మంది ప్రముఖులు నిరాకరించారు. అందులోని హీరో పాత్ర ఆమె జడలోని పువ్వును ముద్దాడిన సన్నివేశాన్ని చూసి ప్రేక్షకులు స్క్రీన్‌పై రాళ్ల విసిరారు. తిరువనంతపురంలోని క్యాపిటల్ థియేటర్‌లో జరిగిన ఓపెనింగ్‌కు దర్శకుడు డేనియల్ రోసీని ఆహ్వానించలేదు. ఎదురుదెబ్బ తగులుతుందనే భయం ఉన్నప్పటికీ రోసీ అక్కడకు వచ్చారు. అయితే ఆ ఈవెంట్‌ను బహిష్కరించినా ఆమె అక్కడే వుండి సెకండ్ షో చూశారు. దాంతో అగ్రకుల దురహంకారం మరింత ఉగ్రరూపం దాల్చింది. స్క్రీన్‌ను చించివేసి, థియేటర్‌ను పగలగొట్టారు. చివరికి రోసీ అక్కడి నుండి పారిపోవాల్సి వచ్చింది.

ఆమె జీవితంపై సినిమాలు

ఈ సినిమా కథను 1960ల చివరలో చెలంగట్ గోపాలకృష్ణన్ మళ్లీ బయటకు తీసుకొచ్చారు. 1971లో కున్నుకుజీ ఆమె గురించి మొదటి కథనాన్ని ప్రచురించారు. 2013లో డేనియల్ బయోపిక్‌కి కమల్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం కొంత వరకు విను అబ్రహం రాసిన 'నష్ట నాయక' అనే నవల ఆధారంగా రూపొందించబడింది. ఇది రోసీ జీవితానికి చాలా దగ్గరగా వుంది. కొత్త నటి చాందిని గీత ఆమె పాత్రను పోషించింది. ఆమె జీవితంపై మరో రెండు సినిమాలు కూడా నిర్మించబడ్డాయి. అందులో ఒకటి 'ది లాస్ట్ చైల్డ్ అండ్ ఇది రోసియుడే కథ (ఇది రోసీ కథ)".

- సలీమ

ఆరెస్సెస్ విస్తరణకు అడ్డంగా నిలబడదాం

(మొదటిపేజీ తరువాయి)

నిరసిస్తూ ఆందోళనలు నిర్వహించిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన అంతర్జాతీయంగా శాంతి ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు.

జీ20 సమ్మిట్‌లో దేశంలోని సమస్యలపై చర్చించాలి: ఆర్ అరుణ్‌కుమార్

ప్రధాని మోడీ జీ20 సమ్మిట్ ఇంతవరకు ఎక్కడా జరగలేదు, ఇప్పుడు ఇక్కడే జరుగుతున్నట్టు పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంటున్నారని ఐప్సో జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ అరుణ్‌కుమార్ ఎద్దేవా చేశారు. ఇతర దేశాలతో పోల్చి,మనదేశంలో నిరుద్యోగం, ఆరోగ్య వ్యవస్థ, కరోనా సమయంలో ఏయే దేశాల్లో ఎంత మంది మరణించారనే అంశాలపై జీ20 సమ్మిట్‌లో చర్చించాలని డిమాండ్ చేశారు. 'ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు' అనే అంశంపై చర్చించడంపై తమకు ఎలాటి అభ్యంతరం లేదనీ, అయితే వాటిని ఆచరించాలని మోడీకి సూచించారు. భారత వసుదైక కుటుంబం, తాత్విక చింతన చాలా గొప్పదనీ, అయితే వాటన్నింటని అమలు చేసే దమ్ము కేంద్రానికి ఉందా? అని ప్రశ్నించారు. సమ్మిట్‌లో వివిధ అంశాలపై చర్చించేందుకు 30 వర్కింగ్ గ్రూపులను ప్రభుత్వం నియమించిందనీ, అందులో సభ్యదేశాలకు సంబంధించిన వంటకాలను పరిచయం చేస్తున్నారని తెలిపారు. వాటిని తాజ్, మెరిడియన్, ఒబేరాయ్ వంటి హోటళ్లలో సిద్ధం చేస్తున్నారని చెప్పారు. ఆ వంటకాలను సాధారణ ప్రజలు ఆస్వాదించగలరా? అని ప్రశ్నించారు. మైకేల్ రాబర్ట్ చెప్పిన దాని ప్రకారం అమెరికా, బ్రెజిల్ దేశాలు కరోనా విషయంలో చైనా పద్ధతిని అవలంభించకపోవడంతో 10 లక్షల మంది మరణించారని పేర్కొన్నట్టు తెలిపారు. అమెరికా అధ్యక్షులు బైడెన్ 108 బిలియన్ డాలర్ల ఆయుధ సామగ్రిని పంపుతున్నారనీ, అందుకే యుద్ధం కొనసాగుతున్నదని వివరించారు. ఆయా దేశాల్లో యుద్ధ పరిస్థితులను సృష్టించేందుకు అమెరికా కంపెనీలు 700 మంది దళారుల్ని నియమించాయని తెలిపారు. కరోనా సమయంలో అమెరికా కంపెనీలకు రోజుకు రూ. 22,27,360 లక్షల చొప్పున ఆదాయం పెరిగిందనీ, ఇది గంటకు రూ 928 కోట్లుగా నమోదైందని పేర్కొన్నారు. అందులో ఒక శాతం ఖర్చు చేసినా అనేక దేశాల్లో పేదల ఆకలి తీరుతుందన్నారు. యుద్ధాలు అంతమవ్వాలంటే, వ్యవస్థ మూలాల్లోకి వెళ్లి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. అసమానతలు, మతోన్మాదం, మహిళలపై వేధింపులు, దళితులపై దాడులకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరముందని నొక్కి చెప్పారు. అంతేకాకుండా మనకు ఆర్ఎస్ఎస్ ప్రధాన శత్రువు అనీ, దాని విస్తరణకు అడ్డంగా నిలబడాలని పిలుపునిచ్చారు. యువత, మహిళలు, విద్యార్థుల్లోకి ఐప్సోను తీసుకెళ్లాలనీ,తద్వారా ఆయా వర్గాలను ఆకర్షించాలని సూచించారు. యువత సినిమాల్లోని యుద్ధ సన్నివేశాలకు ఆకర్షితులు అవుతున్నారనీ, దాని స్థానంలో శాంతి ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారసులుగా...ఇక్కడి ప్రజల సంస్కృతిని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సంస్కృతికి ప్రతీకలైన గుమ్మటాలను కూలుస్తామనే ప్రకటనలను ఖండించాలని పిలుపునిచ్చారు.

ప్రజల మానసిక స్థితిని మార్చేందుకు ఎన్నో కుట్రలు : వినోద్‌కుమార్

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజల మానసిక స్థితిని మార్చేందుకు ఎన్నో కుట్రలు చేస్తున్నదని ప్రజాశిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగంలోని పీఠికను మారుస్తారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. వామపక్ష భావాల ప్రభావంతోనే రాజ్యాంగంలో లౌకికవాదం, సోషలిజం పదాలను చేర్చారనీ, వాటిని తొలగించేందుకు బీజేపీ కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. కాశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు తర్వాత ఎంత మంది పండితులు మరణించారో లెక్కలు తీయాలని డిమాండ్ చేశారు.

దేశంలో అంతర్గత శాంతి కావాలి : పల్లా

మోడీ అధికారంలోకి వచ్చాక దేశంలో అంతర్గత అశాంతి నెలకొందని సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి చెప్పారు. అందువల్ల రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడంతోపాటు లౌకికవాదాన్ని కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దేశంలో బీజేపీ అసహనాన్ని సృష్టించి ఓట్లు దండుకుందని గుర్తు చేశారు. ఎక్కడ యుద్ధం వచ్చినా అమెరికా ప్రోత్సహిస్తున్నదని విమర్శించారు. ఆ సందర్భంగా ఆయుధాలు అమ్ముకుని లాభాలు గడిస్తున్నారని చెప్పారు.

చట్టసభలు తిట్ల సభలుగా మారాయి : జూలకంటి

అటు పార్లమెంటు, ఇటు అసెంబ్లీలు తిట్ల సభలుగా మారాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి చెప్పారు. చట్టసభల్లోనూ దేశంలోని శాంతి పరిస్థితులపై చర్చించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ మీడియా యుద్ధ పరిస్థితులను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధాలంటే కర్రలు, తుపాకులతో కాకుండా అత్యాధునిక ఆయుధాలు, అణ్వాయుధాలతో చేసేందుకు సిద్ధమయ్యారనీ, ఇది ఆందోళన పరిస్థితులకు దారి తీసుకుందని హెచ్చరించారు. 1991 తర్వాత వివిధ దేశాల్లో జరిగిన యుద్ధాల్లో 9 కోట్ల మంది ప్రజలు మరణించారని ఆందోళన వ్యక్తం చేశారు. మానవత్వం నశించి, తుపాకి కల్చర్ వచ్చిందని పేర్కొన్నారు. దేశంలో బీజేపీ సర్కారు రైతు, కార్మిక, కూలీల వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చిందని విమర్శించారు.

జాతీయ స్థాయి శాంతి సదస్సు నిర్వహించాలి : కాచం

తెలంగాణలో సీఎం కేసీఆర్ సహకారంతో జాతీయ స్థాయి శాంతి సదస్సు నిర్వహించాలని ఐప్సో మహాసభల ఆహ్వాన కమిటీ చైర్మెన్ కాచం సత్యనారాయణ కోరారు. కుల, మతాలు, రాజకీయాలకు అతీతంగా శాంతి స్థాపన కోసం పోరాటం చేస్తామన్నారు. దేశంలో అశాంతి నెలకొందనీ, అందుకే శాంతి కావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐప్సో నేతలు ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి, బొమ్మగాని ప్రభాకర్, జి రఘుపాల్, తిప్పర్తి యాదయ్య, మెట్ల జగన్, ఒబేదుల్లా కొత్వాల్, జగన్‌మోహన్, కేవీఎల్ తదితరులు మాట్లాడారు. అనంతరం పలు అంశాలపై మహాసభ తీర్మానాలను ఆమోదించింది.

శత్రుదేశం మీద పగబట్టినట్టు... తెలంగాణపై బీజేపీ పగబట్టింది

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. పాతనగరంలో రోడ్ల వెడల్పు కోసం రూ.100 కోట్లు కేటాయించామని తెలిపారు.


వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం కింద చేపట్టిన 56 పనులు వివిధ దశల్లో ఉన్నాయని బీఆర్ఎస్ సభ్యులు దానం నాగేందర్ తదితరులు అడిగిన ప్రశ్నకు మంత్రి కేటీఆర్ సమాధానమిచ్చారు. సకాలంలో పనులు పూర్తి చేయకపోతే కార్వాన్ కాంట్రాక్టర్‌ను మారుస్తామని తెలిపారు. చార్మినార్ పాదాచారుల బాట ప్రాజెక్టును ఆరు నెలల్లో పూర్తి చేస్తామనీ, దీన్ని స్వయంగా తానే పర్యవేక్షిస్తానని ఎంఐఎం సభ్యులు అక్బరుద్దీన్ ఓవైసి తదితరులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా మంత్రి చెప్పారు.

హుస్సేన్ సాగర్ వద్ద నీరా కేఫ్‌ను త్వరలోనే ప్రారంభిస్తామని ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. రాష్ట్రంలో సొంతంగా 20 కోట్ల చేప పిల్లలు ఉత్పత్తి చేస్తున్నామని మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. వాటి ఉత్పత్తిని మరింత పెంచేందుకు ఈ రంగంలోకి ప్రయివేటు వ్యక్తులు వస్తే ప్రోత్సహిస్తామని చెప్పారు.

సిగ్గు, లజ్జ లేకుండా బీజేపీ ధర్నాలు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జీహెచ్ఎంసీకి ఇవ్వాల్సిన రూ.2,000 కోట్లు ఇవ్వదు. ఈ విషయంలో ఎన్నిసార్లు అడిగినా దున్నపోతు మీద వర్షం పడ్డట్టు వ్యవహరిస్తున్నది. ఆ పార్టీ రాష్ట్ర నాయకులేమో సిగ్గు, లజ్జ లేకుండా రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు తక్కువ చేశారంటూ జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు ధర్నా చేస్తారు. బీజేపీకి సిగ్గు వచ్చేలా బీజేపీ కార్యాలయం ముందు తామే ధర్నా చేస్తాం .....' అని బీఆర్ఎస్ సభ్యులు దానం నాగేందర్ హెచ్చరించారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ జీహెచ్ఎంసీకి కేటాయించిన నిధుల్లో హైదరాబాద్‌కు సంబంధించి రూ.20 కోట్లు మాత్రమే ఉన్నాయనీ, దాన్ని మరింత పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

అర్ధరాత్రి పడిగాపులు



(మొదటిపేజీ తరువాయి)

పడిగాపులు కాస్తున్నారు. కనీసం బోరునీటితోనైనా నీటిని పారిద్దామనుకుంటే కరెంట్ ఎప్పుడు వస్తదో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. రోజుకు ఉదయం అయిదారు గంటలు, రాత్రి ఐదారు గంటలు మాత్రమే కరెంటు వస్తుందని, ఆ సమయంలో పంటలకు సాగు నీరు అందిస్తున్నామని రైతులు తెలిపారు. అది కూడా సరిపోక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు.

ఈ నెల 2వ తేదీ నుంచి విడుదల చేస్తున్న నిజాంసాగర్ నీటిని 12వ తేదీతో నిలిపివేయనున్నట్టు అధికారులు చెప్పారనీ, ఆ తేదీని మరో ఐదు రోజులు పొడిగించాలని, దాంతో పంటలకు సరిపడా సాగునీరు అందే అవకాశం ఉందని రైతులు తెలిపారు. పంటలు ప్రస్తుతం పొట్ట దశలో ఉన్నాయని సాగునీరు అందకుంటే వేలాది రూపాయల పెట్టుబడులు నష్టపోయి మరింత అప్పులు అయ్యే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కెనాల్‌లో చెత్త చెదారం.. నీటి సరఫరాకు అంతరాయం

కాలువలకు నీటి సరఫరా చేసే ముందు కాలువలను పరిశీలించి చెత్తా చెదారం, పిచ్చిమొక్కలు తొలగించాల్సి ఉంటుంది. అప్పుడే కాలువ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందే అవకాశం ఉంది. కానీ అధికారులెన్నడూ కాలువల స్థితిగతులు పట్టించుకున్న పాపాన పోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. కెనాల్‌లో కనీసం పూడికతీత పనులు చేయకపోవడంతో చివరి ఆయకట్టు పరిధిలోని రైతుల పొలాలకు నీరు అందే అవకాశం లేకుండా పోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువల్లో చెత్తా చెదారం తొలగించాలని రైతులు కోరుతున్నారు.

నిద్ర లేని రాత్రులు గడుపుతున్నాం

- లక్ష్మీనారాయణ రైతు, సాలూర క్యాంపు

పంటలకు సాగునీరు అందించడానికి నిజాంసాగర్ కెనాల్ 14వ నెంబర్ కెనాల్ వద్ద రాత్రంతా అక్కడే పడిగాపులు కాస్తూ నిద్రలేని రాత్రులు గడుపుతున్నాం. 12వ తేదీ నుంచి నీటిని నిలిపివేస్తామని అంటున్నారు.. ఇలా చేస్తే మా పంటలకు సరిపడా నీరు అందదు. ప్రస్తుతం పంటలు పొట్ట దశలో ఉన్నందున మరో ఐదు రోజులు నిజాం సాగర్ నీటిని పొడిగించాలి. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం 24 గంటలు కరెంటు సరఫరా చేసి రైతులను ఆదుకోవాలి.

పై నుంచి ఆదేశాలు రాలే..

- శృతి, ఏఈ, ఇరిగేషన్

కాలువకు నీటి విడుదల గడువు పొడిగింపు 12వ తేదీ వరకే ఉంది. రైతుల అభ్యర్థన మేరకు పొడగించాలని ఉన్నతాధికారులకు నివేదించాం. ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేవు. కాలువలో పూడిక తీత తీసేందుకు గ్యాంగ్‌మెన్లు లేరు. ఉపాధి హామీలో భాగంగా పూడిక తీత పనులు చేయించాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లకు, మండలాధికారులకు గతంలోనే సూచించాం.

దేశ భవిష్యత్తు నిర్మాణంలో ఐపీఎస్‌లది గురుతర బాధ్యత

(మొదటిపేజీ తరువాయి)

శనివారం జరిగిన 74వ బ్యాచ్ యువ ఐపీఎస్ అధికారుల పాసింగ్ అవుట్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. దేశం అమృత్ ఉత్సవాలను జరుపుకుంటున్న తరుణంలో యువ ఐపీఎస్ అధికారులుగా పోలీసు శాఖలో కీలక బాధ్యతలను నిర్వహించనున్న ఈ బ్యాచ్‌పై దేశానికి ఎన్నో ఆశలున్నాయన్నారు. ముఖ్యంగా దేశంలో రాజకీయ నాయకులు ఎమ్మెల్యేలు, ఎంపీలుగా ఐదేండ్లు కొనసాగాక తిరిగి ప్రజల తీర్పును కోరాల్సి ఉంటుందనీ, కాని ఐపీఎస్ అధికారులు నిర్విరామంగా ముప్పై ఐదేండ్లు సర్వీసులో కొనసాగి దేశానికి సేవ చేసే అవకాశాన్ని పొందుతారని తెలిపారు. ముఖ్యంగా ఉగ్రవాదులు, తీవ్రవాదుల నుంచి దేశాన్ని కాపాడటంలో పోలీసులు, వారికి నేతృత్వం వహిస్తున్న ఐపీఎస్ అధికారులు చేసిన శ్రమ, చేసిన త్యాగాలు ఎనలేనివని కొనియాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నేరస్తుల కుయుక్తులను పసిగట్టి దేశ ప్రజలకు శాంతిని ప్రసాదించడంపై ఐపీఎస్ అధికారులు ముందుండాలని అమిత్‌షా కోరారు. గత ఎనిమిదేండ్లలో ఉగ్రవాదుల కార్యకలాపాలను అణిచివేయడంలో పోలీసులు మంచి పాత్రను పోషించారన్నారు. దేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబెట్టడానికి వచ్చే ముప్పై ఏండ్లలో యువ ఐపీఎస్‌లు చేసే కృషి కీలకమైందని అన్నారు. ఈ సందర్భంగా ఐపీఎస్‌లుగా కఠినమైన శిక్షణ పూర్తి చేసుకున్న యువ ఐపీఎస్‌లను ఆయన అభినందించారు. ఎన్‌పీఏ డైరెక్టర్ ఎస్ రాజన్ మాట్లాడుతూ.. యువ ఐపీఎస్‌లు 195 మందికి శిక్షణ కాలంలో నేరాల అదుపు, సైబర్ క్రైమ్, వైట్ కాలర్ నేరాలు, ఉగ్రవాదం, తీవ్రవాదం మొదలుకుని శాంతి భద్రతల పరిరక్షణ వరకు అనేక అంశాలలో కీలకమైన శిక్షణను ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభకనబరిచిన పలువురికి అమిత్ సా అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హెూంశాఖ కార్యదర్శి అజయ్ భల్లా, కేంద్ర ఐబీ చీఫ్ రేఖలతో పాటు వివిధ రాష్ట్రాల డీజీపీలు, కేంద్ర పారామిలటరీ బలగాల చీఫ్‌లు హాజరయ్యారు.


పదోన్నతుల్లో నాట్ విల్లింగ్ ఆప్షన్ కల్పించాలి : ఎస్టీయూటీఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించి ఆన్‌లైన్‌లో నాట్ విల్లింగ్ ఆప్షన్‌కు అవకాశం కల్పించాలని ఎస్టీయూటీఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి సదానందంగౌడ్, ఎం పర్వత్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీనియార్టీ ప్రాతిపదికన తర్వాతి వారికి పదోన్నతి కల్పించాలని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోన్నతుల్లో ఉన్న గెజిటెడ్ హెడ్మాస్టర్ (జీహెచ్ఎం) ఖాళీలను భర్తీ చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి బి భుజంగరావు గెలుపుకోసం విశేష కృషి చేయాలని పేర్కొన్నారు.

ప్రజాబలంతో ఎదుర్కొంటాం..

(మొదటిపేజీ తరువాయి)



మధ్య ఓట్లు చీలితే..అంతిమంగా బీజేపీకి లబ్ది చేకూర్చుతుందన్నది ప్రజలు గ్రహించారు. క్షేత్రస్థాయిలో ప్రజల మనోభావాల్ని తెలుసుకున్నాకే, కాంగ్రెస్..మాతో జతకట్టింది. కొన్నాండ్లుగా వామపక్షాలు, కాంగ్రెస్ కలిసి నిరసన ర్యాలీలు చేపడుతున్నాయి.

తిప్రా మోతా..ప్రభావం ఏమేరకు ఉంటుంది?

తిప్రా మోతా మాతో కలిసి రావాలని కోరాం. ఏమైందో తెలియదు.. 42 స్థానాల్లో అభ్యర్థుల్ని తిప్రా మోతా ప్రకటించింది. బీజేపీ ఓటమే లక్ష్యమని మొదట్నుంచీ చెబుతున్న మోతా.. ఎన్నికల సమయంలో అందుకు అనుగుణంగా వ్యవహరించలేదు. నిజానికి 18 స్థానాల్లో ఆ పార్టీకి సరైన అభ్యర్థులే లేరు. గిరిజనులు ఎక్కువగా ఉన్న స్థానాల్లో ప్రభావం చూపగలదన్నది మా అంచనా. గత ఎన్నికల్లో బీజేపీ, ఐపీఎఫ్‌టీ కలిసి పోటీ చేశాయి. ఆ పార్టీలో ఉన్న నాయకులు, కార్యకర్తలు ఇప్పుడు తిప్రా మోతాలో చేరారు. ప్రాంతమేదైనా ప్రజల మూడ్..బీజేపీకి వ్యతిరేకంగా ఉంది. బీజేపీకి వ్యతిరేకంగా బలమైన అభ్యర్థి, పార్టీ ఏది? అన్నదే ముఖ్య అంశంగా మారింది. గిరిజన బెల్ట్‌లో బీజేపీకి ఒక్క స్థానం కూడా రాదు.

త్రిపుర ఎన్నికల ద్వారా దేశ ప్రజలు అందుకునే సందేశం?

ప్రజలంతా ఒక్కటైతేనే రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోగలమనేది సందేశం. ప్రజలు మేల్కోవాలని అనేక సమావేశాల్లో స్వయంగా కోరాను. ప్రజాబలం ఒక్కటే బీజేపీని ఓడించగలదు. ఎన్నికల్ని స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని వామపక్షాలు కోరాయి. ఫిర్యాదులు, పిటిషన్లు ఈసీ దృష్టికి తీసుకెళ్లాం. పోలీసు, ఎన్నికల అధికారులపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలి. మద్యపానం, డబ్బు పంపిణీ కాకుండా..అడ్డుకోవాల్సిన బాధ్యత ఈసీపైన్నే ఉంది.

అప్పుడే 'వేసవి' తాకిడి

ఎండుతున్న పంట పొలాలు

- సాగర్ ఎడమకాల్వ చివరి భూములకు అందని సాగునీరు
- ఆందోళన చెందుతున్న రైతులు





నవతెలంగాణ-మిర్యాలగూడ

వేసవి ప్రభావం అప్పుడే పంట పొలాలపై పడింది.. అయితే.. బోరు బావుల్లో నీరున్నా.. కాల్వల ద్వారా నీరు వస్తున్నా కరెంట్ కోతలు.. రాత్రి వేళల్లో కరెంట్ ట్రిప్ అవడంతో మరమ్మతులు లేక పొలాలకు నీరు పారడం లేదు. సాగర్ ఎడమకాల్వ పరిధిలోని మేజర్ల కింద ఉన్న పంట పొలాలకు సాగునీరు అందడం లేదు. చివరి వరకు నీరు రాకపోవడంతో వరి పొలాలు ఎండుతున్నాయి. పొట్ట దశలోకి వచ్చిన వరి పంట పొలాలు నీరు అందకపోవడంతో ఆ పొలాలు బీడుగా మారుతున్నాయి. డిజైన్ కంటే అధికంగా సాగునీరు విడుదల చేస్తున్నప్పటికీ చివరి భూములకు నీరు అందడం లేదు. ప్రధానంగా రాత్రి వేళలో కరెంటు సరఫరా చేయడం.. అర్ధరాత్రి సమయంలో కరెంట్ ట్రిప్ కావడంతో చివరి భూములకు నీరు అందడం లేదని రైతుల పేర్కొంటున్నారు. మెట్ట పంటలు వేయాల్సిన భూముల్లో కూడా వరి సాగు చేయడం వల్ల పంట విస్తీర్ణం పెరిగి నీటి వినియోగం సరిపోవడం లేదని అధికారులు అంటున్నారు. కాలువ లైనింగ్ పనులు పూర్తిగా ఆధునీకరించామని.. మేజర్లు, మైనర్ల మరమ్మతులు చేశామని.. చివరి భూములకు కూడా నీరు అందుతుందని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నా.. అది వాస్తవ రూపం దాల్చడం లేదు.

సాగర్ ఎడమకాల పరిధిలో పలు మేజర్లు ఉన్నాయి. వీటి పరిధిలో ముల్కల కాల్వ, కిష్టాపురం, వజీరాబాద్, ముక్తల్ బ్రాంచ్ కాల్వలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 80 వేల ఎకరాల వరి పంట సాగు అవుతుంది. సుమారు 20శాతం అంటే 16 వేల ఎకరాలు కాల్వ చివరి భూములుగా ఉన్నాయి. ఈ భూములకు సాగు నీరు అందటం లేదు. ఒక్కొక్క మేజరుకు 170 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని డిజైన్ చేసినప్పటికీ.. దానికి 200 నుంచి 220 క్యూసెక్కుల వరకు విడుదల చేస్తున్నారు. అయినా చివర భూముల వరకు నీరు పారటం లేదు. వరి పొలాలకు నీరు అందక పొట్ట దశలోనే ఎండిపోయి బీడులుగా మారుతున్నాయి.

సరఫరా కానీ 24 గంటల కరెంట్

వ్యవసాయానికి నిరంతరం విద్యుత్తు అందిస్తున్నామని అధికారులు చెబుతున్నా వాస్తవానికి నిరంతరం కరెంటు అందడం లేదు. వ్యవసాయానికి రాత్రి వేళలో కరెంట్ ఇవ్వడం వల్ల అర్ధరాత్రి సమయాల్లో ట్రిప్ అవుతుంది. రాత్రి 10 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు కరెంటు అందిస్తున్నారు. ఆ సమయంలోనే మోటార్ల ద్వారా సాగునీటిని పంట పొలాలకు మళ్లించుకుంటున్నారు. రాత్రి వేళలో కరెంట్ ట్రిప్ కావడం వల్ల మరమ్మతులు చేసే వారు లేకపోవడంతో ఆ భూములకు నీరు అందడం లేదు. గ్రామాల్లో ఉన్న మెకానిక్‌ల ద్వారా మోటార్లు రిపేరు చేయించుకోవడంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీని కారణంగా ఒకటి రెండ్రోజుల పాటు నీరు అందే పరిస్థితి లేకుండా పోయింది. ఇదే తరహాలో కాలువ చివర భూముల రైతుల పరిస్థితి ఉంది.

పగటిపూట కరెంట్ ఇవ్వాలి..

రాత్రిపూట కరెంట్ ఇవ్వడం వల్ల మధ్యలో ట్రిప్ అవుతుంది. పొలాలకు ఒకేసారి కరెంట్ ఇవ్వడంతో లోడ్ పెరిగి మోటార్లు కాలిపోతున్నాయి. ఈ మోటర్లు రిపేరు చేయించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ఆలోపు పొలాలకు నిరందక ఎండిపోతున్నాయి. రాత్రి వేళలో కాకుండా పగటి వేళలో కరెంటు ఇవ్వాలి.

భాస్కర్- రాయినిపాలెం

చివరి భూముల రైతులను ఆదుకోవాలి

మేజర్ల పరిధిలో ఉన్న కాలువ చివరి భూములకు నీరు అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. డిజైన్ ప్రకారం నీటిని విడుదల చేస్తున్నా చివరి భూముల వరకు నీరు అందడం లేదు. ప్రధానంగా రాత్రి వేళలో కరెంటు ఇవ్వడం వల్ల రైతులందరూ ఆ సమయంలోనే నీటిని తమ పొలాలకు మళ్లించుకుంటున్నారు. కాల్వ చివరి వరకు నీరు పారడం లేదు. చివరి భూముల వరకు నీరందించి రైతులను ఆదుకోవాలి. లేని పక్షంలో రైతులను సమీకరించి పెద్దఎత్తున ఆందోళన చేస్తాం.

రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాగిరెడ్డి మంగారెడ్డి

నీటిని పొదుపుగా వాడుకోవాలి

సాగునీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలి. ముఖ్యంగా మేజర్ల పరిధిలోనే ఉన్న చివరి భూముల రైతులకు సాగునీరు అదేవిధంగా పైన ఉన్న రైతులు సహకరించాలి. నీరు కింది వరకు పారే విధంగా రైతులు చూడాలి. వరి పంట సాగు విస్తీర్ణం పెరగడం వల్ల చివరి భూములకు నీరందడం కష్టంగా మారింది. అయినప్పటికీ డిజైన్ కంటే అదనంగా సాగునీటిని విడుదల చేస్తున్నాం.

ఎన్నెస్పీ డీఈ బుచ్చిబాబు

బిజినెస్

భారత నియంత్రణ సంస్థలు దిట్ట

- అదాని కేసును చూసుకుంటాయి
- మంత్రి సీతారామన్ వెల్లడి ఆర్‌బిఐ బోర్డుతో భేటీ
- ద్రవ్యోల్బణం 5.3 శాతానికి తగ్గొచ్చు : శక్తికాంత దాస్



న్యూఢిల్లీ: అదాని గ్రూపు సంక్షోభంపై ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మరోమారు స్పందించారు. భారత నియంత్రణ సంస్థల్లో అనుభవమున్న వ్యక్తులు, నిపుణులు ఉన్నారని, ఎప్పటిలానే వాటి పని అవి చేస్తున్నాయ ని మంత్రి పేర్కొన్నారు. శనివారం మంత్రి ఆర్‌బిఐ బోర్డుతో భేటీ అయ్యారు. అనంతరం ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్‌తో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు. అదానీ గ్రూపునపై వచ్చిన తీవ్ర ఆరోపణలపై విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి ఒక్క మాటలో భారత రెగ్యులేటరీ సంస్థలు వాటి పని అవి చూసుకుంటాయన్నారు. కొత్త పన్ను విధానం వల్ల మధ్య తరగతికి చెందిన వేతన జీవులకు మేలు జరుగుతుందన్నారు. చేతిలో డబ్బులు మిగిల్చే ఉద్దేశ్యంతోనే నూతన పన్ను విధానం ప్రవేశపెట్టామన్నారు. క్రిప్టో కరెన్సీల అంశంలో నియమ, నిబంధనలపై జి 20 దేశాలతో చర్చిస్తున్నా మన్నారు. ఆర్‌బిఐ బోర్డు అంతర్జాతీయ, జాతీయ ఆర్థిక పరిస్థితులు, సవాళ్లను సమీక్షించిందని అధికార వర్గాలు తెలిపాయి. ప్రతి ఏడాది కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత ఆర్థిక మంత్రి ఆర్‌బిఐ బోర్డును ఉద్దేశించి మాట్లాడుతారు. ఈ ఆనవాయితీగానే 2023-24 బడ్జెట్ ప్రకటన తర్వాత మంత్రి సీతారామన్ భేటీ అయ్యారు. బడ్జెట్‌పై ఆర్థిక మంత్రిని అభినందిస్తూ, ఆర్‌బిఐ బోర్డు సభ్యులు ప్రభుత్వం పరిశీలన కోసం కొన్ని సూచనలు చేశారని అధికార వర్గాలు తెలిపాయి. ముడి చమురు ధరలు స్థిరంగా ఉంటే 2023-24లో ద్రవ్యోల్బణం 5.3 శాతానికి చేరనుందని ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ పేర్కొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో బ్యారెల్ చమురు 95 డాలర్లు ఉండొచ్చన్నారు. రుణాలు, డిపాజిట్లపై వడ్డీ రేట్లు అనేవి పోటీ మార్కెట్ నిర్ణయిస్తుందన్నారు. వడ్డీ రేట్లు ఇప్పుడిప్పుడే సానుకూలంగా మారాయని అన్నారు. దీర్ఘ కాలానికి ప్రతికూల లేదా అధిక వడ్డీ రేట్లు అస్థిరతను సృష్టించగలవన్నారు. వడ్డీ రేటు పెరుగుదల ధరల స్థిరత్వంలో ఒక బాగమన్నారు. ఇటీవలి ఆర్‌బిఐ రెపో రేటు 25 బేసిస్ పాయింట్లు పెంచి 6.50 శాతానికి చేర్చిన విషయం తెలిసిందే. సర్వీస్ సెక్టార్ ఎగుమతులు చాలా బాగా జరుగుతున్నాయని, చెల్లింపుల బ్యాలెన్స్ పరిస్థితి బాగుందన్నారు. రెమిటెన్స్‌లు 27 శాతం పెరిగాయన్నారు. సరుకుల ఎగుమతులు పుంజుకుంటున్నాయని పేర్కొన్నారు. దీంతో వార్షిక లక్ష్యాన్ని 400 బిలియన్ డాలర్లు సాధించడం సాధ్యపడుతోందని దాస్ పేర్కొన్నారు. చమురు ధరలు గణనీయంగా తగ్గితే.. ఇతర వస్తువుల ధరలు, ద్రవ్యోల్బణం తగ్గడానికి దారితీయడం ద్వారా ఆర్‌బిఐ పరపతి విధానానికి అనుకూలంగా మారనుందన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ సహాయ మంత్రులు భగవత్ కరాద్, పంకజ్ చౌదరి, ఆర్థిక కార్యదర్శి సోమనాథన్, దీపమ్ సెక్రటరీ తుహిన్ కాంత పాండే, రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా, ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్, ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అజయ్ సేథ్, బ్యాంకింగ్ సెక్రటరీ వివేక్ జోషి తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్ ఏసియాకు రూ.20లక్షల జరిమానా



ముంబయి: ఎయిర్ ఏసియా విమానయాన సంస్థకు డైరెక్టరేట్ ఆఫ్ జనరల్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) భారీ జరమానా విధించింది. పైలెట్ల శిక్షణలో వైఫల్యం చెందినందుకు రూ. 20 లక్షల జరిమానా వేసింది. అంతర్జాతీయ పౌర విమానయాన రెగ్యులేటరీ నిబంధనల ప్రకారం విమానాన్ని నడిపే పైలట్‌కు సామర్థ్య పరీక్షలు నిర్వహించేటప్పుడు కొన్ని కచ్చిమైన చర్యలు పాటించాలి. వాటిని పాటించడంలో ఆ సంస్థ వైఫల్యం చెందిందని డిజిసిఎ పేర్కొంది. డిజిసిఎ నిబంధనల మేరకు విధులు నిర్వహించడంలో అలసత్వం ప్రదర్శించిన ఎయిర్‌లైన్స్ శిక్షణ విభాగ అధిపతిని మూడు నెలల పాటు తొలగిస్తూ చర్యలు తీసుకుంది. ఎనిమిది మంది సూపర్‌వైజర్లకు రూ.3 లక్షల చొప్పున జరిమానా వేసింది. ఈ అంశంలో ఏయిర్ ఆసియాకు నోటీసులు జారీ చేసింది.

ఐఒ టెక్‌తో సిన్జెంటా జట్టు

న్యూఢిల్లీ : గ్రామీణ యువతకు ఉపాధి కల్పించడానికి వీలుగా వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగంపై అవగాహన పెంచడానికి ఐఒ టెక్‌తో సిన్జెంటా భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. ఇందులో డ్రోన్ సాంకేతికత ఉపయోగంపె గ్రామీణ యువతకు శిక్షణ అందించడంతో పాటుగా అభివృద్ధి చేసేందుకు 2000 డ్రోన్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు సిన్జెంటా పేర్కొంది. దేశంలోని విభిన్న ప్రాంతాలలో ఐఒ టెక్ వరల్డ్ డ్రోన్ సాంకేతికత వినియోగించి సిన్జెంటా అనుమతించిన రసాయనాలను స్ప్రే చేయడం గురించి కలిసి పనిచేయనున్నాయని తెలిపింది. భారీ స్థాయిలో 400 ఎకరాలపై ట్రయల్స్ చేసిన తర్వాత 20 పంటలకు సంబంధించి డాటాను రెగ్యులేటర్లకు సమర్పించడం జరిగిందని సిన్జెంటా ఎండి, కంట్రీ హెడ్ సుశీల్ కుమార్ పేర్కొన్నారు.

అదాని కంపెనీల షేర్ల తనఖా

- ఎస్‌బిఐ క్యాప్ వెల్లడి

న్యూఢిల్లీ : అదాని గ్రూపునకు చెందిన మూడు కంపెనీల షేర్లను తనఖాగా పెట్టుకున్నామని ఎస్‌బిఐ క్యాప్ ట్రస్టీ కో వెల్లడించింది. దీంతో రుణాలు ఇచ్చినట్లు బిఎస్ఇకి సమాచారం ఇచ్చింది. అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్, అదానీ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్, అదానీ గ్రీన్ ఎనర్జీ షేర్లను తనఖాగా పెట్టుకున్నట్లు ఎస్‌బిఐకి చెందిన ఈ సంస్థ వెల్లడించింది. అయితే ఈ షేర్లపై ఎంత రుణం ఇచ్చిందనే అంశాన్ని ఎస్‌బిఐ క్యాప్ వెల్లడించలేదు. అమెరికన్ సంస్థ హిండెన్ బర్గ్ రిపోర్ట్ దెబ్బకు జనవరి 24 నుంచి అదానీ కంపెనీల షేర్లు భారీ పతనాన్ని చవి చూస్తున్న విషయం తెలిసిందే.

శిలాజ ఇంధనాలు కావాలి

- ఎస్సార్ ఆయిల్ ఛైర్మన్ వెల్లడి

బెంగళూరు : దేశంలో ఉద్గారాల తీవ్రతను 45 శాతం తగ్గించాలన్న లక్ష్యాన్ని చేరుకోవడంలో శిలాజ ఇంధనాలు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తాయని ఎస్సార్ కాపిటల్ డైరెక్టర్, ఎస్సార్ ఆయిల్ యుకె బోర్డు ఛైర్మన్ ప్రశాంత్ రుయా పేర్కొన్నారు. ఇక్కడ నిర్వహించిన ఇండియా ఎనర్జీ వీక్‌లో 'అతి తక్కువ కార్బన్ ఎనర్జీ మిక్స్ దిశగా పరివర్తన : ఇంధన కంపెనీలు ఏ విధంగా స్వీకరిస్తున్నాయి..?." అనే అంశంపై రుయా మాట్లాడుతూ.. ఇప్పటికే ఉన్న స్వచ్ఛ ఇంధన సామర్థ్యాల మార్పు, నూతన శక్తి సామర్థ్యాలను కలిపి సృష్టించాలన్నారు. ప్రస్తుత ఇంధనాలను ఒక్కసారిగా మార్చడం సాధ్యం కాదని, నూతన, స్వచ్ఛ ఇంధన వ్యవస్థలను నిర్మించడానికి ప్రస్తుత మౌలిక సదుపాయాలను వినియోగించాల్సి ఉందన్నారు. రాబోయే రోజుల్లో ఈ రంగంలో అసాధారణ వృద్ధి కనిపించనుందన్నారు.

మారుతి సుజుకి నుంచి కొత్త టూర్ ఎస్

- ధర రూ.6.5 లక్షలు

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి మార్కెట్లోకి కొత్త టూర్ ఎస్ మోడల్‌ను విడుదల చేసింది. రెండు వేరియంట్లలో దీన్ని ఆవిష్కరించింది. 1.2 లీటర్ 5ఎంటి ధరను రూ.6,51,000గా నిర్ణయించింది. సిఎన్‌జి వర్షన్ ధరను రూ.7.36 లక్షలుగా ప్రకటించింది. 1.2ఎల్ కె-సీరిస్ ఇంజిన్‌తో ఆవిష్కరించిన ఈ మోడల్ తమ సంస్థను మరింత బలోపేతం చేయనుందని మారుతి సుజుకి విశ్వాసం వ్యక్తం చేసింది.

రాణించిన సూర్యోదయ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్

హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన తొమ్మిది మాసాల కాలంలో సూర్యోదయ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ రూ.38.8 కోట్ల నికర లాభాలు సాధించినట్లు ప్రకటించింది. ఇంతక్రితం ఏడాది ఇదే కాలంలో రూ.44.9 కోట్ల నష్టాలు చవి చూసింది. 2022 డిసెంబర్‌తో గడిచిన తొమ్మిది మాసాల్లో బ్యాంక్ స్థూల అడ్వాన్సులు 11 శాతం పెరిగి రూ.5,402 కోట్లుగా నమోదయ్యాయి. నికర వడ్డీ ఆదాయం 22.5 శాతం వృద్ధితో రూ.536.5 కోట్లుగా చోటు చేసుకుందని ఆ బ్యాంక్ తెలిపింది.

అదానీ వ్యవహారానికి దేశభక్తి ముసుగు

విచారణకు ఆదేశిస్తే తప్పేంటి?

- ఎస్వీకే వెబినార్‌లో ఆర్థికరంగ విశ్లేషకులు డీ పాపారావు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హిండెన్ బర్గ్ నివేదికతో పోయిన ప్రతిష్టను కాపాడుకొనేందుకు ఆదానీ, బీజేపీ నానా అవస్థలు పడుతున్నాయని ప్రముఖ ఆర్థికరంగ విశ్లేషకులు డీ పాపారావు అన్నారు. హిండెన్‌బర్గ్‌ను షార్ట్ సెల్లర్, బ్లాక్‌మెయిలర్‌గా బీజేపీ శ్రేణులు ప్రచారం చేస్తున్నాయని చెప్పారు. 2020-21లో అదానీ షేర్లకు ఒకేసారి 80 శాతం మార్కెట్ పెరిగిందని గుర్తుచేశారు. సుందరయ్య విజ్ఞానకేంద్రం (ఎస్వీకే) ఆధ్వర్యంలో శనివారం "అదానీపై హిండెన్‌బర్గ్ నివేదిక-ఆర్థిక రంగంలో దాని పర్యవసానాలు" అంశంపై వెబినార్ జరిగింది. ఎస్వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్ సమన్వయ కర్తగా వ్యవహరించారు. డీ పాపారావు ప్రధాన వక్తగా మాట్లాడుతూ...అదానీ షేర్లను హిండెన్‌బర్గ్ ఉద్దేశ్యపూర్వకంగా పడిపోయేలా చేసి, ఆ షేర్లను అదే సంస్థ తిరిగి కొనుగోలు చేసి, ఆ తర్వాత లాభాలు ఆర్జిస్తుందనీ, గతంలో ఇలాగే పలు కంపెనీల షేర్లు పడిపోయేలా చేసిందంటూ బీజేపీ శ్రేణులు అదానీ పక్షాన ప్రచారం మొదలుపెట్టారన్నారు. హిండెన్ బర్గ్‌కు విదేశీ ముద్ర వేసి, అదానీని దేశభక్తుడిగా కీర్తిస్తూ, అదేదో దేశంపై దాడి అన్నట్టు చిత్రీకరిసున్నారని చెప్పారు. అదానీ వ్యవహారంపై ప్రధాని నరేంద్రమోడీ నోరుమెదపకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నదని అన్నారు. ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశిస్తే, కేంద్రానికి జరిగే నష్టం ఏంటని ప్రశ్నించారు. ఈ అంశంపై పార్లమెంటులో ప్రతిపక్షాలు నిలదీస్తున్నా ప్రధాని మోడీ సమాధానం చెప్పకపోవడం ప్రజాస్వామ్యం ఎలా అవుతుందన్నారు. సంపద పలువురి చేతుల్లో ఉంటే పెట్టుబడులు ప్రజాస్వామ్యబద్ధంగా ఉన్నట్టనీ, కొందరి చేతుల్లోనే కేంద్రీకృతమైతే ప్రజల సొమ్ముకు భద్రత ఎక్కడ ఉంటుందన్నారు. ఎల్ఐసీ, ఎస్‌బీఐ వంటి సంస్థలతో ఆదానీ గ్రూపులో పెట్టుబడులు పెట్టేలా ప్రేరేపించిన పరిస్థితులపైనా విచారణ జరగాలన్నారు. కోవిడ్ సమయంలో చైనా నుంచి పలు వస్తువుల ఉత్పత్తి, సరఫరా నిలిచిపోయాయనీ, ఆ ప్రభావం అనేక దేశాలపై పడిందన్నారు. చైనాకు ప్రత్యామ్నాయంగా భారతదేశాన్ని తయారు చేయాలని కేంద్రం 'మేకిన్ ఇండియా' నినాదం ఇచ్చిందన్నారు. అయితే ఆ ప్రయత్నం బెడిసి కొట్టిందని వివరించారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) భారతదేశంలో పెట్టేకంటే వియత్నాం, కంబోడియాల్లో పెట్టడం శ్రేయస్కరంగా భావిస్తున్నారని విశ్లేషించారు. దీనికి కేంద్రంలోని ప్రభుత్వం తన అనుకూలురకు మాత్రమే వ్యాపార అనుమతులు ఇవ్వడం కారణమన్నారు. అదానీ, అంబానీని కాదని ఇతరులకు అవకాశాలు ఇచ్చే పరిస్థితులు లేవన్నారు. అందువల్లే ఎఫ్‌డీఐలు రావట్లేదని వివరించారు. అదానీ-హిండెన్‌బర్గ్‌కు మధ్య ఏవైనా వైరుధ్యాలు, విభేదాలు ఉంటే, అవి వారి వ్యక్తిగతమనీ, దానికీ, జాతీయత, దేశభక్తికి సంబంధం ఏంటన్నారు.

ఆరోగ్యశ్రీని తీసేయొద్దు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆయుష్మాన్ భారత్ అమలు పేరుతో రాష్ట్రంలో ఆరోగ్యశ్రీని తీసేయొద్దని అసెంబ్లీలో ప్రతిపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ ప్రభుత్వాన్ని కోరారు. దానివల్లే పేద ప్రజలకు మేలు కలుగుతుందని చెప్పారు. అయితే వైద్యానికయ్యే రేట్లు ఎన్నో ఏండ్ల క్రితం నిర్ణయించారనీ, వాటినే ప్రస్తుతం చెల్లిస్తుండడంతో కార్పొరేట్ ఆస్పత్రులు రోగులను చేర్చుకోవడం లేదని అన్నారు. అందువల్ల ఆరోగ్యశ్రీ రేట్లను ప్రస్తుత అవసరాలకనుగుణంగా మార్చాలని సూచించారు. ఆరోగ్యశ్రీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయనీ, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శనివారం శాసనసభలో వ్యవసాయం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, హోం శాఖ, వైద్యారోగ్యం, నీటిపారుదల, జీఏడీ వంటి పద్దులపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా అక్బరుద్దీన్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార భాష తెలుగు, రెండో అధికార భాష ఉర్దూ అని చెప్పారు. ఈక్రమంలో ఉర్దూ కమిషన్‌ను నియమించాలన్నారు. టీఎస్‌పీఎస్సీలో మైనార్టీ సభ్యుడుండాలని సూచించారు. విద్యా, ఉద్యోగ నియామకాల్లో నాలుగు శాతం మైనార్టీ రిజర్వేషన్లను అమలు చేయాలని కోరారు. తెలుగు, ఇంగ్లీష్‌తోపాటు ఉర్దూలోనూ పోటీ పరీక్షలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్ఆర్ఐ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. బస్తీ దవాఖానాలు మరిన్ని అవసరమనీ, నిమ్స్‌కు ప్రత్యేక నిధులు కేటాయించాలని చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగున్నాయనీ, ఎలాంటి అల్లర్లు జరగడం లేదని అన్నారు. హిందూ ముస్లింలు కలిసున్నారు, కలిసే ఉంటారని వివరించారు. ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించడంపై కాకుండా చలానాలు వేయడంపైనే దృష్టి కేంద్రీకరించారని విమర్శించారు. దీంతో సామాన్యులపై భారాలు పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హెల్మెట్ లేకపోయినా, ముగ్గురు ద్విచక్రవాహనంపై వెళ్లినా చలానాలు వేస్తే అభ్యంతరం లేదన్నారు. కానీ ట్రాఫిక్ పోలీసులు ఓ మూలన కూర్చుని ఫొటోలు తీసి పంపడం సరైంది కాదని చెప్పారు. పెట్రోల్, గ్యాస్ సిలిండర్, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ప్రజలు సతమతమవుతున్నారని అన్నారు. వాటికితోడు ట్రాఫిక్ పోలీసుల చలాన్లు వేయడంతో వాహనదారులు బయటికి రావాలంటేనే భయపడుతున్నారనీ, పరేషాన్‌లో ఉన్నారని చెప్పారు. ఎలాంటి కారణం లేకుండా తొలగించిన హోంగార్డులకు ఉద్యోగాలివ్వాలని కోరారు. పోలీసు కానిస్టేబుల్, ఎస్ఐ నియామకాల్లో లాంగ్‌జంప్, షాట్‌పుట్, పరుగుపందెం నిబంధనలు దేశంలో ఎక్కడా లేవన్నారు. వాటికి సంబంధించి పాత విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 2004లో నియామకమైన ఎస్ఐలకు పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) అమలు చేసి, కానిస్టేబుళ్లకు మాత్రం కాంట్రిబ్యూరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) అమలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆర్టీసీ ఉద్యోగులకు పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి : రఘునందన్‌రావు

దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని బీజేపీ సభ్యుడు రఘునందన్‌రావు కోరారు. అక్కడ డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించాలన్నారు. వంద పడకల ఆస్పత్రికి సిబ్బందిని నియమించాలని సూచించారు. పెద్ద చెరువు పనులకు నిధులు కేటాయించి త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. 800 మంది హోంగార్డులను కక్షసాధింపుతో తొలగించారని చెప్పారు. పదేండ్ల సర్వీసు పూర్తి చేసిన వారిని ప్రత్యేకంగా గుర్తించి మానవతాదృక్పథంతో ఉద్యోగాల్లోకి తీసుకోవాలని సూచించారు.

బావుల దగ్గరకు రోడ్లెయ్యాలి : ధర్మారెడ్డి

పల్లె ప్రగతి ద్వారా గ్రామాల్లో రోడ్లు మెరుగయ్యాయని బీఆర్ఎస్ సభ్యుడు ధర్మారెడ్డి అన్నారు. మారుమూల ప్రాంతాలు, తండాలకూ రోడ్లు వేయడంతో ప్రజలు ఆనందంతో ఉన్నారని చెప్పారు. అయితే ట్రాక్టర్లు, కార్లు రావడంతో వారి పొలాలు, బావుల దగ్గరికి రోడ్లు ఉంటే బాగుంటుందన్న అభిప్రాయం ప్రజల్లో ఉందన్నారు. పంచాయతీరాజ్ నిధులతో ఆ రోడ్లు వేయాలని కోరారు. ప్రగతి భవన్‌ను పేల్చేస్తాం...కొత్త సచివాలయం గేట్లు పగలగొడతామంటూ మాట్లాడుతున్న పిచ్చోళ్లకు ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు. మిర్చి, పసుపు పంటలకు మద్దతు ధర ప్రకటించలేదని బీఆర్ఎస్ సభ్యుడు పెద్ద సుదర్శన్‌రెడ్డి అన్నారు. దీంతో ఆయా రైతులు ఉనికి కోల్పోయే ప్రమాదముందన్నారు. అదానీ కోసం రైతు చట్టాలను కొత్తరూపంలో కేంద్రం అమలు చేస్తున్నదని విమర్శించారు. రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయని బీజేపీ నాయకులపై 420 కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల వేదికలలో పత్రికా స్వేచ్ఛను చేర్చాలి

జర్నలిస్టుల భద్రతపై తక్షణ పరిష్కార చర్యలు తీసుకోవాలి

- ఎంపీలు, రాజకీయ పార్టీలకు జర్నలిస్టు సంఘాల బహిరంగ లేఖ

న్యూఢిల్లీ : రాజకీయ నేతలు, ఎంపీలు తమ ఎన్నికల వేదికల్లో పత్రికా స్వేచ్ఛకు సంబంధించిన చార్టర్‌ను చేర్చాలని నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఎన్ఏజే), ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (డీయూజే) బహిరంగా లేఖను విడుదల చేశాయి. గత దశాబ్దంలో అనేక దాడులను ఎదుర్కొన్న భారత దేశంలోని జర్నలిస్టుల భద్రత, భద్రతను నిర్ధారించడానికి తక్షణ నివారణ చర్యల అవసరాన్ని ఈ లేఖ హైలెట్ చేసింది. పెరుగుతున్న మీడియా కార్పొరేటీకరణ, పత్రికా స్వేచ్ఛపై అది చూపుతున్న దుష్ప్రభావాల గురించి కూడా లేఖలో ప్రస్తావించాయి. ప్రభుత్వాల విస్తృతమైన ప్రకటనలు మీడియాలోని పెద్ద విభాగాలను కొనుగోలు చేశాయనీ, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని లేఖలో పేర్కొన్నాయి.

లేబర్ కోడ్‌లపై ఆందోళన

మీడియా గుత్తాధిపత్యం, క్రాస్-మీడియా హెూల్డింగ్‌లతో సహా మీడియాలోని సమస్యలను పరిష్కరించడానికి ఒక ఉమ్మడి జాతీయ మీడియా కౌన్సిల్, నిపుణుల మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ఎన్ఏజే, డీయూజే లు పిలుపునిచ్చాయి. వర్కింగ్ జర్నలిస్టుల చట్టం, 1955, వేతనాల చెల్లింపు చట్టం, 1958 వంటి జర్నలిస్టుల రక్షణ చట్టాలను రద్దు చేయడం మరియు వాటి స్థానంలో లేబర్ కోడ్‌లను తీసుకురావడంపై కూడా లేఖ ఆందోళన వ్యక్తం చేసింది. మీడియా ఉద్యోగులు, మొత్తం కార్మిక వర్గం హక్కులను కోడ్‌లు తీవ్రంగా తగ్గించాయని ఇది నొక్కి చెప్పింది.

మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి

భారతదేశంలోని జర్నలిస్టుల పరిస్థితులను మెరుగుపర్చడానికి తీసుకోవాల్సిన పలు చర్యలు, ఉమ్మడి మీడియా కౌన్సిల్ మరియు మీడియా కమిషన్ ఏర్పాటు, క్రాస్ మీడియా యాజమాన్యంపై బాధ్యతాయుతమైన తనిఖీలు, గత వేజ్ బోర్డ్ సిఫారసుల అమలు, అదనంగా జర్నలిస్టులకు సరైన రిస్క్ ఇన్సురెన్స్ కవరేజ్, పెన్షన్ స్కీమ్‌లు, చిన్న, స్వతంత్ర డిజిటల్ మీడియా సెన్సార్‌షిప్‌ను ప్రారంభించే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రూల్స్ 2021కు ఇటీవల చేసిన సవరణలను ఉపసంహరించాలనడం.. వంటివి లేఖలో జర్నలిస్టు సంఘాలు ప్రస్తావించాయి.

జర్నలిస్టులపై చట్టాల దుర్వినియోగం

జర్నలిస్టులు అరెస్టు చేయడానికి, విచారించడానికి దేశద్రోహం, పరువు నష్టం, చట్ట విరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం (ఉపా) వంటి చట్టాల దుర్వినియోగం, జర్నలిస్టులను ఏకపక్ష అరెస్టులు, హానికరమైన ప్రాసిక్యూషన్ నుంచి రక్షించడానికి ఒక చట్టం కోసం సంఘాలు పిలుపునిచ్చాయి.

ఇండిపెండెంట్ జర్నలిజానికి గణనీయమైన సవాళ్లు

మజీథియా అవార్డు అమలు కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు, ఇంటర్నెట్ షట్‌డౌన్‌ల దుర్వినియోగానికి ముగింపు పలకాలని కూడా సదరు లేఖ డిమాండ్ చేసింది. తమ డిమాండ్లను సీరియస్‌గా పరిగణిస్తారనీ, తక్షణమే వాటికి తగిన విధంగా స్పందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశాయి. స్వతంత్ర జర్నలిజం ప్రస్తుతం గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంటున్నదనీ, మద్దతు అవసరమని లేఖ నొక్కి చెప్పింది.



కొత్తపల్లిలో బొక్కల కంపెనీ నిరసన దీక్షకు మద్దతు తెలుపుతున్న ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ బృందం

కిసాన్ ఆగ్రో ఫీడ్స్ కంపెనీని మూసేయాలి

- ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.పార్థసారథి
- దీక్షకు మద్దతు తెలిపిన లాయర్స్ యూనియన్

నవతెలంగాణ-యాచారం

ప్రజల ప్రాణాలకు హాని కలిగించే విషపూరితమైన కిసాన్ ఆగ్రో ఫీడ్స్ కంపెనీని ప్రభుత్వం వెంటనే మూసేయాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.పార్థసారథి డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలోని కొత్తపల్లిలో బొక్కల కంపెనీకి వ్యతిరేకంగా గ్రామస్తులు చేస్తున్న నిరసన దీక్ష శనివారం పదో రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ బృందం మద్దతు తెలిపింది. అనంతరం బొక్కల కంపెనీ పరిసరాలను లాయర్స్ సందర్శించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ.. కోళ్లకు, చేపలకు వేసే ఫీడ్, డాల్డా, నూనె, టీ పౌడర్ ఇక్కడ ఉత్పత్తి అవుతున్నాయని చెప్పారు. దాని నుంచి వచ్చే విషపూరిత పదార్థాల వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. కంపెనీ చుట్టుముట్టు వచ్చే వాసన భరించలేక 45 నుంచి 60 ఏండ్ల వయస్సు వారు మూడేండ్లలో సుమారు 150 మంది చనిపోయారని తెలిపారు. ఇంతటి ప్రమాదకరమైన కంపెనీని పొల్యూషన్, ఎస్ఓటీ, పోలీస్ డిపార్ట్‌మెంట్ వారు పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. ఈ కంపెనీలో కుళ్లిపోయిన మాంసం, వ్యర్థ పదార్థాల నిల్వల వల్ల కొత్తపల్లి, తక్కలపల్లి, కిషన్ పల్లి, గ్రామాల్లో చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కంపెనీని ఎత్తివేసి, యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.వనజ, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు కె.అరుణ్‌కుమార్, హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి పి.గణేష్, జిల్లా

ఇలా అయితే దుప్పట్లు తెచ్చుకోవాలి

- స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు సుదీర్ఘ వివరణలతో కూడిన ప్రసంగాలు చేయటంతో అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి వారిపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం ప్రశ్నోత్తరాలు ప్రారంభం కాగానే 13 పద్దులపై చర్చించాల్సి ఉందనే విషయాన్ని స్పీకర్ ప్రస్తావించారు. ప్రశ్నోత్తరాల్లో 10 ప్రశ్నలున్నాయనీ, ఆ విషయాన్ని గమనంలో ఉంచుకుని సభ్యులు సూటిగా మాట్లాడాలని సూచించారు. అయినా సభ్యుల్లో ఒకరిద్దరు మినహా మిగిలిన వారు పదే పదే వివరణతో కూడిన ప్రశ్నలు వేస్తుండటంతో... ఇలా అయితే అందరూ దుప్పట్లు తెచ్చుకోవాలి. రాత్రి కూడా ఇక్కడే ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు. తక్కువ ప్రశ్నలకే ఎక్కువ సమయమైందంటూ ఐదు ప్రశ్నల తర్వాత అనుబంధ ప్రశ్నలకు అవకాశం లేదంటూ ఆయన తెలిపారు. ఒక్కో ప్రశ్నకు ఒక్కో సభ్యునికి మాత్రమే మాట్లాడేందుకు అనుమతించారు.

ప్రజా పంపిణీపై నియంత్రణలు

- ప్రయివేటుకు అప్పగించాలని 'నిటి ఆయోగ్' సిఫారసు
- అందువల్లే కొత్త బడ్జెట్‌లో నిధులు తగ్గింపు

న్యూఢిల్లీ : ఎన్నో కోట్ల కుటుంబాలకు ఆధారమైన 'ప్రజా పంపిణీ వ్యవస్థ' (పీడీఎస్)ను మోడీ సర్కార్ భారంగా భావిస్తోంది. కొత్త బడ్జెట్‌లో ఆహార సబ్సిడీలపై భారీ ఎత్తున కోతలు పెట్టింది. వ్యయ నియంత్రణలు, ఉచిత ఆహార పథకం పరిధిని కుదించటమే లక్ష్యంగా కేంద్రం అడుగులు వేస్తోంది. పీడీఎస్‌ను ప్రయివేటుకు అప్పగించాలని, పథకం పరిధిని వీలైనంతగా కుదించాలని 'నిటి ఆయోగ్' ఇచ్చిన నివేదికను అమలుజేయడానికి కేంద్రం సిద్ధమైంది. 'నిటి ఆయోగ్' కేంద్రానికి సమర్పించిన నివేదిక పత్రాల్ని సేకరించిన 'ద రిపోర్టర్స్ కలెక్టీవ్' సంచలన విషయాలు బయటపెట్టింది. ఆహార భద్రత కార్యక్రమాలకు, ప్రజా పంపిణీ వ్యవస్థ అమలుపై 'నిటి ఆయోగ్' వ్యతిరేకత వ్యక్తం చేసిందని ఈ పత్రాల్లో స్పష్టంగా ఉంది. ఆహార సబ్సిడీ పథకాలకు మంగళం పాడాలని కేంద్రానికి సూచించింది. ఈ నివేదికలోని అంశాల ఆధారంగా సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్ కూడా దాఖలు చేసింది. 2021 జనాభాకు అనుగుణంగా పీడీఎస్ పథకాన్ని విస్తరించాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అయినప్పటికీ కొత్త బడ్జెట్‌లో కేంద్రం ఆహార సబ్సిడీలో పెద్ద ఎత్తున నిధులకు కోతలు విధించింది. ఇదంతా కూడా నిటి ఆయోగ్ సూచనలు, సిఫారసుల ప్రకారం జరిగిందని ప్రభుత్వ పత్రాలు చెబుతున్నాయి. కొత్త బడ్జెట్‌లో కేంద్రం విడుదల చేసిన గణాంకాల ప్రకారం, ఆహార సబ్సిడీలో రూ.1,79,844 కోట్లమేర కోతలు విధించడానికి కేంద్రం ప్రణాళికలు సిద్ధం చేసిందని సమాచారం. ఆహార ధాన్యాల సేకరణ ప్రయివేటు, కార్పొరేట్ రంగాలకు అప్పగించాలని నిటి ఆయోగ్ సూచించింది. ప్రజా పంపిణీ పథకాల్లోనూ వాటి భాగస్వామ్యం తీసుకురావాలని కేంద్రానికి తెలిపింది. ఈమేరకు కేంద్రం తగిన కార్యచరణ చేపడుతోందని, 'నిటి ఆయోగ్' సూచనల మేరకు బడ్జెట్ గణాంకాలు వెలువడ్డాయని విశ్లేషకులు చెబుతున్నారు.

కూల్చడానికి నువ్వెవరివి?

- బండి సంజయ్ క్షమాపణలు చెప్పాలి
- టీఆర్ఎస్ ఎమ్మెల్యేల డిమాండ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టిన సచివాలయాన్ని కూల్చడానికి నీవు ఎవరివంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని టీఆర్ఎస్ వర్ధన్నపేట్ ఎమ్మెల్యే ఆరురి రమేష్ ప్రశ్నించారు. దమ్ముంటే పార్లమెంట్‌కు అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవికుమార్, ఎమ్మెల్యే చిన్నయ్యతో కలిసి రమేష్ మాట్లాడారు. "మీరు దేశంలో మతకల్లోలాలు సృష్టించి, అమాయకులను ఇబ్బందులకు గురిచేసినా మేము ఏమనడం లేదని రెచ్చిపోతున్నావా.. ఖబడ్దార్ సంజయ్" అంటూ హెచ్చరించారు. బీజేపీ అధికారంలోకి వస్తే కొత్త సచివాలయంపై అమర్చిన గుమ్మటాలను కూల్చేస్తామని బండి సంజయ్ మాట్లాడటం దారుణంగా ఉందన్నారు. ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి తలమానికంగా ఉన్న సెక్రటేరియట్‌ను బద్దలు కొడతాం అనడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సైతం ప్రగతి భవన్‌ను బద్దలు కొడతామంటున్నారని, సంజయ్ సచివాలయాన్ని కూల్చేస్తామంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరూ పిచ్చోళ్లుగా, సైకోల్లాగా మాట్లాడుతున్నారని, పోరాడి సాధించుకున్న తెలంగాణను ఏం చేయాలని అనుకుంటున్నారని ప్రశ్నించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ రాష్ట్రానికి రూపాయి సహాయం చేయకపోయినా ప్రత్యేక నిధులు సమీకరించి కేసీఆర్ రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోతున్నారని తెలిపారు.

బండి సంజయ్ ముక్కు నేలకు రాయాలి
చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవికుమార్

బీజేపీ అధ్యక్షులు బండి సంజయ్ చెంపలేసుకుని, ముక్కు నేలకు రాస్తే తప్ప ఊరుకునే ప్రసక్తే లేదని చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవికుమార్ హెచ్చరించారు. సెక్రటేరియట్ ప్రభుత్వ ప్రజల ఆస్తి అన్నారు. ప్రజలు బండి సంజయ్‌కి బుద్ధి చెప్పాలన్నారు. ఎవరు అధికారంలో ఉన్నా ప్రగతిభవన్‌లో ఉంటారన్నారు. దేశంలో ఎక్కడా కాంగ్రెస్ పార్టీ అడ్రస్ లేదని, రాష్ట్రంలో సైతం కనుమరుగవుతుందన్నారు. ఆ ఫ్రెస్టేషన్‌లో రేవంత్ మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డిని, బండి సంజయ్‌ని ఎర్రగడ్డ ఆస్పత్రిలో చేర్పించాలన్నారు. మీ మాటలను వెనక్కి తీసుకొని తెలంగాణ ప్రజానీకానికి తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

త్వరలో లాల్ దర్వాజ ఆలయ విస్తరణ పనులు

- మంత్రి తలసాని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

త్వరలో హైదరాబాద్ పాతనగరంలోని లాల్ దర్వాజ అమ్మవారి ఆలయ విస్తరణ పనులు ప్రారంభించనున్నట్టు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శనివారం అసెంబ్లీ సమావేశ మందిరంలో ఆయన ఎంఐఎం శాసనసభా పక్షనేత అక్బరుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యే బలాలతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆలయ విస్తరణకు కోసం అవసరమైన 1,10 గజాల స్థలాన్ని గుర్తించామనీ, భూమి అప్పగిస్తున్న వారికి పరిహారంగా రూ.8.95 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. పేదల కోసం ఫంక్షన్ హాళ్ల నిర్మాణానికి రూ.19 కోట్లను మంజూరు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, దేవాదాయ శాఖ కమిషనర్ అనీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామగుండం మెడికల్ కాలేజీలో అడ్మిషన్లలో సింగరేణి పిల్లలకు రిజర్వేషన్లు

- మంత్రి హరీశ్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రామగుండం మెడికల్ కాలేజీకి సంబంధించిన అడ్మిషన్లలో సింగరేణి కార్మికుల పిల్లలకు రిజర్వేషన్లు కల్పిస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు ప్రకటించారు.శనివారం శాసనసభలో ఆయన మాట్లాడుతూ ఆ ఆస్పత్రికి సింగరేణి పేరు పెడతామని.. సింగరేణి కార్మికులకు ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆ సంస్థ సౌజన్యంతో రామగుండంలో మెడికల్ కాలేజీ నిర్మిస్తున్న నేపథ్యంలో సింగరేణి కార్మికులకు ప్రత్యేక వార్డులు పెట్టాలనీ, ఆ కార్మికుల పిల్లలకు ఎంబీబీఎస్ అడ్మిషన్లలో రిజర్వేషన్లు ఇవ్వాలని ఆదేశించారు.

ఫిబ్రవరి 20న మత్స్య సొసైటీ అధ్యక్షుల రాష్ట్ర సదస్సు

- వాల్ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ- సిటీ బ్యూరో

రాష్ట్రంలో జిల్లా, రాష్ట్ర మత్స్య సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని, ఈ బడ్జెట్‌లో ప్రతి మత్స్య సొసైటీకి 10 లక్షల ఆర్థిక సాయం అందించే విధంగా నిధులు కేటాయించాలని మత్స్యకారుల సంఘం జాతీయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై ఈనెల 20న జరిగే మత్స్య సొసైటీ అధ్యక్షుల రాష్ట్ర సదస్సులో తీర్మానం చేయబోతున్నట్టు తెలిపారు. శనివారం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. అనంతరం జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో బాలకృష్ణ మాట్లాడుతూ అఖిలభారత మత్స్యకారులు,మత్స్య కార్మిక సమాఖ్య జాతీయ కార్యవర్గ సమావేశాలు ఈ నెల 20,21లలో జరుగుతున్న సందర్భంగా మొదటి రోజు రాష్ట్ర సదస్సు నిర్వహించబోతున్నట్టు తెలిపారు. కేరళ మత్స్య ఫెడరేషన్ చైర్మెన్ వి.మనోహరన్, అఖిలభారత మత్స్యకారులు మత్స్య కార్మిక సమాఖ్య జాతీయ అధ్యక్ష కార్యదర్శులు దేబ్ శిషిబర్మన్, పీ.స్టాన్లీ, జాతీయ మత్స్యకార నాయకులు పాల్గొనబోతున్నారని తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఇన్సూరెన్స్ ఎక్స్ గ్రేషియోలకు ఈ బడ్జెట్లో నిధులు కేటాయించలేదని, ఎన్సీడీసీ సమీకృత మత్స్య అభివృద్ధి పథకం అమలుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం దుర్మార్గం అన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ముఠా విజయ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు కొప్పు పద్మ కరెల్లి లలిత, అర్వపల్లి శ్రీరాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు ముఠా దశరథ్, మామిళ్ల జగదీష్ పాల్గొన్నారు.

కార్మిక, కర్షకులపై మోడీ ప్రభుత్వం దాడి

- ఏప్రిల్ 5న చలో ఢిల్లీ
- కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న కేంద్ర సర్కారు
- వ్యవసాయ పరిరక్షణకు ఉద్యమాలు
- కార్మిక- కర్షక సదస్సులో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. దీనిని నిరసిస్తూ ఏప్రిల్ 5 చలో పార్లమెంట్ కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఖమ్మంలోని మంచికంటి మీటింగ్ హాల్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు తుమ్మా విష్ణువర్ధన్ అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన 'కార్మిక- కర్షక సదస్సులో సుదర్శన్ ప్రసంగించారు.

జీ20 దేశాల కూటమి సమావేశానికి అధ్యక్షత వహించే అవకాశం భారతదేశానికి లభించడం గర్వకారణమని మోడీ చేస్తున్న వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. ఆకలి సూచీలో దేశం ప్రపంచంలోనే 107 స్థానంలో ఉన్నందుకు గర్వపడాలా? అని ప్రశ్నించారు. దేశంలో 23 కోట్ల మంది పేదరికంలో అల్లాడుతున్నారని కేంద్రం లెక్కలే చెబుతున్నాయి.. ఇందుకు గర్వపడాలా? అని ప్రశ్నించారు. కార్పొరేట్ సంస్థల ఆధిపత్యంతో భారతదేశంలో ప్రతి అరగంటకు ఓ రైతు చొప్పున ఆత్మహత్య చేసుకుంటున్నారని తెలిపారు. బడ్జెట్ కేటాయింపుల్లో ఉపాధిహామీ, వ్యవసాయ రంగాలకు ఏటేటా ప్రభుత్వం కేటాయింపులు తగ్గిస్తోందన్నారు. కార్మిక హక్కులనూ కాలరాస్తోందన్నారు. కార్మిక హక్కుల స్థానంలో నాలుగు కోడ్‌లను తీసుకొచ్చారని, వాస్తవానికి అవి కార్మిక కోడ్‌లు కాదు.. కంపెనీ కోడ్‌లని చెప్పారు. వీటన్నింటిపై సీఐటీయూ, రైతుసంఘం, వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చామన్నారు. దీనికి ఇప్పటి నుంచే సమాయత్తం కావాలన్నారు. ఢిల్లీలో ఆందోళన నిర్వహించేందుకు కారణమైన పరిస్థితులను ప్రజలకు వివరించాలన్నారు. వ్యవసాయరంగం, ఉపాధిహామీ, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలకు ఇచ్చే కేటాయింపుల్లో కోతలు విధిస్తున్న కేంద్రం.. కార్పొరేట్లకు మాత్రం రూ.19.50 లక్షల కోట్లు రాయితీ ఇస్తోందన్నారు. రైతుసంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా కార్మిక- కర్షకులను ఐక్యం చేయాలన్నారు. డబుల్ ఇంజిన్ బుల్డోజర్ బయలుదేరింది.. అన్నింటినీ ధ్వంసం చేస్తోంది.. మనకెందుకులే అనుకుంటే మొత్తం దేశాన్నే ధ్వంసం చేస్తుందని చెప్పారు. ఇప్పటికే దేశం రూ.1.37 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందన్నారు.

14 మంది ప్రధానులు రూ.50వేల కోట్ల అప్పులు చేస్తే.. ఒక్క మోడీ సర్కారే ఈ ఎనిమిదేండ్లలో రూ.87వేల కోట్ల అప్పులు చేసిందని తెలిపారు. అదానీపై వచ్చిన ఆరోపణలను దేశంపై దాడిగా బీజేపీ చిత్రీకరించడం.. కార్పొరేట్ల పట్ల ఆ పార్టీకున్న ప్రేమకు నిదర్శనమన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి కొనుగోలు చేసేందుకు నెలకొల్పిన సీసీఐ, మార్క్‌ఫెడ్ వంటి కార్పొరేషన్‌లను సైతం ఎత్తివేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు.

సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘం, రైతుసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మెరుగు సత్యనారాయణ, పొన్నం వెంకటేశ్వరరావు, మాదినేని రమేష్, బంతు రాంబాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వర్లు తదితరులు ప్రసంగించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు యర్రా శ్రీకాంత్, నాయకులు యర్రా శ్రీను, పిన్నింటి రమ్య, గద్దల రత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనుల్లో కేసీఆర్ కుటుంబం దోపిడీ



- 8 ఏండ్లుగా ఎండీ శ్రీధర్ డిప్యూటేషన్.. చట్ట విరుద్ధం
- తాము అధికారంలోకి రాగానే పూర్తి స్థాయి విచారణ
- ఇల్లందు జీకే ఓసీ ఫిట్ మీటింగ్‌లో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి

నవతెలంగాణ-ఇల్లందు

బొగ్గు గనుల్లో కేసీఆర్ కుటుంబం దోపిడీకి పాల్పడిందని, సింగరేణి ఎండీగా 8 ఏండ్లుగా శ్రీధర్ డిప్యూటేషన్‌పై కొనసాగడం చట్ట విరుద్ధమని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి అన్నారు. ఓసీలు రద్దు చేస్తానని, భూగర్భ గనులు తీసి యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని తెలంగాణ ఉద్యమ సమయంలో పలు సభల్లో కేసీఆర్ చెప్పారని గుర్తు చేశారు. కానీ, అధికారంలోకి రాగానే భూగర్భ గనులను మూసేసి ఓసీలు తెరుస్తూ ప్రయివేటుకు అప్పజెప్పారని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులోని జేకే ఓసీ వద్ద శనివారం ఫిట్ మీటింగ్‌లో రేవంత్ మాట్లాడారు. తొలుత ఐఎన్‌టీయూసీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బొగ్గు గనుల సంఘానికి గౌరవ అధ్యక్షులుగా ఉంటూ కేసీఆర్ కుటుంబం 30 వేల కోట్ల దోపిడీకి పాల్పడిందని ఆరోపించారు. 70వేల మంది ఉన్న కార్మికుల సంఖ్య.. నేడు ప్రయివేటీకరణ, భూగర్భ గనుల మూత మూలంగా 40 వేలకు దిగజారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఓసీలను ప్రయివేటుపరం చేస్తోందని, అరబిందో సంస్థకు అప్పగించిందని అన్నారు. రూ.12వేల కోట్లు జెన్‌కోకు బకాయి పడ్డారని, దీంతో కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి వచ్చిందన్నారు. ఓసీలతో కార్మికులు ఉద్యోగాలు కోల్పోతున్నారు, పర్యావరణం ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయన్నారు. అల వెన్నులు లేవు, లేని నిల్వలు చూపించి యాజమాన్యం అప్పులు చేస్తోందని చెప్పారు. సింగరేణి ఎండిగా శ్రీధర్ డిప్యూటేషన్ చట్టవిరుద్ధమన్నారు. కేసీఆర్ చెప్పినట్టు చేస్తూ.. కండ్లు మూసుకుని సంతకాలు పెడుతూ దోచిపెడుతున్నారని ఆరోపించారు. వీటన్నింటిపై కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే క్రిమినల్ కేసులు పెడతామన్నారు. మరో పది నెలల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం అధికారంలోకి వస్తుందని, అప్పుడు పూర్తి స్థాయిలో విచారణ చేస్తామన్నారు. భూగర్భ గనులు తెరిచి కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. కార్మికులను బదిలీలు చేయొద్దని, కొత్తగా ఓపెన్ చేసే పూసపల్లిలో విలీనం చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలిచి పార్టీ మారిన ఎమ్మెల్యేలు మళ్లీ ఓటు అడగడానికి వస్తే బొగ్గు గనుల్లో బొంద పెట్టాలని చెప్పారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నేత జనక్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నేతలు దళ్ సింగ్, డాక్టర్, రామచంద్రనాయక్, పట్టణ మండల అధ్యక్షులు డానియల్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి 'హాత్ సే హాత్ జోడో' యాత్ర శనివారం ఇల్లందు మండలం రాజీవ్ నగర్ తండా నుంచి పట్టణంలోని జగదాంబసెంటర్ వరకు నాలుగు కిలోమీటర్లు సాగింది. ఉదయం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. అనంతరం సింగరేణి కార్మికులతో కలిసి ఫిట్ మీటింగ్‌లో మాట్లాడారు. సాయంత్రం ఆరు గంటలకు జగదాంబసెంటర్‌లో బహిరంగ సభలో రేవంత్ ప్రసంగించారు.

పొలాలు ఎండుతున్నా కనికరించరా..

- విద్యుత్ కోతలపై రైతుల ఆందోళన



నవతెలంగాణ- విలేకరులు

కరెంటు లేక.. నీరందక వరి పొలాలు ఎండిపోతున్నా అధికారులు కనికరించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతలపై శనివారం కూడా సిద్ధిపేట, జగిత్యాల జిల్లాల్లో ఆందోళన చేశారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ధర్నా నిర్వహించారు. వారం రోజులుగా విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడంతో తమ పొలాలు ఎండిపోతున్నాయని పలు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా, విద్యుత్ అధికారుల పనితీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల కరెంటు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నా, క్షేత్రస్థాయిలో ఏడు గంటలకన్నా ఎక్కువ రావడం లేదన్నారు. అది కూడా ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియడం లేదన్నారు. కరెంటు సమస్య ఇలాగే కొనసాగితే పంటలు పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని, వెంటనే కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం జగ్గసాగర్‌లో రైతులు సబ్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. వారికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రైతులకు కనీసం 6 నుంచి 7 గంటలు కూడా సరిగా విద్యుత్ రావడం లేదన్నారు.

వ్యవసాయానికి 24 గంటలు నాణ్యమైన విద్యుత్ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి మండలం కిసాన్ సెల్ కాంగ్రెస్ అధ్యక్షులు పిడుగు తిరుపతిరెడ్డి, నాయకులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, ఇల్లెందుల రాజు, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్...

- నూతన సచివాలయ ప్రారంభోత్సవం వాయిదా



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర నూతన సచివాలయ ప్రారంభోత్సవం వాయిదాపడింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ప్రభుత్వం సెక్రటేరియట్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వాయిదా వేసింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక, హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ మూడు రోజుల క్రితమే వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈనెల 17న నిర్ణయించిన సచివాలయ ప్రారంభోత్సవం గురించి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ. శాంతికుమారి కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ)తో సంప్రదింపులు చేశారు. మొత్తం పరిస్థితిని వివరిస్తూ అర్జెంట్ మేసేజ్ ఫార్ములాలో సీఈసీకి లేఖ పంపారు. అలాగే స్వయంగా ఫోన్లోను మంతనాలు చేసినట్టు తెలిసింది. సచివాలయం ప్రారంభోత్సవం తేదీ ఎప్పుడు నిర్ణయమైందీ, పూర్వాపరాలను వివరిస్తూ ప్రారంభోత్సవానికి అనుమతి ఇవ్వాలని లేఖ రాసినట్టు సమాచారం. అయినా వారినుంచి వచ్చిన ప్రతిస్పందన ఆశాజనకంగా లేకపోవడంతో సచివాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ప్రారంభోత్సవ తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలియజేసింది. ఈమేరకు ముఖ్యమంత్రి సీపీఆర్వో కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

మరో నెల సమయం..

కొత్త సచివాలయం ప్రారంభోత్సవం నేపథ్యంలో రాష్ట్రమంతా చర్చ జరుగుతున్న విషయం విదితమే. నాలుగు రోజులక్రితం కొత్త సచివాలయంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న సంగతీ తెలిసిందే. అయితే ఈ ప్రమాదానికి కారణం తెలియరాలేదు. షార్ట్‌సర్క్యూట్ అంటూ లీకులు ఇవ్వడం, మీడియాలో రావడం మినహా సంబంధిత మంత్రి లేదా రోడ్లు, భవనాల శాఖ ఉన్నతాధికారులు గానీ ఎలాంటి ప్రకటనా చేయలేదు. దాదాపు 11 ఫైరింజన్లు మంటలను ఆర్పేశాయి. ఒకటో అంతస్థులో జరిగిన షార్ట్ సర్క్యూట్‌తో ప్లాస్టిక్ వస్తువులకు అంటుకుని భవనమంతా మంటలు రేగాయనీ, దీంతో బిల్డింగ్ మొత్తం పొగసూరిందనే ప్రచారం జోరుగా సాగింది. ఒకానొక సందర్భంలో మాక్‌డ్రిల్ అంటూ రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అసెంబ్లీ లాబీల్లో మీడియాతో అన్నట్టుగా కూడా ప్రచారం జరిగింది. నూతన సచివాలయ భవన నిర్మాణంలో అన్ని విషయాలూ తానై చూసుకుంటున్న సీఎం కేసీఆర్‌గానీ, ఆయన మంత్రివర్గంలోని కీలకమైన సహచరులు గానీ ఎక్కడా మాట్లాడకపోవడం గమనార్హం. మీడియాను లోపలికి అనుమతించలేదు. పోలీస్ గస్తీ పెంచారు. లోపల జరిగిన అగ్ని ప్రమాదం గురించి సమాజానికి ఎక్కువ విషయాలు తెలియకుండా ప్రభుత్వం జాగ్రత్త పడింది. షార్ట్‌సర్క్యూట్‌తో భవనం లోపలిభాగంలో పొగసూరిందంటూ పెయింట్ వేసి కవర్ చేశారు. అయితే అగ్ని ప్రమాదం కారణంతో భవనంలోని కీలకమైన అంతస్థులో ఒకవైపు భాగాన్ని పూర్తితొలగించాల్సి వచ్చిందనే ప్రచారమూ ఉంది. అయితే ప్రచారాన్ని రోడ్లు, భవనాలశాఖ అధికారులు, నిర్మాణ సంస్థ కూడా ఖండిస్తున్నాయి. అసలు విషయాన్ని మాత్రం బయటపెట్టడం లేదు. ఈ నెల 17న జరిగే ప్రారంభోత్సవానికి సిద్ధం చేసే పనిలో అటు రోడ్లు ,భవనాల శాఖ , ఇటు వర్కింగ్ ఏజెన్సీ షాపూర్జీ పల్లోంజీ సంస్థా ఉన్నట్టు తెలిసింది. ఈలోపు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కావడం, అలాగే ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించడం రెండూ సమాంతరంగా జరిగాయి. దీంతో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వాయిదా వేయకతప్పలేదనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. అగ్ని ప్రమాదాన్ని మీడియా కంటపడకుండా సర్కారు అడ్డుకోవడంపై ఒకింత అసహనం వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. ఎన్నికల నోటిఫికేషన్ మూలంగా దాదాపు మరో నెల సమయం రోడ్లు, భవనాల శాఖకు చిక్కినట్టయింది. సచివాలయం పనులు దాదాపు పూర్తయ్యాయనీ అంటున్నా, ఒకటి, రెండు, మూడు అంతస్తుల్లో పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని తెలిసింది. దాదాపు 95 శాతానికి పైగా పనులు ఇప్పటికే పూర్తిచేశామని చెబుతున్నా, అంతర్గతంగా చేయాల్సిన కీలకమైన పనులు మాత్రం ఇంకా పెండింగ్‌లోనే ఉన్నట్టు సమాచారం. కాగా ఇప్పుడు ప్రారంభోత్సవం వాయిదా పడిన నేపథ్యంలో సాధ్యమైనంత వేగంగా పనులను పూర్తిచేసేందుకు వర్కింగ్ ఏజెన్సీ ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. అలాగే ఈ భవనాన్ని పూర్తిచేసే వరకు మరే ఇతర కాంట్రాక్టు పనులు షాపూర్జీ-పల్లోంజీ సంస్థకు ఇచ్చేది లేదని ప్రభుత్వం స్పష్టం చేసినట్టు ఆర్అండ్‌బీలో చర్చ జరుగుతున్నది.

పోరాటాల ఫలితమే కార్మికుల వేతనాల పెంపు

- మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమ



నవతెలంగాణ-కంఠేశ్వర్

మధ్యాహ్న భోజన కార్మికులు తమ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు వేతనాలు పెంచుతూ జీవో జారీ చేసిందని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రమ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్న భోజన కార్మికుల విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 54,201 మంది మధ్యాహ్న భోజన కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కార్మికులను ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదన్నారు. కార్మికులు అనేక కష్టనష్టాల కోర్చి మధ్యాహ్న భోజనం వండి పెడుతున్నారని చెప్పారు. యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల సంక్షేమ కోసం అనేక పోరాటాలు చేపట్టడంతో రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చి రూ. 2000 వేతనం పెంచుతూ జీవో జారీ చేసిందని తెలిపారు. ఇదంతా కార్మికుల ఘన విజయమన్నారు. పెంచిన వేతనం గతేడాది అసెంబ్లీలో ప్రకటించిన నాటి నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కోసం ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. వేతనాలు పెంచినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ కార్మికులు స్వీట్లు పంచుకొని అభినందన సభ నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తోపునూరు చక్రపాణి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శంకర్‌గౌడ్, నూర్జహాన్, మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు సాయమ్మ, నాగలక్ష్మి, వివిధ మండలాల నుంచి కార్మికులు పాల్గొన్నారు.

పండిట్, పీఈటీల ప్రమోషన్లపై ప్రభుత్వం చొరవ చూపాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



నవతెలంగాణ-నల్లగొండ

పండిట్, పీఈటీల ప్రమోషన్ల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ భవనంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులు ప్రమోషన్లు పొందుతుంటే పండిట్‌లు, పీఈటీలు ప్రమోషన్లు లేక ఆవేదన చెందుతున్నారన్నారు. రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల్లో జరగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్ యూటీఎఫ్ బలపర్చిన అభ్యర్థి మాణిక్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. తద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఎక్కువ మంది ఎమ్మెల్సీలు ఉంటారని, ఉపాధ్యాయ సమస్యల సాధనకై జరిగే పోరాటంలో వీరు ముందు ఉంటారని తెలిపారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్ రెడ్డి, జి.నాగమణి, నల్లగొండ జిల్లా అధ్యక్షులు ఎడ్ల సైదులు, ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, ఉపాధ్యక్షులు బక్క శ్రీనివాసాచారి, అరుణ, కోశాధికారి నర్రా శేఖర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు రాంబాబు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

చట్ట సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

- ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలపడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హర్షవర్ధన్‌రెడ్డి, గువ్వల బాలరాజ్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా ఆరు గ్రామ పంచాయతీల ఏర్పాటుకు పంచాయతీరాజ్ చట్టంలో సవరణలను ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో కొల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని బోయలపల్లి, తాళ్లనర్సింహపల్లి రెండు గ్రామాలను గ్రామపంచాయతీలుగానే కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శనివారం సచివాలయం మీడియా పాయింట్ వద్ద వారు మాట్లాడారు. 2011లో ఉన్న విధంగానే ప్రజల అభీష్టం మేరకు గ్రామపంచాయతీలుగా కొనసాగిస్తూ నిర్ణయం తీసుకోవడం సంతోషకరమన్నారు. కొత్తగా ఏర్పాటు అయిన మున్సిపాలిటీల పరిధిలో సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అచ్చంపేట మున్సిపాలిటీ నుంచి ఏనిమిది గ్రామాలను వేరు చేసి ప్రజల అభీష్టం మేరకు గ్రామ పంచాయతీలుగానే కొనసాగిస్తూ చట్టం చేయడం శుభపరిణామమన్నారు.

అద్భుతమైన ప్రాజెక్టును ప్రతిపక్షాలు చూడొద్దా?

- సీఎల్పీనేత భట్టి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'కాళేశ్వరం అద్భుతమైన ప్రాజెక్టు అంటున్నారు.. అలాంటప్పుడు ప్రతిపక్షాలు చూడ్డానికి ఎందుకు వెళ్లనీయటం లేదు'అని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క శనివారం అసెంబ్లీలో పద్దులపై చర్చ సందర్భంగా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే రాష్ట్రం వచ్చిందన్న ఆయన.. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారు.. రూ.18 లక్షల ఎకరాల ఆయకట్టు అన్నారు.. కానీ కాల్వల నిర్మాణం మాత్రం జరగలేదని విమర్శించారు. అన్నారం, సుందిళ్ల వద్ద వరద నీటితో పంటపొలాలు నీట మునుగుతున్నాయని గుర్తుచేశారు. ఆయా రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రాణహిత ప్రాజెక్టు కూడా పూర్తి చేయాలని కోరారు. దేవాదుల ప్రాజెక్టు ఎందుకు కట్టడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలోనే అనేక ప్రాజెక్టులు కట్టామని చెప్పారు. రంగారెడ్డి పాలమూరు ఆగిపోయిందని అన్నారు. ఆ ప్రాజెక్టును ఎప్పటిలోగా పూర్తి చేస్తారో చెప్పాలన్నారు. దీనికి జాతీయ ప్రాజెక్టు హోదా సాధించాలన్నారు. సమస్యలను సభ దృష్టికి తీసుకొస్తుంటే.. మైక్ కట్ చేస్తున్నారనీ, ఇది కట్టేసి కొట్టినట్టు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తన మైకు కట్ చేసి మంత్రికి మాట్లాడేందుకు ఇచ్చారని భట్టి తెలిపారు. హోంశాఖలో పదోన్నతుల సమస్య ఉన్నదని తక్షణ పరిష్కారం చేయాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. హోంగార్డులు కొన్నేండ్లుగా పనిచేస్తున్నారనీ, వారిని పర్మినెంట్ చేయాల్సిన అవసరముందన్నారు. శాంతి భద్రతల సమస్యను మరింత సమర్థవంతంగా కాపాడాలన్నారు. కానిస్టేబుల్ నియామకాల నిబంధనలు కూడా గందరగోళంగా ఉన్నాయన్నా రు. ఆస్పత్రుల పనితీరుపై మరింత విజిలెన్స్ అవసరముందని చెప్పారు. గాంధీలో కాలం చెల్లిన మందులు ఇస్తున్నట్టు వార్తలొస్తున్నాయని గుర్తుచేశారు. ప్రయివేట్ ఆస్పత్రుల్లో బిల్లులపై మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలో క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతున్నదనీ, వారి కోసం ఒక ప్రత్యేక ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

సుప్రజ హాస్పిటల్ ఉచిత మెగా హెల్త్ క్యాంప్

300 మంది ఉద్యోగులకు హెల్త్ చెకప్

నవతెలంగాణ-సిటీబ్యూరో

నాగోల్‌లోని సుప్రజ హాస్పిటల్ యూనిటీ ఆఫ్ దంతూరి తరఫున డీజీ లోన్స్ స్టార్ట్ పవర్ టెక్నాలజీ ప్రవేట్ లిమిటెడ్ కంపెనీలో ఫ్రీ మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఇందులో దాదాపు 300 మంది ఉద్యోగులకు హెల్త్ చెకప్ చేశారు. బీపీ, షుగర్, ఈసీజీ మొదలగు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టార్ పవర్ టెక్నాలజీ కంపెనీ లిమిటెడ్ చైర్మెన్ బి.రామకృష్ణ, సీఈఓ వెంకటేశ్వర్‌రావు, హెచ్‌ఆర్ ముజాఫర్స్ ముజాఫర్ ఇన్సూరెన్స్ హెడ్ అబూబకర్ షేక్, సుప్రజా హాస్పిటల్ ఎండి సిగ విజయ్‌కుమార్, కార్పొరేట్ జనరల్ మేనేజర్ సిగ అజయ్‌కుమార్‌గౌడ్, ఎంజిఎం ఆపరేషన్స్ మహమూద్ అహ్మద్ డాక్టర్ గౌతమ్, డాక్టర్ సుష్మ, డాక్టర్ అలేఖ్య వినయ్‌కుమార్, క్యాంప్ కోఆర్డినేటర్ మరియు సిస్టర్స్ పాల్గొన్నారు.

హమారా ప్రసాద్ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-హయత్‌నగర్



డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాముని కృష్ణుని రహస్యాలు బుక్కును రాసినప్పుడు నేనుంటే అంబేద్కర్‌ని చంపేసేవాన్ని అని అనేక రకాల బూతులు తిడుతూ దేశంలో ఉన్న 20 కోట్ల మంది దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసి మాట్లాడిన మనువాది హమారా ప్రసాద్ పై పీ డీ ఆక్ట్ నమోదు చేయాలని శనివారం హయత్ నగర్‌లోని విజయవాడ రహదారిపై అతని విగ్రహాన్ని దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు బర్రె రాజ్‌కుమార్, దళిత ఆత్మగౌరవ పోరాట సమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు,అంబేద్కర్ సంఘం నాయకులు జనిగే రమేష్,సుక్క వెంకటేష్, తోట్ల బుజ్జి, డానియల్, ఆదామ్, సుబ్బారావు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

త్వరలో లాల్ దర్వాజ అమ్మవారి ఆలయ విస్తరణ పనులు

- 10 రోజుల్లో శంకుస్థాపనకు చర్యలు
- సంబంధిత అధికారులను ఆదేశించిన
- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-సిటీబ్యూరో



ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ఓల్డ్ సిటీలోని లాల్ దర్వాజ అమ్మవారి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్టు రాష్ట్ర పశుసంవర్ధక మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. శనివారం అసెంబ్లీలోని సమావేశ మందిరంలో ఎంఐఎం ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యే బలాలతో కలిసి పలు అభివృద్ధి పనులపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సీఎం కేసీఆర్ అమ్మవారి దర్శనం కోసం వచ్చిన సందర్భంగా ఆలయం అభివృద్ధి, విస్తరణ చేపడతామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ హామీ మేరకు ఆలయ విస్తరణకు అవసరమైన 1100 గజాల స్థలాన్ని గుర్తించామని మంత్రి చెప్పారు. భూ యజమానులూ స్థలం అప్పగించేందుకు సానుకూలంగా ఉన్నారని వివరించారు. ఆలయ అభివృద్ధి కోసం భూమి అప్పగిస్తున్న వారికి పరిహారంగా ప్రభుత్వం రూ.8.95 కోట్లను మంజూరు చేసిందని మంత్రి పేర్కొన్నారు. పేద ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కంచన్‌బాగ్, ఉప్పుగూడ, జంగంమెట్‌లలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్స్ నిర్మిస్తున్నామని వివరించారు. వివాహ, ఇతర శుభకార్యాలు జరుపుకునేందుకుగాను ఈ ఫంక్షన్ హాళ్ల కోసం రూ.19 కోట్లను మంజూరు చేశారని తెలిపారు. ఉప్పుగూడ హాల్‌కు టెండర్ ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన రెండు హాల్స్‌కూ త్వరితగతిన టెండర్ ప్రక్రియ పూర్తిచేయాలని అధికారులను మంత్రి తలసాని ఆదేశించారు. అలాగే అమ్మవారి ఆలయ విస్తరణ అభివృద్ధికి సంబంధించి 10 రోజులలో భూమి పూజ చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, కలెక్టర్ అమోయ్ కుమార్, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్స్ సీఈ జియా ఉద్దీన్, జోనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సీపీఐ(ఎం) పాదయాత్ర

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్

నవతెలంగాణ-సంతోష్‌నగర్ / ధూల్‌పేట్



సీపీఐ(ఎం) జంగంమెట్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో డివిజన్‌లోని శివగంగానగర్, రాజనాబౌలి, లక్ష్మీ నగర్, శివాజీ నగర్ తదితర బస్తీలలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ పర్యటించారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ రాజన్నబౌలి నాలా వల్ల చాలామంది ప్రజలు ఆ దుర్వాసన వల్ల ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలా పనులు సగం రోడ్డు వరకు చేసి మధ్యలో వదిలేసిన పరిస్థితి ఉందని, దీనివల్ల వర్షాకాలం వస్తే ఆ ప్రాంతంలో ఉన్న కానీలలో ఇండ్లలో మురుగునీరు, వర్షపు నీరు మోకాళ్ళ ఎత్తున వచ్చి ప్రజలు నానా తంటాలు పడుతూ అనారోగ్యాల బారినపడుతున్న పరిస్థితి ఉందన్నారు. జీహెచ్‌ఎంసి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, ఎమ్మెల్యే, ఎంపీ చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. ప్రజల సౌకర్యార్థం వెంటనే నాలా పూర్తిగా నిర్మించి, దానిపై రోడ్డు వేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నాలా ప్రభావ ప్రాంతంలో ఉన్న ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. వెంటనే పనులు ప్రారంభం అయ్యేటట్టు చూడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు కృష్ణ, కిషన్, రామ్ కుమార్, శీను, నవీన్, నరేందర్, శివమణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పిస్తాం

- దేశంలోనే అత్యధిక ఐటీ ఉద్యోగాలు హైదరాబాదులోనే
- త్వరలో నందనవనంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ప్రారంభం : మంత్రి శ్రీనివాస్ గౌడ్

నవ తెలంగాణ-సరూర్‌నగర్



నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారము సరూర్‌నగర్ స్టేడియంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తేనే నగరంలో జీవించడానికి అవకాశాలు ఉంటుందన్నారు. పదో తరగతి నుండి పీజీ వరకు చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగ అవకాశం కల్పిస్తామని అన్నారు. చదువుకు చేసే ఉద్యోగానికి సంబంధం లేకుండా చాలామంది పనిచేస్తున్నారని, వారందరికీ వృత్తి శిక్షణ నైపుణ్యాన్ని ఇచ్చి వారికి ఉపాధి కల్పిస్తామన్నారు. లక్ష్యం, నిజాయితీ ఉంటే అవకాశాలు వాటి అంతట అవే వస్తాయన్నారు. యాజమాన్యం ఇచ్చిన పనికంటే ఎక్కువ సమయం పనిచేసి సంస్థ అభివృద్ధికి సహకరిస్తే ఉన్నత పదవులు అధిరోహించవచ్చు అన్నారు. భవిష్యత్తులో మూగ, చెవిటి, అంధ, వికలాంగులకు ప్రత్యేక జాబ్ మేళాను నిర్వహిస్తామని అన్నారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఎల్బీనగర్ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులకు 108 కంపెనీలను తీసుకువచ్చి స్పాట్లోనే ఆఫర్ లెటర్ ఇచ్చే విధంగా చర్యలు చేపట్టామని అన్నారు. జాబ్ మేళాకు ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు దాదాపు 50 వేల వరకు కాల్స్ వచ్చాయని, వారందరి వివరాలు నమోదు చేసుకున్నామని తెలిపారు. 13వేల ఉద్యోగాలకు 30వేల మంది ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. తెలంగాణలో నిర్వహించిన 16 జాబు మేళాలో ఎల్బీనగర్‌లోనే అత్యధిక మంది నిరుద్యోగ యువత యువకులు హాజరయ్యారని తెలిపారు. చాలామందికి అపాయింట్మెంట్ లెటర్స్‌ను అందజేశామని, అత్యధిక జీతం 40వేలు, ఈ జాబ్ మేళాలో అమ్మాయిలే అత్యధిక అవకాశాలను అందిపుచ్చుకున్నారన్నారు అని అన్నారు. త్వరలో అపాయింట్మెంట్ తీసుకున్న వారందరితో, వారి కుటుంబ సభ్యులతో కలిసి విందు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు ఎగ్గే.మల్లేశం, దయనంద్ గుప్తా, సెట్విన్ ఎం.డి.వేణుగోపాల్, కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం చైర్మన్ ఈశ్వరమ్మ యాదవ్,మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు,పలు డివిజన్ల అధ్యక్షులుపాల్గొన్నారు.

వెలసిన గుడిసెలు - తొలగించిన అధికారులు



నవతెలంగాణ-నాగోల్

నాగోల్ డివిజన్‌లోని బండ్లగూడలో గల ప్రభుత్వ అసైన్డ్ భూమిలో శుక్రవారం రాత్రి నుండి కొంతమంది గుడిసెలు వేయగా సమాచారాన్ని తెలుసుకున్న మల్కాజ్గిరి, మేడ్చల్ జిల్లా ఉప్పల్ ఎమ్మార్వో గౌతం కుమార్ శనివారం ఎల్బీనగర్ ఏసీబీ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసులను మోహరించి గుడిసెలను తొలగించారు. అడ్డుగా వచ్చిన వారిని ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ తరలించి వదిలి పెట్టినట్లు సమాచారం. అనంతరం ఎమ్మార్వో గౌతం కుమార్ మీడియాతో మాట్లాడుతూ నాగోల్ డివిజన్లోని బండ్లగూడలో సర్వేనెంబర్ 36 /6 లో రెండు ఎకరాలు, 58/1 సర్వే నెంబర్‌లో ఒక ఎకరం భూమి అసైన్ట్ భూమి ఉందని తెలిపారు. దీంతో శుక్రవారం రాత్రి నుండే ఇక్కడ గుడిసెలు వేసినట్లు తమకు సమాచారం అందిందని, వెంటనే శనివారం పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసి ఏసీపీ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో వేసిన గుడిసెలను తొలగించినట్లు తెలిపారు. గుడిసెలు వేసిన వారు స్థానికులా లేక బయటి వ్యక్తులా అనేది విచారణ చేయాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికే ఒకసారి వేస్తే తొలగించడం జరిగిందని, ఇది రెండవసారి అని అన్నారు. 36/6 సర్వే నెంబర్‌లో ఉన్న రెండు ఎకరాలలో ఒక ఎకరం 10 గుంటల భూమిని ఇటీవల నాగోలు డివిజన్‌కు నూతనంగా మంజూరైన పోలీస్ స్టేషన్ నిర్మాణానికి, 30 గుంటల భూమిని స్థానికంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి కేటాయించినట్లు ఎమ్మార్వో పేర్కొన్నారు. అదేవిధంగా 58/1 సర్వే నెంబర్‌లో గల ఎకరం భూమిని క్రీడల మైదాన నిర్మాణానికి కేటాయించినట్లు వివరించారు. ఇక నుంచి ఈ భూమిని ఎవరు ఆక్రమించినా చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. సంబంధిత శాఖ అధికారులకు అప్పగించేంతవరకు ఈ భూమి వద్ద పోలీస్ భద్రతను ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మార్వో గౌతం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వోతో పాటు రెవెన్యూ ఇన్స్‌పెక్టర్, ఎల్బీనగర్ ఏసీపీ శ్రీధర్ రెడ్డితోపాటు పలువురు సీఐలు, ఎస్సైలు, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

'ఆర్బీఎం' ఆస్పత్రిలో డయాలసిస్ విభాగం ప్రారంభం

- రూ.1799లకే వైద్య సేవలు

నవతెలంగాణ-బోడుప్పల్



మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వైద్యం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. శనివారంనాడు బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆర్బీఎం ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ విభాగాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బోడుప్పల్ లాంటి నగరాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇలాంటి ఆస్పత్రులు రావడం ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. బోడుప్పల్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ల మొదటిసారి డయాలసిస్ సేవలు కేవలం రూ.1799లకే అందించడం అన్ని వర్గాలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. అర్బీఎం ఆస్పత్రి ఎండి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ హాస్పిటల్ ఏర్పాటు చేసిన నాటి నుండే ఇక్కడి ప్రజలకు అవసరమైన వైద్య సేవలను తక్కువ ధరలకే అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవిగౌడ్, కార్పొరేటర్లు సామల పవన్ రెడ్డి, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కాటపల్లి రాంచంద్రారెడ్డి, బీజేపీ అధ్యక్షుడు గోనే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలల్లో వృద్ధురాలి ఫ్యామిలీ పెన్షన్ వివాదం పరిష్కారం

- ప్రీ లిటిగేషన్ కేసుగా కేవలం రెండు నెలలలో పరిష్కారం

నవతెలంగాణ-సిటీబ్యూరో



శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 86 సంవత్సరాల వృద్ధురాలి ఫ్యామిలీ పెన్షన్ వివాదం ప్రీ లిటిగేషన్ కేసుగా కేవలం రెండు నెలలలో పరిష్కారం అయినట్టు హైదరాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిటీ సివిల్ కోర్టు కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి కె.మురళీమోహన్ తెలియజేశారు. హైదరాబాద్ ఆసిఫ్‌నగర్‌కు చెందిన వృద్ధురాలు బి.రాజమ్మ భర్త రాజయ్య విద్యుత్ శాఖ ఉద్యోగి. తన భర్త 1983లో పదవి విరమణ పొందగా 2001 మే లో మరణించాడు. భర్త మరణానంతరం కుటుంబ పెన్షన్ పొందుతున్న వృద్ధురాలు బి.రాజమ్మకు కుటుంబ పెన్షన్ మంజూరులో జరిగిన తప్పిదం వల్ల విద్యుత్ శాఖ కొంత అదనపు సొమ్మును చెల్లిస్తూ వచ్చింది. ఇటీవల కాలంలో ఆర్థిక తనిఖీలలో ఈ విషయం వెలుగులోకి రావడంతో రాజమ్మకు ఇప్పటివరకు నాలుగు లక్షల, ఒక వెయ్యి, 571 రూపాయిలు అదనంగా చెల్లించినట్టు తేలింది. విద్యుత్ శాఖ అధికారులు అట్టి మొత్తాన్ని తక్షణం చెల్లించాల్సిందిగా రాజమ్మకు నోటీసులు జారీచేశారు. వయోభారంతో కదలలేని స్థితిలో ఉన్న రాజమ్మ అట్టి మొత్తాన్ని చెల్లించలేకపోవడంతో రాజమ్మకు చెల్లిస్తున్న పెన్షన్‌లో నెలకు 22వేల రూపాయల చొప్పున అధికారులు కోత విధించారు. అధిక మొత్తంలో కోత విధించడంతో ఆ మిగతా అరకొర పెన్షన్ తన పోషణకు, వైద్యానికి సరిపోవడంలేదని, ఈ విషయంలో తనకు న్యాయంచేయాలంటూ వృద్ధురాలైన రాజమ్మ తన కుమారుడి ద్వారా సిటీ సివిల్ కోర్టులోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో ఫిర్యాదు దాఖలు చేసింది. ఫిర్యాదు అందుకున్న హైదరాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జ్ కె.మురళీమోహన్ విద్యుత్ శాఖ అధికారులకు నోటీసులు జారీ చేసి ఇరుపక్షాల మధ్య రాజీ కుదిర్చారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చొరవతో ప్రతి నెల పెన్షన్‌లో విధిస్తున్న 22 వేల రూపాయలను కోతను తగ్గించి నెలకు 7,500 రూపాయల చొప్పున పెన్షన్ నుండి వసూలు చేసుకునేటట్టు లోక్ అదాలత్ సాక్షిగా ఉభయ పక్షాలు అంగీకరించాయి. ఒకవేళ తన జీవితకాలంలో నాలుగు లక్షల రూపాయల బాకీ మొత్తం పెన్షన్ ద్వారా వసూలు కానిపక్షంలో వృద్ధురాలి ఆస్తి నుండి తన వారసుల ద్వారా మిగతా బాకీని విద్యుత్ అధికారులు వసూలు చేసుకోవచ్చుని హామీతో కేసు పరిష్కరించబడింది. ప్రీ లిటిగేషన్ రూపంలో, కోర్టుకు వెళ్లకుండానే కేవలం రెండు నెలల లోపు కాలవ్యవధిలోనే న్యాయ సేవాధికార సంస్థ చొరవతో ఈ వివాదానికి పరిష్కారం లభించింది. వృద్ధురాలు మంచానికి పరిమితమై కోర్టుకు రాలేని స్థితిలో ఉండటంతో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆదేశంతో కార్యాలయ సూపరింటెండెంట్ సునీత వృద్ధురాలి ఇంటికి వెళ్లి రాజీ ప్రతిపాదనను వివరించి, అందుకు వృద్ధురాలు అంగీకరించడంతో రాజీ పత్రంపై వృద్ధురాలి సంతకం తీసుకున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లోక్ అదాలత్‌లో వృద్ధురాలు కేసు పరిష్కరించి, లోకదాలత్ సెటిల్‌మెంట్ అవార్డును అందజేశారు.

మహిళల ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాల్సిందే

నవతెలంగాణ-సంతోష్‌నగర్ / ధూల్‌పేట్



రవీంద్ర నాయక్‌నగర్ కాలనీలో బంజారా వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో బంజారా కమ్యూనిటీ హాల్‌లో ఉచిత కరాటే శిక్షణ ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రొఫెసర్ అబ్బాస్ మరియు నాయక్ బుడోకాన్ కరాటే అకాడమీ వ్యవస్థాపకుడు పి.గణేష్ నాయక్ మరియు రవీందర్ నాయక్ నగర్ కాలనీ బంజారా వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు ఎ.కృష్ణా నాయక్ మాట్లాడుతూ ప్రతి మనిషికి ఈ కాలంలో కరాటే ఎంత దోహదపడుతుందని, వారి ఆరోగ్య మరియు జ్ఞాపకశక్తి పెంచడానికి ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం మహిళలకు ఆత్మరక్షణకు చాలా అవసరం. కరాటేలో అనేక రకాల ఉపయోగాలు ఉంటాయని, మనిషి శక్తి సామర్థ్యం పెరుగుతుందని, యువతీ యువకులు, విద్యార్థులు ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కరాటేలో ఆసక్తి ఉన్న వారు నెంబర్ 93930 95053కి సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కరాటే మాస్టర్ శ్రీనిధి సుంకీ, బంజారా వెల్ఫేర్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ సుందర్‌లాల్ నాయక్, సంతోష్ నాయక్, శంకర్ నాయక్, రామ్‌కుమార్ నాయక్, కిషన్ నాయక్, శ్రీను, నరేందర్, సంతోష్, నగేష్ రాజేందర్ ఎస్.మహేష్, నవీన్,తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ ప్రారంభం

నవతెలంగాణ-సిటీబ్యూరో



జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యూ ఢిల్లీ, తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార స్వంస్థ, మల్కాజ్‌గిరి నందు 11-02-2023 నాడు చైర్మెన్ కమ్ జిల్లా ప్రధాన న్యాయ మూర్తి బి.సురేష్ జాతీయ లోక్ అదాలత్ ప్రారంబించారు. జాతీయ లోక్ అదాలత్ ఉదయం 10:30 నుండి ప్రారంభం అయింది. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోదగిన క్రిమినల్ కేసులు, మోటార్ ప్రమాద కేసులు, గృహ హింస కేసులు, చెక్ బౌన్స్ కేసులు మరియు ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించబడ్డాయి. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 19 బెంచిలలో 66,646 కేసులు పరిష్కరించబడ్డాయి. ఇందులో సివిల్ కేసులు 15, క్రిమినల్ కేసులు 65790, మరియు ప్రీ లిటిగేషన్ కేసులు 841 పరిష్కరించబడ్డాయి. ఈ లోక్ అదాలత్‌లో 1,33,34,06000లు పరిహారం కింద చెల్లించబడినట్టు తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శంకర్ శ్రీదేవి మరియు ఇంత న్యాయమూర్తులు, విక్రమ్, శ్రీదేవి, పూజ, దిలీప్‌కుమార్ నాయక్ మరియు విశ్రాంత న్యాయ మూర్తి బి. మధుసూదన్, బార్ అసోసియేషన్ మల్కాజిగిరి ప్రెసిడెంట్ కోట రామచంద్రారెడ్డి పాల్గొని ఈ జాతీయ లోక్ అదాలత్ గురించి ప్రసంగించారు.

"హమారా ప్రసాద్" వ్యాఖ్యల వెనుక ఎవరున్నారో నిగ్గుతేల్చాలి

- ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాను అమలు చేయడానికే విధ్వంసపూరితమైన వ్యాఖ్యలు
- అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి
- టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్

నవతెలంగాణ-బోడుప్పల్



భారత రాజ్యాంగ నిర్మాత, అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్ వెనుక ఎవరన్నారనే దానిపై నిగ్గు తేల్చాల్సిన అవసరం ఇతర రాష్ట్ర సర్కారుపై ఉందని టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. అంబేద్కర్‌పై హమారా ప్రసాద్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కందుకూరి నవీన్ అధ్వర్యంలో శనివారం నాడు బోడుప్పల్‌లో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వజ్రేష్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ దేశంలో ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలు కుట్రపూరితంగా వ్యవహరిస్తూ ప్రజల మధ్య ఉద్రేకాలను రెచ్చగొట్టేలా, దళితులపై దాడులు జరిగేలా ఇలాంటి వ్యాఖ్యలు చేయిస్తున్నారని అన్నారు. బీజేపీ కుట్రలో భాగంగా ప్రణాళికాబద్ధంగా విధ్వంసాలకు తెరతీస్తుందని దుయ్యబట్టారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన అనంతరం రాజ్యాంగ వ్యవస్థలను సర్వనాశనం చేసి విచ్ఛిన్నకరమైన పద్ధతులలో పాలన సాగిస్తూ, మతం అనే అజెండాను అమలు చేయాలని చూస్తూ తినే ఆహారంపై, అచార వ్యవహారాలపై ఒత్తిడిలు తీసుకువస్తున్నారని అన్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై పీడీ యాక్ట్ నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్‌గౌడ్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్ గౌడ్, తెలంగాణ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పొన్నం తరుణ్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు కుర్రి శివశంకర్, మేడ్చల్ నియోజకవర్గం బిబ్లాక్ ఎస్‌సి సెల్ అధ్యక్షులు కుర్ర మహేష్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు తోటకూర అజయ్ యాదవ్, బొమ్మక్ కల్యాణ్, నాయకులు మధుసూదన్ రెడ్డి, బాలరాజ్ గౌడ్, పోగుల వీరారెడ్డి, రాపోలు శంకరయ్య, సింగిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కటి వేదిక

సిటీ సివిల్ కోర్ట్ చీఫ్ జడ్జి రేణుకయూరా

నవతెలంగాణ-సిటీబ్యూరో



వివాదాల పరిష్కారానికి కాలయాపన లేకుండా చవకగా త్వరితగతిన కేసులు పరిష్కరించుకోవడానికి లోకదాలత్ సరియైన పరిష్కార వేదిక అని సిటీ సివిల్ కోర్ట్ చీఫ్ జడ్జ్ మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ రేణుకయూరా అన్నారు. శనివారం ఫిబ్రవరి 11వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభిస్తూ హైదరాబాద్ పురాణ హవేలీలోని సిటీ సివిల్ కోర్టులో ఏర్పాటుచేసిన లోకదాలత్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో చీఫ్ జడ్జ్ రేణుకయూరా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కక్షిదారులను ఉద్దేశించి న్యాయమూర్తి శ్రీమతి రేణుక యూరా మాట్లాడుతూ అన్ని రకాల సివిల్ కేసులు, కుటుంబ వివాదాలు ,మోటారు ప్రమాద నష్టపరిహార కేసులు మరియు రాజీ పడదగిన అన్ని క్రిమినల్ కేసులు లోకదాలత్ లో రాజీ కుదుర్చుకోవచ్చని వివరించారు.

లోకదాలత్ లో పరిష్కరించబడిన కేసులకు కోర్టు ఫీజు వాపసు చెల్లించబడుతుందని వివరించారు. పేదలకు మహిళలకు న్యాయసేవాధికార సంస్థ ఉచిత న్యాయము, న్యాయ సహాయము అందిస్తుందని తెలియజేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే మురళీమోహన్ మాట్లాడుతూ లోకదాలత్ తీర్పు పై అప్పీలు ఉండదని, రాజీ పరిష్కారంతో ఇరు పార్టీలు నెగ్గినట్టే అని వివరించారు. కార్యక్రమంలో అదనపు చీఫ్ జడ్జీలు శ్రీ ఎస్ శ్రీనివాస్ రెడ్డి శ్రీమతి ఉమాదేవి, జూనియర్ సివిల్ జడ్జి సాధన మరియు పలువురు బ్యాంక్ అధికారులు కక్షిదారులు న్యాయవాదులు న్యాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

హైదరాబాదులో జాతీయ లోక్ అదాలత్ 1222 సివిల్ కేసుల పరిష్కారం

హైదరాబాదులో శనివారం జరిగిన జాతీయలోక్ అదాలత్‌లో మొత్తం 1222 సివిల్ కేసులు పరిష్కారం అయినట్టు బాధితులకు మొత్తం 29 కోట్ల, 54లక్షల, 74వేల, 502 రూపాయల నష్టపరిహారంగా చెల్లించేటట్లు కేసులు రాజీ పద్ధతిలో పరిష్కరించినట్టు చీఫ్ జడ్జి రేణుక యూరా వివరించారు. వీటిలో 368 మోటారు ప్రమాద నష్ట పరిహార క్లైమ్‌లు అని, మిగితావి పెండింగ్ సివిల్ కేసులు కాగా, 824 ప్రి లిటిగేషన్ కేసులు కూడా లోక్ అదాలత్ లో పరిష్కారం అయినట్టు న్యాయమూర్తి రేణుకా యూరా వివరించారు. హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో నాలుగు లోక్ అదాలత్ బెంచీలు, సికింద్రాబాద్ సివిల్ కోర్టులో రెండు బెంచీలు మరియు సిటీ స్మాల్ కాజ్ కోర్టులో రెండు బెంచీల ద్వారా కేసుల పరిష్కారం జరిగినట్టు న్యాయమూర్తి రేణుక యూరా వివరించారు. ఈ జాతీయ లోక్‌అదాలత్ సన్నాహాలలో భాగంగా గత నెలరోజులుగా న్యాయవాదులతోనూ, పలు ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులతోనూ, బ్యాంక్ అధికారులతోనూ చీఫ్ జడ్జి రేణుకయూరా పలు దఫాలుగా వేరువేరు సమావేశాలు నిర్వహించి లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారానికి విధివిధానాలను చర్చించి, కక్షిదారులకు లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం అందించే దిశగా చర్యలు చేపట్టారు. చీఫ్ జడ్జి చేపట్టిన ప్రయత్నాలు ఫలించి పలు కేసులు త్వరితగతిన పరిష్కారమయ్యాయి.

బాధితులకు వెంటనే నష్టపరిహారం అందుకోవడానికి మార్గం సుగమం అయింది. పర్మినెంట్ లోకదాలతో బెంచ్‌కు చీఫ్ జడ్జ్ రేణుకయూరా నేతృత్వం వహించగా, సిటీ స్మాల్ కాజ్ కోర్టు లోక్‌అదాలత్ బెంచ్‌కు స్మాల్ కాజ్ కోర్ట్ చీఫ్ జడ్జి నిర్మల గీతాంబ, సికింద్రాబాద్ కోర్ట్ బెంచ్‌కు మొదటి అదనపు చీఫ్ జడ్జ్ మంజరి నేతృత్వం వహించారని, సిటీ సివిల్ కోర్టులోను ఇతర లోక్ అదాలత్ బెంచ్‌లకు అదనపు చీఫ్ జడ్జీలు ఎస్.శ్రీనివాసరెడ్డి, ఉమాదేవి, సీనియర్ సివిల్ జడ్జి జలీల్, జూనియర్ సివిల్ జడ్జి సాధన నేతృత్వం వహించినట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.మురళీ మోహన్ వివరించారు.

బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అల్వాల్‌లో అత్యంత ప్రసిద్ధి చెందిన దేవుని అల్వాల్ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఆలయ చైర్మన్ రాజగోపాల్ సైన్సర్ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో సత్కరించారు. తదనంతరం అన్న ప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది నరసయ్య, నరేష్, శివరామకృష్ణ, శాలిని, భరత్ గౌడ్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



బండ ప్రకాష్‌కు శుభాకాంక్షలు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

శాసన మండలి డిప్యూటీ ఛైర్మెన్‌గా ఎన్నికైన తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బండ ప్రకాష్‌ను శనివారం ముదిరాజ్ మహాసభ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు దొంతర బోయిన కృపాసాగర్, మేడ్చల్ జిల్లా ప్రచార కార్యదర్శి రొయ్యల క్రిష్ణమూర్తి, తెలంగాణ ముదిరాజ్ మహాసభ మల్కాజిగిరి మండల అధ్యక్షులు చెరుకు సాంబరాజు, తెలంగాణ ముదిరాజ్ మహాసభ యువత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లుడు జగన్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు రూ.కోటి మంజూరు

- రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

కీసరగుట్ట జాతర బ్రహ్మోత్సవాలకు రూ.కోటి ప్రభుత్వం మంజూరు చేసిందని రాష్ట్ర కార్మిక మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం నగరంలోని మంత్రి నివాసంలో కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం రమేష్ శర్మ, కీసర సర్పంచ్ నాయకపు మాధురి వెంకటేష్, ఎంపీటీసీ తటకం నారాయణ శర్మ, ఆలయ



ట్రస్ట్ బోర్డు సభ్యులు కలిసి మంత్రికి జాతర బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. కీసరగుట్ట జాతర బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వివిధ శాఖల అధికారులు జాతర ఏర్పాట్లలోని పనులను వేగవంతంగా చేస్తున్నారని తెలిపారు. ఆలయ చైర్మన్ ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంగా పనిచేస్తూ జాతర బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలి



నవతెలంగాణ-కంటోన్మెంట్

ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఓల్డ్ బోయిన్‌పల్లి 119వ డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం డివిజన్‌లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈనెల 17వ తేదీన సీఎం జన్మదిన ఉంటుందని తెలిపారు. డివిజన్ లోని వివిధ బస్తీల్లో శంకుస్థాపన చేసిన పనులను పూర్తి చేశామని తెలిపారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌ను మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ నరేందర్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు కర్రే లావణ్య, మక్కల నర్సింగ్‌రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కర్రె జంగయ్య, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఇర్ఫాన్ బాయ్, జనరల్ సెక్రెటరీ మేకల హరినాథ్, నియోజకవర్గం మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ ఇజాజు బాయ్, వార్డు మెంబర్ గడ్డం నర్సింగ్ రావు, డివిజన్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ బుర్రి యాదగిరి, బీసీ సెల్ ప్రెసిడెంట్ మట్టి శ్రీనివాస్, మైనారిటీ ప్రెసిడెంట్ జాంగిర్ భాయ్, మహిళా నాయకురాలు లలిత పాల్గొన్నారు.

అంతర్ పాఠశాలల టోర్నమెంట్ ప్రారంభం



నవతెలంగాణ-కంటోన్మెంట్

తెలంగాణ ఫిస్ట్ బాల్ అసోసియేషన్ సహకారంతో కంటోన్మెంట్ బోయినపల్లి ప్లే గ్రౌండ్‌లో శ్రీ పతి వెంకట రావు మెమోరియ ఫిస్ట్ బాల్ రాష్ట్ర స్థాయీ పాఠశాలల మొదటి పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. శ్రీపతి రఘు చరణ్ తన తండ్రి జ్ఞాపకార్థం ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. సందర్భంగా ఫిస్ట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఛైర్మెన్ జంపన ప్రతాప్ రఘు చరణ అభినందించారు. అనంతరం పాల్గొంటున్న క్రీడాకారుల ను పరిచయం చేసుకుని టాస్ వేసి పోటీలు ప్రారంభించారు. తన తండ్రి శ్రీపతి వెంకట్ రావు జ్ఞాపకార్థం రాష్ట్ర స్థాయి పోటీలను మొదటిసారి నిర్వహిస్తున్నామనీ, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో నిర్వహిస్తామని శ్రీ పతి రఘుచరణ్ తెలిపారు. ఫిస్ట్ బాల్ అసోసియేషన్ సెక్రెటరీ కొమ్ము వెంకట్ జంపన ప్రతాప్ మాట్లాడుతూ నాలుగో ఏండ్లు క్రితం ప్రారంభమైన ఫిస్ట్ బాల్‌కు మంచి ఆదరణ లభిస్తోందన్నారు. జిల్లా రాష్ట్రీయ జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మొదటిసారి మెమోరియల్ ఫిస్ట్ బాల్ పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ నెల 17న జాతీయ స్థాయిలో నాగర్ కోయిల్ లో ఫిస్ట్ బాల్ జరుగుతున్నాయనీ, రాష్ట్ర బాల బాలికల జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రభుకుమార్ గౌడ్, సత్యనారాయణ, స్టాన్లీ, మునిరాజ్ జగదీష్, విక్రమ్, హెూప్ విజయ్, వరప్రసాద్, పేరుక మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులను ఆదరిస్తున్న సత్యసాయి బాబా సేవా సమితి

నవతెలంగాణ-మల్కాజిగిరి



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఎన్.వినయ్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి నుంచి 22 మంది వికలాంగులను భగవాన్ శ్రీ సత్య సాయి బాబా సేవా సమితి ఆపిల్ గుడా మల్కాజిగిరి కన్వీనర్ సత్యనారాయణ సహాయంతో సత్యసాయి నిలయం సందర్శించడానికి వెళ్లారు. సత్య సాయి సేవా సమితి వారు వికలాంగుల కోసం చాలా కార్యక్రమాలు చేశారు. బట్టలు పంపిణీ, నిత్యావసర వస్తువులు, దుప్పట్లు పంపిణీ చేయడం వంటి అనేక రకాల సహాయాలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు ఎన్.శాంతా బాయి' కే.పద్మ, అర్.మల్లేష్. అర్.శంకర్ నాయక్, కె.శ్రీనివాస్ గౌడ్, పి.మహేశ్వరి, పి.శ్రీనివాస్ గౌడ్, నాగలింగం, జి.నర్సింహ, నాగయ్య, గట్టమ్మ ఐలయ్య, సురేష్, వరలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

నేరేడ్‌మెట్ డివిజన్‌లో అధికారులు, నాయకుల పర్యటన

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని యాప్రాల్ భగత్ సింగ్ నగర్ లో శనివారం అధికారులతో కలిసి బీఆర్ఎస్ మల్కాజిగిరి సర్కిల్ వైస్ ప్రెసిడెంట్ కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో డ్రయినేజీ పొంగుతుండటంతో వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యను అక్కడే పరిష్కరించారు. అనంతరం డిఫెన్స్ కాలనీలో నూతనంగా నిర్మాణం చేపట్టిన డ్రయినేజీ లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలకు కనుగుణంగా ఈ పనులను పూర్తి చేసి త్వరగా ప్రజలకు వినియోగంలోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ సృజన, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ నాయక్, నాయకులు చెన్నారెడ్డి, మహేష్, రమాదేవి, నవనీత చౌదరి పాల్గొన్నారు.

త్రిమూర్తి శివ జయంతి మహోత్సవంలో కార్పొరేటర్

నవతెలంగాణ-కాప్రా



మీర్‌పేట హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని బ్రమ్మకుమారిస్ ఆధ్వర్యంలో నిర్వహించిన త్రిమూర్తి శివ జయంతి మహోత్సవంలో స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ పాల్గొన్నారు. బ్రమ్మకుమారిస్ ఈశ్వర విశ్వ విద్యాలయాన్ని స్థాపించి 87 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ మహోత్సవం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ శివుని జెండా ఆవిష్కరణ చేశారు. జీవితం ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలంటే మెడిటేషన్ ఏకైక మార్గమనీ, ఈ మెడిటేషన్‌ను బ్రహ్మకుమారిస్ వారు అందరికీ ఉచితంగా నేర్పించడం అభినందనీయమన్నారు. ధ్యానంతో మానసిక ప్రశాంతతను పెంచుకుంటే స్వతహాగా సమాజం శాంతియుతంగా మారుతుందన్నారు. ఆధ్యాత్మిక ప్రవచనం అనంతరం త్రిమూర్తి జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రమ్మకుమారిస్ నిర్వాహకులు మీర్‌పేట, మౌలాలి ఇన్‌చార్జి సునీత, ఏ.ఎస్.రావునగర్ బ్రమ్మకుమారిస్ ఇన్‌చార్జి రాజకుమారి, స్థానిక నాయకులు నిస్సార్ అహ్మద్ గోరి, దండెం నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణానగర్ పోచమ్మ ఆలయ 8వ వార్షికోత్సవం



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట హౌసింగ్ బోర్డు కాలనీ డివిజన్ పరిధిలో గల కృష్ణానగర్ పోచమ్మ ఆలయ 8వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజలు, హెూమం నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించిన స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి. ఈ కార్యక్రమంలో సుధాకర్ గుప్తా, సుఖేందర్ రెడ్డి, మల్లారెడ్డి, అంజయ్య గౌడ్, బాలరాజు గౌడ్, సాయన్న, చారి, బాలయ్య గౌడ్, రవిబాబు, కిష్టారెడ్డి, కృష్ణవేణి, సుజాత, అనిత, రోజా, శేఖర్ గౌడ్, నిసార్ అహ్మద్ గోరి, దండెం నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

కుతాడి శ్రీనివాస్ అరెస్టు దుర్మార్గం : కుతాడి కుమార్

నవతెలంగాణ-జవహర్‌నగర్



గిరిజన వర్గానికి చెందిన కుతాడి శ్రీనివాస్‌ను కుమారుడి పెళ్ళిలో అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమైన చర్య అనీ, అతనికి జైలులో ఏం జరిగినా మేడ్చల్ డీసీపీదే బాధ్యతని తెలంగాణప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి కుమార్ అన్నారు. పారిశ్రామికవేత్త కుతాడి శ్రీనివాస్ తన రెండో కుమారుడు పెళ్ళి వేడుకల్లో పోలీసులు సీని ఫక్కిలో అరెస్ట్ చేయడం మేడ్చల్ జిల్లాలో కలకలం లేపింది. దీంతో రాష్ట్ర ఎరుకల సంఘం కుతాడి శ్రీనివాస్‌పై అక్రమ కేసులు బనాయించడంపై శనివారం జవహర్‌నగర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగుతుంటే కొంత మంది అగ్రకులాలు ఓర్వలేకపోతున్నాయన్నారు. మేడ్చల్ డీసీపీ కావాలనే కుట్రపూరితంగా అక్రమ కేసులు బనాయించి పీడీ యాక్టు కేసు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికవేత్తగా ఎదిగిన గిరిజన వర్గానికి చెందిన కుతాడి శ్రీనివాస్‌ను చూసి తట్టుకోలేక ఒకే నెలలో మేడ్చల్ పోలీస్‌స్టేషన్లో 7 కేసులు పెట్టి బయపట్టిస్తున్నారన్నారు. కేసు పెట్టిన వారి కాళ్ళు పట్టుకుని రాజీ చేసుకోవాలని ఒత్తిడి తీసుకువచ్చాడనీ, అతను చెప్పిన పని చేయకపోవడంతో ఈ కుట్రకు పన్నారన్నారు. కుతాడి శ్రీనివాస్ ఏ తప్పు చేయలేదనీ, ఈ విషయంపై జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ కుతాడి శ్రీకాంత్, టీపీవైఎస్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ రఘు, శేఖర్, రమేష్, జంగయ్య, స్వామి, కృష్ణ, గోపి, సీనియర్ నాయకులు కుతాడి కృష్ణ, రవి, మహేష్, బీఆర్ఎస్ నాయకురాలు మంజుల, కేతమ్మ, ఎరుకల సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అక్షర స్కూల్ 'పది' విద్యార్థులకు వీడ్కోలు



నవతెలంగాణ-కాప్రా

ఏఎస్ రావు నగర్ ప్రాంగణంలోని అక్షర ఇంటర్నేషనల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యులు సీఈవో మదన్ మోహన్, చైర్మన్ జగన్మోహన్ రావు, ప్రిన్సిపాల్ కనుప్రియవాహి, ఆర్ఎన్‌డీ సభ్యులు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. మదన్ మోహన్ రావు జ్యోతిని వెలిగించగానే, పెద్దలందరూ పదవ తరగతి విద్యార్థులకు అక్షింతలతో ఆశీర్వచనాలను అందజేశారు. ఈ భాగంగా పాఠశాల యాజమాన్యులు మదన్ మోహన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు ఎన్నో మంచి అవకాశాలను అందుకోవాలన్నారు. అన్నివేళలా అక్షర వారికి తోడు ఉంటుందని తెలుపుతూ వారిని ఉత్తేజపరిచారు. పదవ తరగతి విద్యార్థులు తమకు అక్షర పాఠశాలతో ఉన్న అనుభవాలను పంచగా, తొమ్మిదవ తరగతి విద్యార్థుల ఆటపాటలతో ఆనాటి కార్యక్రమం కన్నుల పండుగగా ముగిసింది.

మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసిన కాటం శివ



నవతెలంగాణ-ఓయూ

పాత పద్ధతిలోనే యూజీసీ నిబంధనల ప్రకారం ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రవేశాలు జరపాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి కాటం శివ శనివారం కోరారు. అసెంబ్లీలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఓయూ వీసీ యూజీసీ గైడ్ లైన్స్‌ను తుంగలో తొక్కి రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా తన ఇష్టానుసారంగా పీహెచ్డీ ప్రవేశాలు చేస్తున్నారనీ, అందువల్ల ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థులకు చాలా అన్యాయం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఇదేం న్యాయం అని ప్రశ్నించగా వారి పైన తప్పుడు కేసులు పెట్టిస్తున్నారని మంత్రికి వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్టు కాటం శివ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ప్రవీణ్ చారి, సంగీత్ పాల్గొన్నారు.

అధికారులపై కార్పొరేటర్ ఆగ్రహం



నవతెలంగాణ-అంబర్‌పేట

సివిల్ సప్లై అధికారులపై హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం హిమాయత్ నగర్ డివిజన్ పరిధిలోని విటల్ వాడీలో ఉన్న రేషన్ షాప్‌ని తనిఖీ చేశారు. రేషన్ షాప్ డీలర్‌ని రేట్లు ప్రకారంగా అమ్మటం లేడని తెలిసి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందరికీ సన్నబియ్యం ఇస్తున్నట్టు ప్రచారం చేయడం తప్ప అమలు చేయడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం పంపిస్తున్న సన్న బియ్యాన్ని రేషన్ షాప్‌లకి ఇవ్వకుండా దొడ్డు బియ్యం ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మహేష్, జైస్వాల్, సాయినాథ్ గౌడ్, సత్యనారాయణ లాల్, ప్రవీణ్, వేణుగోపాల్ యాదవ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్ఎస్) విధానాలు, సీపీఆర్ చేయడంపై ప్రాక్టికల్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇటీవలి కాలంలో కార్డియాక్ అరెస్టులు, గుండెపోటు సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పక్కన ఉన్నవారు ఎవరైనా వీటికి గురైనప్పుడు వారిని తక్షణం కాపాడే అవకాశం సామాన్య ప్రజలకు కూడా ఉంటుంది. ఇందుకు వాళ్లకు కేవలం కొద్దిపాటి శిక్షణ ఉంటే సరిపోతుంది. అలాంటి శిక్షణనే సెంచరీ ఆస్పత్రి వైద్యులు పలువురు విద్యార్థులు, సామాన్య ప్రజలకు ఇచ్చారు. శనివారం ఉదయం 10.30 నుంచి 12.30 వరకు రెండు గంటల పాటు పెద్దసంఖ్యలో వచ్చిన వారందరికీ బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్ఎస్) విధానాలు, సీపీఆర్ చేయడం ఎలాగో ప్రాక్టికల్‌గా వివరించారు. కేవలం థియరీ మాత్రమే చెప్పి వదిలేస్తే సరిగ్గా చేయడం రాదన్న ఉద్దేశంతో.. బొమ్మలను (మానెక్విన్స్) తీసుకొచ్చి, సరిగ్గా ఏ ప్రాంతంలో ఒత్తిడి ఇవ్వాలో, ఎంతసేపు, ఎలా సీపీఆర్ చేయాలో చూపించడమే కాక.. స్వయంగా వారందరితోనూ చేయించారు. ఒకసారి తప్పుగా చేస్తే, దాన్ని సరిచేసి, మళ్లీ చేయించడం ద్వారా పూర్తిస్థాయిలో వారు ప్రాణరక్షణకు సిద్ధమయ్యేలా చూశారు. వివరాలను ఆస్పత్రికి చెందిన క్రిటికల్ కేర్ కన్సల్టెంట్ డాక్టర్ శరణ్ రెడ్డి వివరించారు. "అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం, ఎవరైనా కార్డియాక్ అరెస్టుకు గురైనప్పుడు వెంటనే గుండెకు సరిగా రక్తప్రసారం అవుతోందో లేదో చూసుకోవాలి. ముందుగా అసలు రోగి స్పందిస్తున్నారో, లేదో చూసుకోవాలి. పది సెకన్లలోగా రక్తప్రసారం ఉందో లేదో చూడాలి. అసలు స్పందించని పక్షంలో వెంటనే 108కి ఫోన్ చేసి చెప్పాలి. ఈలోపు వాళ్లను సురక్షితమైన ప్రదేశానికి తీసుకెళ్లాలి. అంటే రోడ్డు మధ్యలో పడిపోయి ఉంటే.. రోడ్డు పక్కకి తరలించాలి. అప్పుడు సీపీఆర్ మొదలుపెట్టాలి. అది ఎంత వేగంగా చేయగలిగితే అంత మంచిది. గుండెపోటు వచ్చిన మూడు నాలుగు నిమిషాల్లోపు సీపీఆర్ చేయగలిగితే, రోగిని బతికించగలిగే అవకాశాలు 90-95శాతం ఉంటాయి. దీని గురించి ముందుగా కంప్రెషన్స్.. అంటే రొమ్ము ఎముక వద్ద నిమిషానికి 100-120 సార్లు 5-6 సెంటీమీటర్లు లోపలకి గట్టిగా ఒత్తాలి. అప్పుడు రక్తప్రసారం మళ్లీ మొదలవుతుంది. 30 సార్లు ఒత్తిన వెంటనే రెండుసార్లు శ్వాస కూడా ఇవ్వాలి. అలా చేస్తుండగా ఎమర్జెన్సీ సిబ్బంది వచ్చి, వాళ్లు ఏఈడీ అనే పరికరంతో షాక్ ఇవ్వాలా, అక్కర్లేదా అనేది చూస్తారు. అవసరమైతే షాక్ ఇస్తారు" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ ఫిజిషియన్ డాక్టర్ సందీప్ రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ పర్వీన్, ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ చైతన్య, క్రిటికల్ కేర్ స్పెషలిస్టు డాక్టర్ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

పేదలు, రైతుల సంక్షేమం పట్టని బడ్జెట్ కేటాయింపులు



నవతెలంగాణ-ముషీరాబాద్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్లలో దళితులు, ఆదివాసీలు, రైతుల సంక్షేమం పట్టని బడ్జెట్‌గా ఉన్నదని పీపుల్స్ మానిటరింగ్ కమిటీ జాతీయ కన్వీనర్ సత్యబాబు బోస్, రైతు స్వరాజ్య వేదిక నాయకులు కన్నెగంటి రవి, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పీపుల్స్ మానిటరింగ్ కమిటీ, తెలంగాణ అగ్రి నెట్వర్క్, సీబీజీఏ సంయుక్తంగా పోస్ట్ బడ్జెట్ కన్సల్టేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సన్న, చిన్నకారు రైతులు, కౌలు రైతులకు సంబంధించి ప్రాధాన్యాలు కావాలన్నారు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలు, పరిశోధనలకు అలాగే డ్రిఫ్ ఇరిగేషన్, తదితర రంగాలకు కేటాయింపులు పెరగాలన్నారు. కుల వివక్ష పోరాట సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు, డీబీఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ దళిత, ఆదివాసులకు సంబంధించి గత బడ్జెట్ మాదిరిగానే ఇప్పుడు కేటాయించారు కానీ ఖర్చు చేయడంలో చిత్తశుద్ధి కనబడటం లేదన్నారు. గత బడ్జెట్‌లో దళితబంధు అమలుకు రూ.1,7500 వేల కోట్లు కేటాయించి ఒక్కరూపాయి కూడా ఖర్చు చేయకుండా ఇప్పుడు కూడా రూ.17 వేల కోట్లు కేటాయించారన్నారు. గత బడ్జెట్‌లో రూ.33 వేలకోట్ల కు పైగా కేటాయించి డిసెంబర్ చివరి నాటికి కేవలం రూ.11వేలా 4 వందల కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. కేటాయింపులను చూపి ప్రచార ఆర్భాటాలు చేయకుండా ఖర్చు చేయాలన్నారు. మాంట్ ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ బ్రదర్ వర్గీస్ మాట్లాడుతూ అసంఘటితరంగ కార్మికులు, డొమెస్టిక్ వర్కర్స్, ఉపాధి హామీ కూలీల సంకక్షేమం పట్ల బడ్జెట్ కేటాయింపులు లేవనీ, వీరి కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి పీపుల్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ సురుపంగ శివలింగం అధ్యక్షత వహించగా సీబీజీఏ ప్రతినిధి సోమశేఖర్, పి.శ్రీనివాసులు, కె.ఉమాదేవి, తెలంగాణ అగ్రి నేట్వేర్క్ ప్రతినిధులు కానుగంటి శ్రీశైలం, వై.మధుబాబు, రాంబాబు పాల్గొని ప్రసంగించారు.

రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం

- తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర అధ్యక్షులు బెల్లపు దుర్గారావు అధ్యక్షతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కీర్తి యుగంధర్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సమావేశం శనివారం హనుమాన్ టెక్డిక్‌లోని బీసీ సాధికారత భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రవేశపెట్టిన రూ.6,229 కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో 2శాతం మాత్రమే బీసీలకు ఉండటం అందులోనూ ఫెడరేషన్ల ఊసేలేకపోవడం బాధాకరమన్నారు. ఎంబీసీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారన్నారు. తెలంగాణలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలపైన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. చర్చా గోష్టిలో తెలంగాణలోని వివిధ అనగారిన ఎంబీసీ కులాలు, బీసీ ఫెడరేషన్ కులాల ప్రతినిధులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. అసెంబ్లీలో అనగారిన వర్గాల నుంచి ప్రాతినిధ్యం లేకపోవడం వల్లే ఎన్నో పర్యాయాలు మంత్రులు, ఎమ్మెల్యేలకు వివిధ ప్రతిపక్ష పార్టీల నాయకులకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ఏ ఒక్క అంశాల్లో కూడా బీసీలకు న్యాయం చేసే విధంగా స్పందించకపోవడం చాలా బాధాకరం అన్నారు. రాజకీయ ప్రాతినిధ్యం లేని కులా లకు అన్యాయం జరుగుతుందని భావించి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని పార్టీల నుంచి బీసీ వర్గాలకు సీట్లు కేటాయించే విధంగా అధికార, ప్రతిపక్ష పార్టీలను డిమాండ్ చేశారు. అవసరమైతే స్వతంత్ర అభ్యర్థులుగా రాష్ట్ర వ్యాప్తంగా అనగారిన అన్ని సామాజిక వర్గాల తరపు నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేసి అసెంబ్లీలో వాని వినిపించాలనీ, అందుకు అవసరమైన కార్యాచరణతో ముందుకు వెళతామని చెప్పారు. ఈ నెల 25వ తేదీన ధర్నా చౌక్ (ఇందిరా పార్క్) వద్ద సామజిక వర్గాల జన చైతన్య దీక్ష చేపట్టి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి ఎం.భాస్కరుడు, రాష్ట్ర సలహాదారులు మంగిలిపెళ్ళి శంకర్ గంగపుత్ర, క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ సంఘ వీరప్ప, రాష్ట్ర కార్యదర్శులు నర్సింగ్ గంగపుత్ర, రానా నగేష్ సింగ్, చేర్యాల రాకేష్, యశ్వంత్ నాయి, షేక్ ఇమామ్ పాషా, రాష్ట్ర మహిళా కమిటీ అధ్యక్షురాలు కొత్తపల్లి బాయమ్మ, ఏపూరి శివరాం, కైరంకొండ రాజు, కుమ్మరి పి.కుమారస్వామి, వికాస్ నాయి, పరమేష్, నందు, ఎస్.రాజేష్, సురేష్ గంగపుత్ర, పాల్గొన్నారు.

మహిళా పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన ఇన్‌స్పెక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

- ఐద్వా హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి పి.శశికళ

నవతెలంగాణ-ధూల్‌పేట్

మహిళా పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన ఇన్‌స్పెక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి పి.శశికళ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మహిళలకు రక్షణగా ఉండాల్సిన పోలీస్ యంత్రాంగం సహచర మహిళా పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన ఘటనలు నగరంలో ఇటీవల చవిచూస్తున్నాయన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకునేటట్టుగా వ్యవహరించాలన్నారు. హైదరాబాద్ నగరంలోని సంతోష్ నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అదే పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పని చేస్తున్న మహిళా అధికారిపై దురుసుగా ప్రవర్తించిన ఘటన వెలుగు చూసిన విషయం తెలిసిందేన అనీ, అతనిపై చర్యలు తీసుకోకుండా కేవలం పోలీస్ హెడ్ క్వార్టర్ కు అటాచ్ చేయటం సరికాదన్నారు. ఉన్నత అధికారులు తగిన జోక్యం చేసుకుని కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో మల్కాజిగిరి ఏరియాలోని పోలీస్ స్టేషన్‌లో ఇలాంటి ఘటన జరిగిందనీ, అప్పుడు కూడా పోలీసు ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోకుండా కంట్రోల్ రూమ్‌కి అటాచ్ చేశారన్నారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నా చర్యలు తీసుకోకుండా పోలీసు ఉన్నతాధికారుల వ్యవహరించడంతో పోలీస్ వ్యవస్థ పై ప్రజలకు నమ్మకం సన్నగిలేలా చేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా నగర పోలీస్ కమిషనర్ స్పందించి ఈ ఘటనపై విచారణ జరిపి సీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే మహిళల హక్కుల రక్షణలో భాగంగా అఖిల భారత ప్రజాతంత్రం మహిళా సంఘం ఐద్వా ఆందోళన చేపడుతుందని హెచ్చరించారు.

బహుజన సమాజ సంక్షేమాన్ని పట్టించుకోని ప్రభుత్వాలు



నవతెలంగాణ-ముషీరాబాద్

బాగలింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన పొలిటికల్ సెంటర్ ఆవిర్భావ సదస్సుకు దండి వెంకట్, కె.పర్వతాలు (తెలంగాణ,) పి.కోటేశ్వరరావు(ఏపీ) అధ్యక్షతన జరిగిన బహుజన శ్రామిక వర్గ ప్రణాళిక ముసాయిదాపై ప్రొఫెసర్ కాశీం ప్రధాన వక్తగా హాజరై మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలన్నీ ఆధిపత్య కులాల యాజమాన్యంలో రాజకీయ పార్టీలు కావడం మూలంగానే 85శాతం శాతం బహుజన ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. కేవలం 15శాతం శాతం ఉన్న ఆధిపత్య కులాలకు చెందిన కొద్దిమంది పెట్టుబడిదార్ల దోపిడీ మూలంగా 85శాతం ఉన్న బహుజన ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. కుల వ్యవస్థ నిర్మాణాన్ని ప్రభుత్వమే ప్రోత్సాహిస్తుందన్నారు. బహుజన పొలిటికల్ సెంటర్ రూపొందించిన బహుజన శ్రామిక వర్గ ప్రణాళిక సరళంగా ఉందని చెప్పారు. బహుజన శ్రామిక వర్గ ప్రణాళిక సిద్ధాంత ముసాయిదాను కవి రచయిత జూపాక సుభద్ర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహుజన శ్రామికవర్గ మహిళా విముక్తి కోసం ప్రత్యేక ఉద్యమాలు నిర్మించాలని పిలుపిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐయు రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, రీటైర్డ్ ఐఎఎస్ ఆకునూరి మురళి, భారత్ బచావో జాతీయ నాయకులు ఎం.ఎఫ్.డాక్టర్ గోపినాథ్, బహుజన పొలిటికల్ సెంటర్ మూడు రాష్ట్రాల నుంచి హాజరైన ముఖ్య నాయకులు ఎస్.సిద్దిరాములు, గాజుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వివేకవర్ధిని స్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

జాంబాగ్ వివేకవర్ధిని స్కూల్ 1973 సంవత్సర బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. శనివారం జాంబాగ్‌లోని వివేకవర్ధిని 1973లో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఒక్క దగ్గరికి చేరి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమతో చదువుకుని ఈ మధ్య కాలంలో అసువులు బాసిన ఐదుగురు విద్యార్థులకు నివాళులర్పించారు. పూర్వ విద్యార్థి రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ ఉమేష్ గోపితై ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అలనాటి రోజులను, స్కూల్ రోజుల్లో చేసిన చిలిపి పనులను, తమకు విద్య నేర్పిన హెచ్ఎం వీడి తిలక్, వైస్ హెచ్ఎం కటేకర్‌లను గుర్తు చేసుకున్నారు. రానున్న రోజుల్లో తాము చదువుకున్న స్కూలుకు ఏమైనా సహాయం అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కూల్ పూర్వ విద్యార్థులు ఉత్తమ్, నిరంజన్, వెంకటేష్, దీపక్‌చ, సంజీవన్, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విద్యార్థులు గొప్ప సిటిజన్స్‌గా ఎదగాలి

- న్యాయ విద్యా ఔన్నత్యాన్ని కాపాడాలి
- హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్వల్ భూయన్



నవతెలంగాణ-ఓయూ

న్యాయ విద్యార్థులు గొప్ప సిటిజన్స్‌గా ఎదగాలనీ, న్యాయ విద్యా ఔన్నత్యాన్ని పెంపొందించాలని తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్వల్ భూయన్ అన్నారు. ఓయూ న్యాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో జరుగుతున్న డుసీమస్ 2023 ముగింపు కార్యక్రమం శనివారం రాత్రి ఓయూ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ ఓయూ లా కళాశాలా న్యాయ విద్యకు చేస్తున్న సేవలను ప్రశంసించారు. న్యాయ విద్యార్థులకు అనేక అవకాశాలు ఈ రంగాల్లో ఉన్నాయనీ, వాటిని అందిపుచ్చుకుని జీవితంలో గొప్ప న్యాయవాదులు, జడ్జిలు, జస్టిస్‌లుగా రాణించాలని సూచించారు. విద్యార్థులు ప్రతి పోటీల్లో పాల్గొని గెలుపు, ఓటములు ఏమైనా స్వీకరించిన ముందుకు సాగాలన్నారు. విజేతలకు పాల్గొన్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. అడ్వకేట్ జనరల్ ఆఫ్ తెలంగాణ బి.శివానంద్ ప్రసాద్ మాట్లాడుతూ ఎంతోమంది నిపుణులు, మేధావులను, గొప్ప గొప్ప జడ్జీలను న్యాయస్థానం అందించిన వేదిక ఓయూ న్యాయ కళాశాల అన్నారు. ఇది గొప్ప వృత్తి అనీ, అంకిత భావంతో ముందుకు సాగాలని సూచించారు. ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.పి.లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ డా.డి.రాధిక యాదవ్, లా హెడ్ ప్రొ.వెంకటేశ్వర్లు, బీసీ కమిషన్ ఛైర్మన్ వకులాభరణం కృష్ణ మోహన్ రావు, ఎమ్మెల్యే బాలరాజ్, లీగల్ సెల్ డైరెక్టర్ ప్రొ.విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ, లా కళాశాల ఆలూమినీ అధ్యక్షుడు నారపరాజు, రామచంద్ర రావు తో పాటు 18 కళాశాలల న్యాయ విద్యార్థులు పాల్గొన్నారు. 15 పైగా కార్యక్రమల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

'పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ అడుగు జాడల్లో నడవాలి'



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ప్రతి ఒక్కరూ పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ అడుగు జాడల్లో నడవాలని మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామచంద్రరావు అన్నారు. పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మితో కలిసి దీన్ దయాల్ నగర్ కాలనీలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ తన జీవితంలో ఎంతో కష్టపడ్డారని తెలిపారు. ఏకాత్మ మానవతా సిద్ధాంతమును ప్రతిపాదించినారు అని చెప్పారు. అంత్యోదయ బంతిలో చిట్ట చివరి వాడి వరకు అన్ని అందే సిద్ధాంతమును చాటి చెప్పిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన చెప్పిన సిద్ధాంతాలను పాటిస్తే మంచి రాజకీయవేత్తలను, రాజకీయాలు చూడ వచ్చున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు ఓం ప్రకాష్, జిల్లా స్పోక్స్ పర్సన్ నవీన్, నరసింహ గౌడ్, ఆనంద్ గౌలికర్ గడప నర్సింగ్ రావు, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు ఆచారి, తపస్ జిల్లా అధ్యక్షులు నవీన్, ఆర్ఎస్ఎస్ నాయకులు రామకృష్ణ, కాలనీ అధ్యక్షులు జగన్ పాల్గొన్నారు.



చర్లపల్లి డివిజన్ కుషాయిగూడకి చెందిన అనిల్ కుమార్ - మనోజ్ఞ, నగరంలో పలు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్. **నవతెలంగాణ-కాప్రా**

స్థానిక సమస్యల పరిష్కారానికి సొంత నిధులు



నవతెలంగాణ-అంబర్‌పేట

స్థానిక సమస్యల పరిష్కారానికి సొంతంగా నిధులు కేటాయిస్తున్నాన ని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శనివారం కాచి గూడ డివిజన్ పరిధిలోని కుద్బీగూడ బస్తీలవాసులు తెలిపన సమస్యకు పరిష్కారంగా ఎమ్మెల్యే రూ.లక్షా 50 వేలు సొంత ఖర్చుతో వీధి సుందరీక రణ పనులను ప్రారంభించారు. మున్నూరు కాపు సంఘం వెనక గోడ వెంబడి వీధిలో రాత్రిళ్లు చాలా మంది చేరుతూ, అక్కడి వాతావరణాన్ని అపరిశుభ్రం చేస్తున్నారని ఫలితంగా తమకు చాలా అసౌకర్యం కలుగుతోందని అక్కడి అపార్ట్మెంట్ల వాసుల విజ్ఞప్తి మేరకు, గోడ వెంబడి 3 అడుగుల ఎత్తైన గట్టు కట్టించి, ఆమేర మట్టి పోయించి, మొక్కలు పెంచే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ కాచిగూడ అధ్యక్షుడు ఎర్ర భీష్మ దేవ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ బంజారాహిల్స్ రిపోర్టర్ మేడిపల్లి రాఘునాథ్‌కు మాతృవియోగం



నవతెలంగాణ-జూబ్లిహిల్స్

నవతెలంగాణ బంజారాహిల్స్ సీనియర్ రిపోర్టర్ మేడపల్లి రఘునాథ్‌కు మాతృవియోగం కలిగింది. తల్లి అంజనాబాయ్ (58) చనిపోయారు. 47 రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్నారు. పరిస్థితి విషమించడంతో శనివారం తుది శ్వాస విడిచారు. రఘునాథ్‌కు నవతె లంగాణ యాజమాన్యం, రిపోర్టర్లు, సిబ్బంది తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం



నవతెలంగాణ-అంబర్‌పేట

అంబర్‌పేట డివిజన్ బాపునగర్‌లోని ప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో రాంకీ వారి అధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత మీద విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబర్ పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను తడి, పొడి చెత్తని వేరు చేసి ఉదయం చెత్తని సేకరించే వాళ్లకి వేయాలన్నారు. రోడ్లపై వేయకూడదనీ, అలా వేస్తే అనారోగ్యానికి గురవుతామనీ, మీ తల్లిదండ్రులకు చెప్పి చెత్త సేకరించే వాళ్లకే చెత్త వెయ్యాలని చెప్పాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాంకీ సర్కిల్ ఇన్‌చార్జి ప్రదీప్ కుమార్ రెడ్డి ,రేఖ, రేణుక, భార్గవి, స్రవంతి, సుధాకర్, చారి, సిబ్బంది పాషా, శ్రీనివాస్, భాస్కర్, ప్రగతి విద్యనికేతాన్ ప్రిన్సిపాల్ మధుసూధన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, డివిజన్ అధికార ప్రతినిధి మహేష్ ముదిరాజ్, శివ, సంతోష్ చారి, వినయ్ పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్ కార్యాలయంలో సంబురాలు



నవతెలంగాణ-ఓయూ

తార్నాక డివిజన్‌లోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్ రెడ్డి పదవిని చేపట్టి రెండేండ్లు పూర్తి చేసుకుని మూడో ఏటా అడుగుపెడుతున్న సందర్భంగా తాము చేపట్టిన అభివృద్ధి పనులు, సేవా కార్యక్రమాలను గుర్తు చేస్తూ ఈ సందర్భంగా తార్నాక డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షులు మోతె శోభన్ రెడ్డితో కలసి శనివారం కేకే కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ రెండేండ్ల పదవీ కాలం ఎంతో సంతృప్తికరంగా ఉందన్నారు. నగరంలోనే తార్నాక డివిజన్ ప్రాంతాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపాం అన్నారు. మరో వైపు జీహెచ్ఎంసీ నగర అభివృద్ధిలో ఎంతో క్రియాశీలకంగా ముందుకు వెళుతున్నాం అన్నారు. తార్నాక, లాలాపేట, శాంతినగర్, మాణికేశ్వర్ నగర్ ప్రాంతాల్లో దాదాపుగా రూ.50 కోట్లతో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టాం అని తెలిపారు. రూ.6 కోట్లతో స్విమ్మింగ్ పూల్, రూ.6 కోట్లతో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, రోడ్డు విస్తరణ, లాలాపేట ఫ్లై ఓవర్ సుందరీకరణ, రోడ్లు, సివరేజ్, వైకుంఠ దామాలు అభివృద్ధి, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు చేపట్టాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాజా పాషా, యాకోబ్ షరీఫ్, ఆనంద్, కుమార్, అలీ, ఫయాజ్, నగేష్, లక్ష్మారెడ్డి, జహీర్, తదితరులు పాల్గొన్నారు.



శానిటేషన్ సిబ్బంది సేవలు మరువలేనివి : కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

నవతెలంగాణ-బేగంపేట

కార్పొరేటర్‌గా గెలుపొంది రెండేండ్లు పూర్తయిన సందర్భంగా రామ్ గోపాల్‌పేట డివిజన్‌లోని జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బందితో కలిసి భోజనం చేసిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రామ్ గోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్. శానిటేషన్ సిబ్బంది సేవలు మరువలేని అని వారు కొనియాడారు.

ప్రభుత్వంపై లడాయికి ఆదివాసీలు సిద్ధం కావాలి



నవతెలంగాణ-ఓయూ

బంగారు తెలంగాణ పేరుతో రాష్ట్రంలోని ఆదివాసీ ప్రజల అస్తిత్వాన్ని సమాధి చేస్తున్న ప్రభుత్వంపై లడాయి చేయటానికి ఆదివాసీ సమాజం సిద్ధం కావాలని ఉస్మానియా యూనివర్సిటీ ఆదివాసి స్టూడెంట్స్ ఫోరం రాష్ట్ర నాయకులు, ఆదివాసీ పరిశోధన విద్యార్థులు సాగబోయిన పాపారావు పిలుపునిచ్చారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ ఆదివాసుల జీవితాల్లో చీకటి అధ్యాయానికి శ్రీకారం చుట్టారనీ, ఇది చారిత్రక తప్పిదానికి తెర లేపారనీ, ఉస్మానియా ఆదివాసి విద్యార్థులుగా భావిస్తున్నట్టు చెప్పారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం 11 కులాలు అయినా వాల్మీకి, బోయ, బేదర్, కిరాతక, నిషాది, పెద్ద బోయలు, తలయారి, చుండువాళ్లు, ఖాయతీలంబాడ, ఖాట్ మధురలు, చమర్ మధురలను ఎస్టీ జాబితాలో చేర్చడం రాజ్యాంగ విరుద్ధమని అభిప్రాయం వ్యక్తం చేశారు. అడవులపై ఆదివాసులకు హక్కు లేదనే అధికారం ముఖ్యమంత్రి కేసీఆర్‌కి ఎవరిచ్చారు అని ప్రశ్నించారు. ఆదివాసీ ప్రజలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కు పత్రాలు ప్రభుత్వ భిక్ష కాదనీ, ఆదివాసీ ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కు అనే విషయం ప్రభుత్వం గుర్తించాలని పేర్కొన్నారు. పోడు భూముల పట్టాల కోసం ఆదివాసీ రైతులకు షరతులు ప్రకటిస్తే రాష్ట్ర ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తామని హెచ్చరించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయాన కుర్చీ వేసుకుని కూర్చుని ఎక్కడికక్కడ ఆదివాసులకు హక్కు పత్రాలు ఇస్తానన్నారనీ, నేడు అసెంబ్లీ సమావేశాల్లో ఆదివాసులకు అడవులపై హక్కు లేదంటూ అడవులను విధ్వంసం చేస్తున్నారని ప్రకటించడం అంటే ఆదివాసుల్ని మోసం చేయడమే అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ పరిశోధన విద్యార్థులు అరె.ఆరుణకుమార్, బొచ్చు నరేష్, లక్ష్మణ్, కుంజ కోటి, ఆదివాసీ విద్యార్థులు బట్ట వెంకటేశ్వర్లు, మడవి అజయ్, అశోక్, వివేక్వర్ధన్, సౌజన్య, శైలజ, దివ్య, నాగమణి, కాత్యాయని, హరిదాస్ పాల్గొన్నారు.

హెచ్‌సీడీసీ ఆధ్వర్యంలో క్యాంపస్ డ్రైవ్



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం హ్యూమన్ క్యాపిటల్ డెవలప్మెంట్ సెంటర్ వారి ఆధ్వర్యంలో శనివారం కార్యాలయంలో సింజిన్ ఇంటర్నేషనల్ హైదరాబాద్, బెంగళూర్ వారు క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో 200 మంది ఓయూ దాని అనుబంధ కళాశాలాల విద్యార్థులు, నిరుద్యోగులు పాల్గొన్నారు. ఈ డ్రైవ్‌లో హెచ్ఆర్ టీమ్ వారు వారి కంపెనీ దాని విధి విధానాలు, సౌకర్యాలు, వేతనాలు, అర్హతల గురించి వివరించారు. విద్యారులు డ్రైవ్‌లో బాగంగా రాత పరీక్షతో పాటు టెక్నీకల్, హెచ్ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. షార్ట్ అయిన వారిని నేరుగా సమాచారాన్ని చేరవేస్తామని డైరెక్టర్ ప్రొ.కె.స్టీవెన్ సన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరె క్టర్స్ ప్రొ.ఫ్యాట్రిక్, ప్రొ.పి.మురళీధర్‌రెడ్డి, సింజిన్ ఇంటర్నే షనల్ హెచ్ఆర్ ప్రతినిధులు పూజ, జయ్‌దేవ్, ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ నాయకులు హెచ్ కుమార్ జన్మదినం సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్, ఆర్ఏ వినోద్ కుమార్, ఈశ్వర్, జయశంకర్ తదితరులు.
నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

గోల్నాకను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా

నవతెలంగాణ-అంబర్‌పేట



గోల్నాక డివిజన్ నగరంలోని అత్యున్నత ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతానని గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం గోల్నాక డివిజన్ పరిధిలోని కార్పొరేటర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రెండేండ్ల నుంచి డివిజన్ అభివృద్ధి కోసం డ్రయినేజీ, తాగునీటి అవసరాలకు అనుగుణంగా రూ.20 కోట్ల నిధులు కేటాయించి డివిజన్‌లో ఉన్న సమస్యలను 70శాతం పరిష్కరించామనీ, మరికొన్ని పనులు కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో నత్తనడక సాగుతున్నాయనీ, త్వరలోనే వాటిని కూడా పరిష్కరిస్తానని తెలిపారు. త్వరలోనే గోల్నాకలో కేసీఆర్ పార్కు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆర్కే బాబు, నర్సింగ్ యాదవ్, గాజుల గోపాల్, లక్ష్మణ్ గౌడ్, గోపాల్ రెడ్డి, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖ మంత్రిని కలిసిన జక్కిడి

నవతెలంగాణ-హయత్‌నగర్

ఎల్‌బి నగర్ స్టేడియంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యగ అవకాశాలు అనే అంశంపై యల్‌బి నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అధ్వర్యంలో నిర్వహించిన డిఎస్‌ఆర్ మెగా జాబ్ మేళాను విజయ వంతంగా నిర్వహించి నందుకు ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ని, ఎల్ బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డిని బీఆర్ఎస్ యువ నేత జక్కిడి రఘువీర్ రెడ్డి సన్మానించారు.



త్వరలో మహాత్మా జ్యోతి బా పూలే, సావిత్రి భాయ్ పూలే విగ్రహాల ఆవిష్కరణ

నవతెలంగాణ-హయత్‌నగర్

గత కొన్ని సంవత్సరాల క్రితం హయత్ నగర్‌లో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రి భాయ్ పూలే విగ్రహాలను అనివార్య కారణాల వల్ల ప్రారంభించక పోవడం వలన వచ్చే నెలలో ఆ విగ్రహాలను ప్రారంభించడానికి మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రి భాయ్ పూలే సేవా కమిటీ ఆధ్వర్యంలో నిర్ణయం తీసుకున్నట్లు చైర్మన్ పుట్ట యాదయ్య అన్నారు. మన దేశంలో విద్యా వ్యవస్థ ఎంత గొప్పదో వివరించిన గొప్ప నేతలని కొనియాడారు.



'సూపర్ మాక్స్' కార్మికుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్
- కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రస్తావన

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్/జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధికి చెందిన కార్మిక సమస్యలపై శుక్రవారం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రస్తావించారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలో ఉన్న సూపర్ మాక్స్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికుల పరిస్థితి దీనంగా ఉందని, ఐదు నెలలుగా కంపెనీ నడవక అందులో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, యజమాన్యం మధ్య నెలకొన్న గొడవల మూలన ఐదు నెలలుగా కంపెనీ నడవక, కార్మికులకు జీతాలు లేవని, సమస్య ఇప్పటికే ప్రభుత్వ దృష్టికి వచ్చిందని, ఈ సమస్య పరిష్కారం కోసం లేబర్ కమిషన్ మరియు ఇండస్ట్రీస్ ప్రిన్సిపల్



సెక్రటరీలు సమావేశం అయ్యేలా రాష్ట్ర కార్మిక శాఖ చర్యలు తీసుకోవాలని అన్నారు. హెచ్‌ఎంటి విశ్రాంత ఉద్యోగులకు సుమారు 300 కోట్ల బకాయిలు పెండింగ్ ఉన్నాయని, ఐదేళ్ల గడుస్తున్నా సమస్య పరిష్కారం కావడం లేదని, శేష జీవితం సంతోషంగా గడపవలసిన రిటైర్డ్ ఉద్యోగులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఆందోళన చెంది కొందరు మరణిస్తున్నారని తీవ్రమైన ఈ సమస్య పరిష్కారానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి ప్రత్యేక దృష్టి వహించి కేంద్ర కార్మిక శాఖ మంత్రితో చర్చించి వేగంగా సమస్య పరిష్కారం అయ్యేలా, వారికి రావలసిన బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంకు మంజూరైన ఐటిఐ కళాశాల త్వరలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే లేవనెత్తిన అంశాలకు కార్మిక శాఖ మంత్రి సమాధానమిస్తూ... కార్మికుల సమస్యల పరిష్కారానికి తప్పక చర్యలు తీసుకుంటామని అన్నారు.

నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా హ్యాక థాన్

నవతెలంగాణ-దుండిగల్

మైసమ్మగూడలోని నర్సింహరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఘనంగా జాతీయస్థాయి హ్యాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐఏఆర్ఈ ప్రొ.డా.పి.గోవర్ధన్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి సాంకేతికత ఆవశ్యకతను, కోడింగ్ ప్రాముఖ్యతను గురించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిగా తెలియజేశారు. నేటి సమాజంలో మనుగడ సాధించాలంటే సాంకేతికతను ఎప్పటికప్పుడు పెంపొందించుకోవాలన్నారు. హ్యాక థాన్‌లో భాగంగా వెబ్ డెవలప్మెంట్ కోడింగ్, గేమింగ్ ఆప్స్ ఐఓటి పై కళాశాలలో జాతీయస్థాయిలో పలు పోటీలు నిర్వహించగా పలు కళాశాలల నుండి అనేకమంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం ముఖ్య అతిథిని పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు



ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జె.నర్సింహరెడ్డి, కార్యదర్శి జె.త్రిశూల్ రెడ్డి, కోశాధికారి జె.త్రిలోక్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డా.లోకనాథం, కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం



- మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ ఆర్య వైశ్య సంఘం కమిటీ హాల్లో శ్రీ గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంను శనివారం మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంను ప్రారంభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. పేద ప్రజలకు సేవ చేసే సంఘాలకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని అన్నారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో స్థానిక డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, కమిటీ సభ్యులు కృష్ణ మోహన్, రమేష్ టీవీ9, సభ్యులు రుద్రావఝ్ఝల సంజీవరావు, చక్రధారి శ్రీరామ్ శర్మ, నిట్టల సుబ్రహ్మణ్యం, రాచపూడి ప్రభాకర్ శర్మ హరి రాఘవేంద్ర శర్మ, దుర్గ నాగ మోహన్, సీఎంఆర్ హాస్పిటల్ వీఆర్వో దుర్గాప్రసాద్, డాక్టర్లు ప్రవళిక, రియాజ్, మధు వైద్య బృందం పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటా

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ/కూకట్‌పల్లి

ఆపదలో ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కేపీహెచ్బి డివిజన్‌కు చెందిన నేతల కనకారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం తీసుకున్న అతని కుటుంబానికి పార్టీ నుంచి రూ.2లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా శనివారం ఎమ్మెల్యే రూ.2 లక్షల బీమా చెక్కును అతని భార్య ఝాన్సీకి క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రజలకు సీఎం కేసీఆర్ భరోసా కల్పిస్తున్నారన్నారు. ఇటువంటి గొప్ప నాయకుల నాయకత్వంలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.

విద్యార్థులకు సులభతర బోధన అవసరం

ఆర్.ఎస్.కె .పాఠశాలలో భవిష్యత్ విద్యావిధానంపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

భవిష్యత్తులో విద్యార్థులకు సులభతర విద్యాబోధన ఎంతో అవసరమని మారుతున్న కాలానికి అనుగుణంగా. ఆలోచన విధానం మెరుగుపడాలని మేడ్చల్ జిల్లా ట్రస్మా అధ్యక్షులు ఆర్.ఎస్.కె. పాఠశాల, చైర్మెన్, కరస్పాండెంట్ కే.రామేశ్వర్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. ఈ మేరకు శనివారం కుత్బుల్లాపూర్ సర్కిల్ బాపునగర్‌లో గల పాఠశాలలో 'భవిష్యత్తు విద్యా విధానం'పై నిర్వహించిన అవగాహన సదస్సు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావిధానంలో అనూహ్య మైన మార్పులు వచ్చాయని, . ఆ దిశగా విద్యార్థులు ఆలోచనా విధానానికి పదును పెట్టాలని తెలిపారు. ప్రస్తుతం విద్యా వ్యవస్థలో సాంకేతిక పద్ధతులు ఉపయోగిస్తూ, విద్యా బోధన ఏ విధంగా



నిర్వహిస్తున్నామో, అనే విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించారు. భవిష్యత్ లో రాబోయే జాతీయ విద్యా విధానం (ఎన్ ఈపి) (నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ)గురించి క్లుప్తంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎకడమిక్ డైరెక్టర్. కె.అరుణా రామేశ్వర్ రెడ్డి, కోఆర్డినేటర్ శోభ, ఉపాధ్యాయులు ఉష, నిర్మల, దేవేంద్ర, తోపాటు లీడ్ సంస్థ ప్రతినిధులు మురళీ, అభయ్, కృష్ణచైతన్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నగర సమస్యలపై నేటి నుంచి కాంగ్రెస్ 'సమర భేరి'

నగర పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి

నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో సమర భేరి నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ పీర్జాదీగూడ నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి అన్నారు.ఈ మేరకు ఆయన శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో నిర్వహిస్తున్న "హత్ సే హత్ జోడో" యాత్రలో భాగంగా ఫిబ్రవరి12 నుండి 23 వరకు కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో నగర పరిధిలోని ప్రతి గడపకు తిరిగి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసేలా ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. నగర ప్రజలు తమ కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని కోరారు.



డిగ్రీ కళాశాల ఏర్పాటు ప్రస్తావన తేకపోవడం విచారకరం

నవతెలంగాణ- మేడ్చల్



మేడ్చల్ డిగ్రీ కళాశాల ఏర్పాటు ప్రస్తావన తేకుండా అసెంబ్లీలో కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి జబర్దస్త్ జోకులు వేస్తూ సమయాన్ని వృధా చేశారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాథోడ్ సంతోష్ విమర్శించారు. శనివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ మేడ్చల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని అనేక సంవత్సరాల నుంచి విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు పోరాటాలు చేస్తున్న పాలకులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మేడ్చల్ మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని నియోజవర్గ ఎమ్మెల్యే, ప్రస్తుత కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల గురించి అసెంబ్లీలో మాట్లాడుతారేమోని వేయికళ్లతో, కోటి ఆశలతో ఎదురుచూసిన విద్యార్థులు, నియోజవర్గ ప్రజలు ప్రజా సమస్యల్ని మర్చిపోయరని అన్నారు. తన వ్యక్తిగత కళాశాల మల్లారెడ్డి విద్యాసంస్థల గురించి అసెంబ్లీలో మాట్లాడడం సిగ్గుచేటన్నారు. జిల్లాలోని నియోజకవర్గ ఎమ్మెల్యేలు తమ సమస్యల గురించి మాట్లాడుతుంటే మంత్రి మల్లారెడ్డి మాత్రం నియోజకవర్గ సమస్య గురించి ఒక మాట కూడా మాట్లాడకపోవడం ఆశ్చర్యకర అన్నారు.

హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

వ్యర్థాలను రీ సైకిలింగ్ చేసేందుకు ప్రజలు సహకరించాలని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్‌రావు అన్నారు. ఈ-వేస్ట్ ర్యాలీలో భాగంగా శనివారం డివిజన్ పరిధిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పాల్గొని లయన్స్ క్లబ్ సభ్యులు, విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ వారు నిర్వహించిన ఈ వేస్ట్ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడంతో ప్రజలు ఎలక్ట్రానిక్ వేస్ట్ ను పక్కన పెట్టారన్నారు. ఇటువంటి కార్యక్రమం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యులు రఘు జూలూరి, హరినారాయణ, కోటేశ్వరరావు, శ్రీనివాస్, వేణుగోపాల్, దేవేందర్, రవి కాంత్, పాఠశాల విద్యార్థులు, హైదర్ నగర్ డివిజన్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర దేవాదాయ శాఖ న్యాయ అధికారిగా అయిల కొమురయ్య

సన్మానించిన రాసాల కుమార్ యాదవ్

నవతెలంగాణ-బోడుప్పల్

రాష్ట్ర దేవాదాయ శాఖ న్యాయ అధికారిగా యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన సీనియర్ న్యాయవాది అయిల కొమురయ్య నియమితులయ్యారు. శనివారం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన సీనియర్ నాయకులు రాసాల కుమార్ యాదవ్ అయిల కొమురయ్యను శాలువాతో సన్మానించారు.

ఈ మేరకు రాసాల కుమార్ మాట్లాడుతూ ఆయన మరిన్ని పదవులు చేపట్టాలని కోరారు. గతంలో ఆయన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు న్యాయ అధికారిగా, సికింద్రాబాద్ కోర్టులో ఏజీపీగా తన విధులను నిర్వర్తించారు. సన్మానించిన వారిలో శారాజిపేట సర్పంచ్ బండ పద్మపర్వతాలు, ఐల దామోదర్, బండ మహేందర్, వార్డు సభ్యులు దూడల శ్రీధర్, తదితరులు ఉన్నారు.



విశ్వకర్మలు ఐక్యతతో ముందుకెళ్లాలి

విశ్వకర్మ సంఘం జాతీయ అధ్యక్షుడు అశ్విని కుమార్

నవతెలంగాణ-ఉప్పల్

విశ్వకర్మలు ఐక్య పోరాటాలు, ఐక్యమత్యంతో ముందుకు వెళ్లాలని తమ హక్కులను సాధించుకోవాలని విశ్వకర్మ సంఘం జాతీయ అధ్యక్షుడు అశ్విని కుమార్ అన్నారు. శనివారం ఉప్పల్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన అఖిలభారత విశ్వకర్మ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1968లో ప్రారంభమైన విశ్వకర్మ జాతీయ మహాసభ, విశ్వకర్మల చైతన్యానికి సంక్షేమానికి ఎంతో కృషి చేసింది అన్నారు. కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మల సంక్షేమం కోసం కౌశల్ సమ్మర్ పథకం ప్రకటించడం హర్షినియమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జాతీయ నాయకులు చిన్మయ చారి, సుభాష్ చంద్రబోస్, భాస్కర చారి, విజయ మోహన్ తదితరులు పాల్గొన్నారు

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరిక

జల్‌పల్లి మున్సిపాలిటీలో బీజేపీకి గట్టి షాక్

మంత్రి సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు.శనివారం మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని జల్‌పల్లి పురపాల సంఘం బిజెపికి పట్టుకొమ్మలా ఉన్న జల్ పల్లి మాజీ సర్పంచ్ కట్టెల రాములు మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. మంత్రి వారిని సాదరంగా ఆహ్వానించి కండువా కప్పి పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని కోరారు.అనంతరం యువ నాయకులు పట్లోళ్ల కౌశిక్ రెడ్డి మర్యాదపూర్వగా కలిశారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కట్టెల రాములు మాట్లాడుతూ మంత్రివర్యులు ఆదేశాలు శిరసా వహిస్తూ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని రాబోయే ఎన్నికల్లో మంత్రి సబితా ఇంద్రారెడ్డి విజయం కోసం కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జల్ పల్లి మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు సూరెడ్డి కృష్ణారెడ్డి, పురపాల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ జహంగీర్, .యంజాల జనార్ధన్ ,మైనార్టీ అధ్యక్షులు శ్రీ. షేక్ అఫ్జల్, నాయకులు,సీనియర్ నాయకులు సయీద్ పటేల్, సజీబ్ పటేల్, 16వ వార్డు అధ్యక్షులు పోలిముని నాగేష్ ముదిరాజ్, యువ నాయకులు యంజాల అర్జున్ సీనియర్ నాయకులు సూరెడ్డి గోపాల్ రెడ్డి , సత్తిరెడ్డి నాగేందర్ రెడ్డి, మైనార్టీ ఉపాధ్యక్షులు .ఎండి సాదిక్, నరసింహ ,దూడల అనూష్ గౌడ్, దానయ్య ,శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



శారీరక దృఢత్వానికి క్రీడలు చాలా అవసరం

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్ రెడ్డి

నవతెలంగాణ-బోడుప్పల్

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా చాలా అవసరమని క్రీడలతో విద్యార్థుల్లో శారీరక దృఢత్వం కలుగుతుందని పీర్జాదీగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు.పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఏవి ఇన్ఫో ప్రైడ్ గ్రౌండ్ నందు ప్రైవేట్ పెట్స్ ఆధ్వర్యంలో జరిగిన ప్రైవేటు పాఠశాలల కబడ్డీ మరియు కో-కో టోర్నమెంట్స్ ముగింపు వేడుకలలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి, పోచారం చైర్మన్ కొండల్ రెడ్డి పాల్గొని క్రీడా పోటీలలో ఉమ్మడి ఘటకేసర్ మండలానికి చెందిన పలు ప్రయివేటు పాఠశాలల నుండి 14 సంవత్సరాల లోపు,17 సంవత్సరాల లోపు బాల బాలికలు దాదాపు 60 జట్లు పాల్గొన్నాయి. ఉత్తమ ప్రదర్శనతో మొదటి, రెండవ, మూడవ స్థానంలో గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమని క్రీడలు ఆరోగ్యం, ఏకాగ్రతను పెంచడంతో పాటు శారీరక దృఢత్వానికి ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఇలాంటి క్రీడా పోటీలు ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. అనంతరం నిర్వాహకులు మేయర్ జక్క వెంకట్ రెడ్డి, పోచారం చైర్మన్ కొండల్ రెడ్డిలకు జ్ఞాపికలు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు పి.మల్లేష్, ఎన్.వినోద్,పి.భాస్కర్, ఎం.సుధాకర్, ఎన్.శ్రీనివాస్, బాబు,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



దేవాలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం

మేయర్ పారిజాత నర్సింహా రెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని ఉప్పగడ్డలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జగదాంబ దుర్గ భవాని దేవాలయం కోసం శనివారం కమిటీ సభ్యులు బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పారిజాత నర్సింహా రెడ్డి స్వగృహంలో ఆహ్వానం పత్రిక అందజేశారు. కమిటీ సభ్యుల అభ్యర్థన మేరకు ఆ దేవాలయ నిర్మాణం కోసం కమిటీ సభ్యులకు రూ.5,00,000 రూపాయల చెక్కును అందజేసిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నేనావత్ బాలు నాయక్, నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, సీతారాం నాయక్ సేవాలాల్ గుడి చైర్మన్, అంగోత్ కృష్ణ నాయక్ మాజీ సర్పంచ్, రతన్ నాయక్ మజీ సర్పంచ్, దేశ్య నాయక్, పాండు నాయక్ మజీ ఎంపీటీసీ, కాట్రావత్ కృష్ణ , లక్ష్మణ్ మాజీ ఎంపీటీసీ, అంగోత్ గోవిందా, ఘాన్సిరం నాయక్ , ఆనంద్ నాయక్ , నేనెవత్ గోవిందా పాల్గొన్నారు.

కష్టంతో కాకుండా.. ఇష్టంతో చదవండి

సైకాలజిస్టులు



నవతెలంగాణ - మీర్‌పేట్

కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే విజయం మీ బానిస అవుతుందని ప్రముఖ సైకాలజి స్టులు కృష్ణ భరత్, ఫణి పవన్ లు అన్నారు. శనివారం జిల్లెలగూడ లోని లార్డ్స్ హై స్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్ష రాసే విధానంలో తప్పులు దొరలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పరీక్షలు రాసేటప్పుడు ఎన్ని ఒత్తిళ్ళు ఎదురైనా ధైర్యంగా తట్టుకోవాలని తెలిపారు. తమకు ఏదిరాదని నిరుత్సాపడకుండా ప్రయత్నం చేయడమే ఉత్తమమైన విద్యార్థి లక్షణమని అన్నారు. సమయపాలన పాటిస్తూ ప్రశ్నలను అర్థం చేసుకుంటూ ప్రశాంతతతో పరీక్షలు రాసే ప్రయత్నం చేయాలని పేర్కొన్నారు. వితః కార్యక్రమంలో డైరెక్టర్ సిద్దాల శ్రీలత, వాగ్దేవి జూనియర్ కాలేజ్ డైరెక్టర్లు రవికుమార్, నర్సింహారెడ్డి, లార్డ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో విజయ్ మండపాక నమోదు



నవతెలంగాణ-కల్చరల్

ప్రముఖ గాయకుడు విజయ్ మండపాక ఆరు భాషలలో 11 గంటల పాటు 111 సినీ గీతాలను ఆలపించి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ రికార్డ్స్‌లను సొంతం చేసుకున్నారు. సర్గం సంస్థ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో 12 గంటల పాటు నిర్విరామ సినీ సంగీత విభావరి శ్రీ త్యాగరాయ గాన సభలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక అధికారి వనం జ్వాలా నరసింహా రావు, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇండియా కోఆర్డినేటర్ డాక్టర్ బింగి నరేందర్ గౌడ్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్ తెలంగాణ కోఆర్డినేటర్ టి. సుభాషిని పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బింగి నరేందర్ గౌడ్ మాట్లాడుతూ.. ఆరు భాషలలో 11 గంటల పాటు నిర్విరామంగా 111 పాటలను ఆలపించడం విలక్షణమైన ప్రక్రియగా గుర్తించి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ రికార్డ్స్ ను గాయకుడు విజయ మండపాకకు అందించినట్లు ప్రకటన చేశారు. ఎంతోమంది ప్రముఖులకు వండర్ బుక్ ఆఫ్ రికార్డులు అందజేసినట్లు చెప్పారు. గాయకుడు విజయ్ మండపాక నిర్వహణలో గాయనీమనులు నీరజ, తమన్నా, స్వాతి, అనూష, భారతి జ్యోతిక ఆలపించిన గీతాలు అలరించాయి. కార్యక్రమంలో మయూరి ఆర్ట్స్ చైర్ పర్సన్ రాధా పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పోరాటాల ద్వారా పరిష్కరిస్తాం

- శేరిలింగంపల్లి బీజేపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే గజ్జల యోగానంద్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రజా సమస్యలను మా పోరాటాల ద్వారా త్వరలో పరిష్కరిస్తామని శేరిలింగంపల్లి బీజేపీ పార్టీ కాంటెస్ట్ డ్ ఎమ్మెల్యే గజ్జల యోగానంద్ ప్రజలకు హామీ ఇచ్చారు. శనివారం శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని హైదర్ నగర్ డివిజన్ ప్రశాంతి నగర్ లో ప్రజా సమస్యలపై ఆయన పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులని స్వయంగా ఆయన పరిశీలించారు. ముఖ్యంగా డ్రైనేజ్ , తాగు నీటి సమస్యతో పాటు ప్రశాంతి నగర్ మెయిన్ రోడ్డులో ఇరుకుగా ఉండడం ద్వారా ట్రాఫిక్ నిలిచి పోయి వాహనదారులకు , పాదచారుల రాకపోకలకు ఇబ్బంది కరంగా మారుతుందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకవచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ప్రశాంతినగర్లో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు, డివిజన్ కార్పొరేటర్, ఎమ్మెల్యే పట్టించుకోని పరిస్థితి నెలకొందన్నారు. ప్రశాంతి నగర్ కబ్జాలకు అడ్డాగా మారింది అని, ఎక్కడ పడితే అక్కడ ప్రభుత్వ స్థలాలను, ఖాళీగా ఉన్నా ప్రైవేట్ స్థలాలను స్థానిక తెరాసా నాయకులు కబ్జా చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారన్నారు. అధికార పార్టీ నాయకుల స్థలాలు ఉండడంతో రోడ్ విస్తరణకు వారు అనుమతులు ఇవ్వకుండా ఆపుతున్నారన్నారు. తెలంగాణ వచ్చి ఇన్ని ఏళ్ల అవుతున్నా రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థ, తాగు నీరు, విద్యుత్ సమస్యలు కనీసం పరిష్కారానికి నోచుకోవడంలేదన్నారు. వెంటనే ప్రజల సమస్యలను పరిష్కరించాల న్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్‌రెడ్డి, వీరయ్యచారి, విజిత్ వర్మ, నవీన్‌గౌడ్, రత్నకుమార్, కృష్ణంరాజు, లక్ష్మీనారాయణ, భరత్‌కుమార్, రాజశేఖర్, మురహరి నాగరాజు, రవికిరణ్, భ్రమయ్య కోటేశ్వరావు, రవికిరణ్, పి.శ్రీనివాస్, వేణుగోపాల్ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.




హైదరాబాద్ గ్రాండ్ ప్రీ ఈ రేసులో దూసుకెళ్తున్న కార్లు
పోడియంపై జీన్ ఎరిక్, నిక్ కాసిడి, అంటోనియో ఫెలిక్స్
ఫొటో కెవిన్. హరి

ఈ రేసు అదిరింది

- హైదరాబాద్ గ్రాండ్ ప్రీ సూపర్‌హిట్
- జీన్ ఎరిక్ వేన్‌కు గ్రాండ్ ప్రీ టైటిల్
- దుమ్మురేపిన ఎలక్ట్రిక్ కార్ల రేసింగ్

భారత మోటార్‌స్పోర్ట్స్‌లో నూతన అధ్యాయం. ఎఫ్ఐఏ ఫార్ములా1 స్థాయి రేసింగ్ ఈవెంట్‌కు హైదరాబాద్ అద్భుత ఆతిథ్యం ఇచ్చింది. ఏబీబీ ఎఫ్ఐఏ ఈ రేసు భారత్‌లో తొలి అంకం పూర్తి చేసుకుంది. 25 వేల మంది అభిమానుల నడుమ, హుస్సేన్‌సాగర్ తీరంలో 2.835 కిలోమీటర్ల రేసింగ్ ట్రాక్‌పై ఎలక్ట్రిక్ రేసింగ్ దిగ్గజ కార్లు దూసుకుపోయాయి. సుమారు 300 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లిన కార్లు ఆద్యంతం మోటార్‌స్పోర్ట్స్ అభిమానులను అలరించాయి. సూపర్‌హిట్‌గా నిలిచిన హైదరాబాద్ గ్రాండ్ ప్రీ రేసు టైటిల్‌ను జీన్ ఎరిక్ వేన్ అందుకున్నాడు.

నవతెలంగాణ-హైదరాబాద్

ఎఫ్ఐఏ రేసింగ్ చిత్రపటంలో హైదరాబాద్ చోటు సాధించింది. అరంగేట్ర సీజన్‌లో అద్వితీయ రీతిలో ఫార్ములా-ఈ రేసు నిర్వహణతో మోటార్‌స్పోర్ట్స్ ప్రపంచాన్ని విశేషంగా ఆకట్టుకుంది. తక్కువ సమయం, 18 మలుపులు, రెండు స్లో కార్నర్‌లు, ఓ హెయిర్‌పిన్ బెండ్‌తో కూడిన కఠిన ట్రాక్‌పై ఎఫ్ఐఏ ఫార్ములా-ఈ కార్లు పూర్తి స్థాయిలో దూసుకెళ్లగలవా? అనే సందేహాలు శనివారం ప్రధాన రేసుతో పటాపంచలయ్యాయి. 11 జట్ల నుంచి 22 మంది డ్రైవర్లు టాప్ స్పీడ్‌లో ట్రాక్‌పై అదరగొట్టారు. ఏబీబీ ఎఫ్ఐఏ ఫార్ములా-ఈ ప్రపంచకప్ చాంపియన్‌షిప్ నాల్గో రేసు హైదరాబాద్‌లో ఘనంగా ముగిసింది. హైదరాబాద్ గ్రాండ్ ప్రీ విజేతగా జీన్ ఎరిక్ వేన్ (డిఎస్ పెన్‌స్కే) విజేతగా నిలిచాడు. టిసిఎస్ జాగ్వార్ జట్టు, ఎవాన్స్ పోల్ పోజిషన్‌తో సరిపెట్టుకున్నారు.

జీన్ ఎరిక్ వేన్ జోరు

ఫ్రెంచ్ రేసర్ జీన్ ఎరిక్ వేన్ (డిఎస్ పెన్‌స్కే)హైదరాబాద్ స్ట్రీట్‌సర్క్యూట్ చాంపియన్‌గా నిలిచాడు. పోల్ పొజిషన్ కోసం జరిగిన అర్హత రౌండ్, క్వార్టర్‌ఫైనల్స్, సెమీఫైనల్స్ (డ్యూయెల్స్) సహా ఫైనల్స్‌లోనూ సత్తా చాటిన ఫ్రెంచ్ డ్రైవర్.. ప్రధాన రేసులోనూ అదే జోరు కనబరిచాడు. ఫార్ములా-ఈ సీజన్ 7 చాంపియన్‌గా నిలిచిన జీన్ ఎరిక్ వేన్.. ఆ తర్వాత తొలిసారి ఓ రేసులో విజేతగా నిలిచాడు. హైదరాబాద్ గ్రాండ్ ప్రీ రేసుకు నం.2 పొజిషన్‌తో ట్రాక్‌పైకి వచ్చిన జీన్ ఎరిక్ వేన్.. నిజానికి టైటిల్ సాధిస్తాడనే అంచనాలు తక్కువగా ఉన్నాయి. జాగ్వార్ డ్రైవర్ మిచ్ ఎవాన్స్ (న్యూజిలాండ్) పొడియం పొజిషన్ జోరుతో రేసులో ఆరంభం నుంచీ ముందంజలో నిలిచాడు. కానీ 15వ ల్యాప్‌లో ముందుకు దూసుకొచ్చిన జీన్ ఎరిక్ వేన్ అక్కడ్నుంచి వెనక్కి తగ్గలేదు. ఎన్విషన్ రేసింగ్ డ్రైవర్ నిక్ కాసిడి (న్యూజిలాండ్) రెండో స్థానంలో నిలిచి జీన్ ఎరిక్‌ను వెంబడించాడు. ఓ దశలో జీన్ ఎరిక్ వేన్ బ్యాటరీ సామర్థ్యం సున్నాకు చేరువైంది. ఆ సమయంలో నిక్ కాసిడి మరో 4 శాతం బ్యాటరీ సామర్థ్యంతో ఉన్నాడు. ఈ పరిస్థితుల్లో జీన్ ఎరిక్ వేన్ రేసును ముగించటం అసాధ్యమే అనిపించింది. కానీ అనుభవంతో అసమాన నైపుణ్యం ప్రదర్శించిన జీన్ ఎరిక్ వేన్.. ఫార్ములా-ఈ చరిత్రలోనే చిరస్మరణీయ ముగింపు సాధించాడు. రేసును వేగంగా ముగించాలనే తొందరపాటులో అదనపు బ్యాటరీ సామర్థ్యం వినియోగించకుండా, అదే సమయంలో రేసులో ఏమాత్రం వెనుకంజలో నిలువకుండా జాగ్రత్త వహించాడు. అందుబాటులో ఉన్న బ్యాటరీ సామర్థ్యంతో చాకచక్యంగా రేసును ముగించి మోటార్‌స్పోర్ట్స్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురి చేశాడు. ఎన్విషన్ రేసింగ్ డ్రైవర్ సెబాస్టియన్ బుయేమి తొలుత మూడో స్థానంలో నిలిచాడు. కానీ అతడు బ్యాటరీ నిబంధనలు అతిక్రమించటంతో ఎఫ్ఐఏ అధికారులు అతడిపై 17 సెకండ్ల పెనాల్టీ విధించారు. దీంతో మూడో స్థానంలో నిలిచిన సెబాస్టియన్ ఏకంగా 15వ స్థానానికి పడిపోయాడు.

ఎవాన్స్‌కు పోల్ పొజిషన్

ఇక ఉదయం సెషన్‌లో పోల్ పోజిషన్ కోసం జరిగిన రేసులో జాగ్వార్ టీసీఎస్ రేసింగ్ జట్టు అగ్రస్థానంలో నిలిచింది. జాగ్వార్ టీసీఎస్ డ్రైవర్ మిచ్ ఎవాన్స్ ఓ



ల్యాప్‌ను 01.13.228 సెకండ్లలో ముగించి పోల్ పోజిషన్ సాధించాడు. పోల్ పొజిషన్‌తో మిచ్ ఎవాన్స్ మూడు పాయింట్లు దక్కించుకున్నాడు. ఫైనల్లో జీన్ ఎరిక్ వేన్ (ఫ్రాన్స్) సెకన్‌లో 0.21 వంతు తేడాతో ఎవాన్స్‌కు పోల్ పొజిషన్ కోల్పోయాడు. అర్హత రౌండ్ గ్రూప్-ఏలో మిచ్ ఎవాన్స్, సచా (నిసాన్), బుయేమి (ఎన్విషన్), మాక్సిమిలన్ (మసరేటి)లు డ్యుయెల్స్‌కు చేరుకున్నారు. గ్రూప్-బిలో రెనె రాస్ట్ (మెక్‌లారెన్), జీన్ ఎరిక్ వేన్, శామ్ బర్డ్ (జాగ్వార్), మోర్టారా (మసరేటి)లు డ్యుయెల్స్‌కు అర్హత సాధించారు. ఆతిథ్య మహీంద్రా రేసింగ్ జట్టు ఎవరూ డ్యుయెల్స్‌కు అర్హత సాధించలేదు.



జాగ్వార్‌కు గట్టి దెబ్బ

హైదరాబాద్ గ్రాండ్ ప్రీ అర్హత రౌండ్ అనంతరం జాగ్వార్ టీసీఎస్ రేసింగ్ జట్టు ఫేవరేట్‌గా కనిపించింది. ప్రధాన రేసును ఆ జట్టు డ్రైవర్లు మిచ్ ఎవాన్స్ (నం. 1), శామ్ బర్డ్ (నం.6) పొజిషన్లలో మొదలెట్టారు. హైదరాబాద్ ట్రాక్‌పై మిచ్ ఎవాన్స్ ఎదురులేని జోరుతో కనిపించాడు. 15వ ల్యాప్ సమయంలో మిచ్ ఎవాన్స్ కారును సహచర జాగ్వార్ డ్రైవర్ శామ్ బర్డ్ ఢీకొట్టాడు. అమరవీరుల మ్యూజియం వద్ద మలుపు దగ్గర (టర్న్ నం.4) రెట్టించిన వేగంతో దూసుకెళ్లే ప్రయత్నం చేసిన శామ్ బర్డ్ ఆ క్రమంలో ముందున్న మిచ్ ఎవాన్స్ కారును టాప్ స్పీడ్‌తో ఢీకొట్టాడు. దీంతో రేసులో నిలిచిన రెండు జాగ్వార్ కార్లు పక్కనకు తప్పుకున్నాయి. ఈ ఘటనతో మసరేటి, నిసాన్ రేసింగ్ జట్ల కార్లు సైతం అక్కడే నిలిపోయాయి. మిచ్ ఎవాన్స్, శామ్ బర్డ్స్ సహా ఫెనెస్ట్రాజ్, స్టొఫెల్ వాండోర్నెలు మళ్లీ రేసు బరిలోకి దిగలేదు. జాగ్వార్ కార్లు ఢీకొట్టిన సమయంలో మిచ్ ఎవాన్స్ రేసులో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. పోడియం ఫినిషింగ్ ఖాయం అనుకున్న తరుణంలో జాగ్వార్ స్వీయ తప్పిదంతో దారుణంగా దెబ్బతింది. ఎవాన్స్‌ను ఢీకొట్టిన అనంతరం 'నన్ను క్షమించండి' అని శామ్ బర్డ్ బాధపడ్డాడు.

46 నిమిషాల్లో 90.72కిలోమీటర్లు


హైదరాబాద్ గ్రాండ్ ప్రీ రేసు ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. 2.835 కిలోమీటర్ల స్ట్రీట్‌సర్క్యూట్ ట్రాక్‌పై 11 జట్ల నుంచి 22 మంది డ్రైవర్లు 32 రౌండ్లు (ల్యాప్‌లు) దూసుకెళ్లారు. 18 మలుపులతో కూడిన ట్రాక్‌పై అవాంతరాలు సైతం అదేరీతిలో ఎదురయ్యాయి. కొన్నిసార్లు సేఫ్టీ కారు సైతం ట్రాక్‌పైకి వచ్చింది. దీంతో పలు రౌండ్లలో కార్లు వేగం తగ్గించుకున్నాయి. గ్రాండ్ ప్రీ విజేతగా నిలిచిన జీన్ ఎరిక్ వేన్ (న్యూజిలాండ్) 46.01.099 సెకండ్లలో రేసును పూర్తి చేశాడు. ఎన్విషన్ రేసింగ్ డ్రైవర్ నిక్ కాసిడి (న్యూజిలాండ్) 46.01.499 సెకండ్లతో రెండో స్థానంలో నిలువగా.. అంటోనియో ఫెలిక్స్ (డిఏ కొలిస్టా) 46.02.958 సెకండ్లతో మూడో స్థానం సాధించాడు. మహీంద్రా రేసింగ్ డ్రైవర్లు ఒలివర్ రోలాండ్ 46.08.237 సెకండ్లతో ఆరో స్థానంలో నిలువగా.. లుకాస్ డి గ్రాసీ (బ్రెజిల్) 14వ స్థానంలో నిలిచి ఒక్క పాయింట్‌ను సాధించలేకపోయాడు.


పోటెత్తిన అభిమానులు

హైదరాబాద్ గ్రాండ్ ప్రీ రేసుకు అభిమానులు పోటెత్తారు. ఇండియన్ రేసింగ్ లీగ్ (ఐఆర్ఎల్) నిర్వహణ అనుభవంతో ఫార్ములా-ఈ రేసుకు నిర్వాహకులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ట్రాక్ పొడవునా అభిమానులకు స్టాండ్స్ ఏర్పాటు చేశారు. 25 వేల మంది అభిమానులు చూస్తుండగా హైదరాబాద్ గ్రాండ్ ప్రీ గ్రాండ్ సక్సెస్ సాధించింది.

సచిన్, చరణ్ సందడి

ఫార్ములా-ఈ హైదరాబాద్ గ్రాండ్ ప్రీకి ప్రముఖులు తరలివచ్చారు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, సినీ నటుడు రామ్‌చరణ్‌లు రేసులో ప్రధాన ఆకర్షణగా నిలిచారు. క్రికెటర్లు శిఖర్ ధావన్, దీపక్ చాహర్, యుజ్వేంద్ర చాహల్‌లు రేసు తిలకించారు. అక్కినేని సోదరులు నాగచైతన్య, అఖిల్‌లు, సిద్దు జొన్నలగడ్డ, శృతి హాసన్ వీవీఐపీ లాంజ్ నుంచి ఫార్ములా-ఈ రేసును వీక్షించారు.


హైదరాబాద్ గ్రాండ్ ప్రీ టైటిల్‌తో జీన్ ఎరిక్


మన ట్రాక్..యమ స్పీడ్!





ఏబీబీ ఎఫ్ఐఏ ఫార్ములా-ఈ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఇది తొమ్మిదో సీజన్. ఈ ఏడాది సీజన్‌లో హైదరా బాద్ గ్రాండ్ ప్రీ నాల్గో రేసు. మెక్సికో తొలి రేసు జరుగగా.. సౌదీ అరేబియా (దిరియా)లో 2, 3 రేసులు నిర్వహించారు. తొలి మూడు రేసులతో పోల్చితే హైదరాబాద్ ట్రాక్‌పైనే డ్రైవర్లు టాప్ స్పీడ్‌తో దూసుకెళ్లారు. మెక్సికో ట్రాక్ 2.63 కిలోమీటర్లు ఉండగా, 19 టర్న్‌లు ఉన్నాయి. 2.49 కిలోమీటర్ల దిరియా ట్రాక్‌పై 21 టర్న్‌లు ఉన్నాయి. మెక్సికో రేసు విజేత 32 ల్యాప్‌లను 58.25.974 సెకండ్లలో పూర్తి చేయగా.. దిరియా రేసులు వరుసగా 47.45.911, 50.40.304 సెకండ్లలో ముగిశాయి. హైదరాబాద్ ట్రాక్ 2.835 కిలోమీటర్ల పొడవు. ఇందులో 18 టర్న్‌లతో పాటు రెండు స్లో కార్నర్‌లు, ఓ హెయిర్‌పిన్ బెండ్ ఉన్నాయి. ఈ ట్రాక్‌పై ప్రధాన రేసు 46.01.099 సెకండ్లలోనే ముగిసింది. దీంతో ఫార్ములా-ఈ సీజన్‌లో హైదరాబాద్ స్ట్రీట్ సర్క్యూట్ ట్రాక్ యమ స్పీడ్ ట్రాక్‌గా నిలిచింది.



మూడు రోజుల్లోనే ముగించారు

- తొలి టెస్టులో ఇన్నింగ్స్ 132 పరుగుల తేడాతో భారత్ గెలుపు
- ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ 91/10
- భారత్ తొలి ఇన్నింగ్స్ 400/10



నవతెలంగాణ-నాగ్‌పూర్

జామ్తాలో టీమ్ ఇండియా జాతర. అటు బ్యాట్‌తో, ఇటు బంతితో ఎదురులేని ప్రదర్శన చేసిన భారత్.. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ తొలి టెస్టులో ఆస్ట్రేలియాపై తిరుగులేని విజయం నమోదు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 400 పరుగుల భారీ స్కోరు సాధించిన టీమ్ ఇండియా.. ఆస్ట్రేలియాను వరుసగా 177, 91 పరుగులకే కుప్పకూల్చింది. ఇన్నింగ్స్ 132 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. కెప్టెన్ రోహిత్ శర్మ, స్పిన్నర్లు రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ అసమానంగా రాణించటంతో నాగ్‌పూర్ టెస్టులో గెలుపొందిన భారత్ సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. ఏడు వికెట్లు సహా విలువైన అర్థ సెంచరీ సాధించిన రవీంద్ర జడేజా 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. సిరీస్‌లో రెండో టెస్టు ఫిబ్రవరి 17 నుంచి న్యూఢిల్లీలో జరుగనుంది.

అశ్విన్ మాయ

తొలి ఇన్నింగ్స్‌లో 232 పరుగుల భారీ తొలి ఇన్నింగ్స్ లోటుతో బ్యాటింగ్‌కు వచ్చిన ఆస్ట్రేలియాకు అశ్విన్ చుక్కలు చూపించాడు. తొలి సెషన్‌లో భారత్ దండిగా పరుగులు కొట్టగా.. రెండో సెషన్‌లో బౌలర్లు జోరుగా వికెట్లు కూల్చారు. ఆఫ్ స్పిన్నర్ వరుసగా బ్యాటర్లను పెవిలియన్‌కు చేర్చాడు. ఖవాజ (5), డెవిడ్ వార్నర్ (10), రెన్షా (2), హ్యాండ్స్‌కాంబ్ (6), అలెక్స్ (10)లను అవుట్ చేసిన అశ్విన్ ఐదు వికెట్ల ఘనత అందుకున్నాడు. రవీంద్ర జడేజా, మహ్మద్ షమి సైతం వికెట్ల వేటలో చెలరేగటంతో 32.3 ఓవర్లలోనే ఆస్ట్రేలియా కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్ లోటును సైతం పూడ్చలేని ఆస్ట్రేలియా తొలి టెస్టులో ఇన్నింగ్స్ పరాజయం చవిచూసింది. భారత్‌తో టెస్టుల్లో ఆసీస్‌కు రెండో అత్యల్ప స్కోరు. స్టీవ్ స్మిత్ (25 నాటౌట్, 51 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) అజేయంగా నిలిచాడు.

అక్షర్, షమి దూకుడు

ఓవర్‌నైట్ స్కోరు 321/7తో మూడో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన భారత్ విలువైన పరుగులు జోడించింది. తొలి సెషన్ పూర్తిగా ఆడిన భారత్ మరోసారి బ్యాటింగ్‌కు రాకుండా చూసుకుంది. యువ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ (84, 174 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్) ఆకట్టుకున్నాడు. రవీంద్ర జడేజా (70) ఆరంభంలోనే నిష్క్రమించినా.. మహ్మద్ షమి (37)తో కలిసి అక్షర్ మంచి భాగస్వామ్యం నిర్మించాడు. మహ్మద్ సిరాజ్ (1 నాటౌట్, 19 బంతుల్లో) చక్కగా సహకరించాడు. 139.3 ఓవర్లలో 400 పరుగులకు భారత్ ఆలౌటైంది. ఆసీస్ యువ స్పిన్నర్ టాడ్ మర్ఫీ (7/124) ఏడు వికెట్లు పడగొట్టాడు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : 177/10 (లబుషేన్ 49, స్మిత్ 37, అలెక్స్ 36, జడేజా 5/47, అశ్విన్ 3/42)

భారత్ తొలి ఇన్నింగ్స్ : 400/10 (రోహిత్ శర్మ 120, అక్షర్ పటేల్ 84, రవీంద్ర జడేజా 70, టాడ్ మర్ఫీ 7/124)

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ : 91/10 (స్మిత్ 25, లబుషేన్ 17, అశ్విన్ 5/37, జడేజా 2/34, షమి 2/13)

నేడు మల్లయుద్ధ రెజ్లింగ్ ఫైనల్స్



హైదరాబాద్ : ముఖేశ్ గౌడ్ స్మారక 'మల్లయుద్ధ' రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. ఎల్బీ స్టేడియంలో మూడు రోజుల పాటు సాగుతున్న మల్లయుద్ధ పోటీల్లో నేడు అన్ని విభాగాల్లో ఫైనల్స్ జరుగనున్నాయి. పురుషుల 55 కేజీలు, 60 కేజీలు, 66 కేజీలు, 74 కేజీలు, 87 కేజీలు సహా 100 కేజీలు, 120 కేజీల విభాగాల్లో పోటీలు శనివారం ఆకట్టుకున్నాయి. రాజ్యసభ సభ్యుడు డా.కె లక్ష్మణ్ శనివారం కుస్తీ పోటీల సెమీఫైనల్స్‌ను ప్రారంభించారు. 'తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించేలా ప్రోత్సహించాలి. అప్పుడే క్రీడా భారత్ సాధ్యపడుతుంది. ముఖేశ్ గౌడ్ స్మారకార్థం రూ.35 లక్షల నగదు బహుమతితో రెజ్లింగ్ పోటీలు నిర్వహించటం సంతోషం. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న శ్రేష్ఠ ఫౌండేషన్ వ్యవస్థాపకులు విక్రమ్ గౌడ్‌కు అభినందనలు' అని లక్ష్మణ్ తెలిపారు. 17 విభాగాల్లో 700 మంది రెజ్లర్లు పోటీపడుతున్న మల్లయుద్ధ చాంపియన్‌షిప్స్‌లో మహిళలకు సైతం ప్రత్యేకంగా పోటీలు నిర్వహిస్తున్నారు.

నవచిత్రం

ఈనెల 18న రిలీజ్


కిరణ్ అబ్బవరం

అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పిక్చర్స్ బ్యానర్ పై తెరకెక్కుతున్న సినిమా 'వినరో భాగ్యము విష్ణు కథ'. బన్నీ వాసు నిర్మాత. 'భలే భలే మగాడివోయ్, గీత గోవిందం, టాక్సీవాలా, ప్రతిరోజూ పండగే, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్, 18 పేజెస్' లాంటి అద్భుతమైన చిత్రాల తర్వాత జీఏ2 పిక్చర్స్ బ్యానర్లో వస్తున్న సినిమా కావడంతోపాటు ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజైన సాంగ్స్, టీజర్‌తోపాటు లేటెస్ట్‌గా రిలీజ్ చేసిన ట్రైలర్ ఈ సినిమాపై అంచనాలను మరింత హైప్‌కి తీసుకెళ్ళాయి. నెంబర్ నైబరింగ్ కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ చిత్రం కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు.

మహాశివరాత్రి కానుకగా ఈనెల 18న ఈ సినిమా థియేటర్స్‌లో భారీగా విడుదల కానుంది. ఇటీవలే ఈ చిత్రం సెన్సార్ సభ్యుల మన్ననలు పొంది యు/ఎ సర్టిఫికెట్ పొందింది.

మురళీ కిషోర్ అబ్బూరు దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ సినిమాలో కిరణ్ అబ్బవరం, కశ్మీరా జంటగా నటించారు.


హ్రిదు హరూన్

మెప్పించే కోనసీమ థగ్స్

డాన్స్ మాస్టర్ బృందా గోపాల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'థగ్స్'. తెలుగులో 'కోనసీమ థగ్స్' పేరుతో విడుదల అవుతున్న ఈ చిత్రాన్ని భారీ చిత్రాల నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ శిబు తమీన్స్ కుమార్తె రియా షిబు హెచ్ ఆర్ పిక్చర్స్ బ్యానర్ పై సమర్పిస్తూ, జీయో స్టూడియోస్‌తో కలిసి నిర్మిస్తున్నారు. తమీన్స్ కుమారుడు హ్రిదు హరూన్ హీరోగా పరిచయం అవుతుండగా సింహ, ఆర్ కె సురేష్, మునిష్కంత్, శరత్ అప్పనీ, అనస్వర రాజన్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.

తాజాగా ఈ చిత్రంలోని మొదటి వీడియో సాంగ్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. 'వీర శూర మహంకాళి వస్తోందయ్యా...' అంటూ సాగే ఈ పాట చిత్రంలో కీలక సన్నివేశంలో రానుంది. అమ్మవారు పూనినట్లుగా హీరో హృదు చేసిన నృత్యం ఆకట్టుకుంటోంది. దీనికి శామ్‌సిఎస్ ఎనర్జిటిక్ ట్యూన్ ఇవ్వగా, వనమాలి చెడును అంతమొందించే క్రోధాన్ని తెలిసేలా లిరిక్స్ అందించారు. కాలభైరవ అద్భుతంగా ఆలపించారు. ప్రియేష్ గురుస్వామి తన సినిమాటోగ్రఫీతో డివైన్ వైబ్‌ను తీసుకురాగలిగారు. ఈ పాట విడుదలైన కాసేపట్లోనే అద్భుత స్పందనతో ట్రెండింగ్‌లోకి రావడం విశేషం. ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషలలో ఈనెలలోనే భారీ స్థాయిలో విడుదలకు సిద్ధం అవుతోంది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

పాక్‌లో నిరసనల హోరు

నింగినంటుతున్న నిత్యావసరాల ధరలు

- సంక్షోభంతో సామాన్యుల వెతలు



ఇస్లామాబాద్ : ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్తాన్‌లో నిత్యావసరాల ధరలు అమాంతం పెరగడంతో.. అక్కడి ప్రజలు బతకడం కష్టమై ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారం రోజులుగా నిరసనలు పెద్ద ఎత్తున కొనసాగిస్తున్నారు. అనేక నగరాల్లో ప్రజలు వీధుల్లోకి వచ్చి ఆందోళన చేపడుతున్నారు. ఇటీవల కాలంలో రుణాలు తీసుకుంటూ శ్రీలంక కొంతమేర ఆర్థికంగా పుంజుకుంటున్నా.. పాకిస్తాన్ మాత్రం ఆ దేశం నుంచి ఇంకా గుణపాఠాలు నేర్చుకోకపోవడం శోచనీయం. పాకిస్తాన్ ఆర్థిక మాంద్యం నుంచి పుంజుకోవడానికి రుణాలను తీసుకున్నా.. వాటిని తిరిగి చెల్లించలేక అవస్థలు పడుతోంది. దాదాపు ప్రపంచంలోనే రుణ ఎగవేతకు దగ్గరలో ఉన్న అత్యధిక జనాభా కలిగిన దేశాల్లో పాకిస్తాన్ ఐదో దేశంగా నిలవనుందని కొన్ని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం పాకిస్తాన్‌లో ద్రవ్యోల్బణం 48 ఏళ్ల గరిష్టానికి చేరింది. దీంతో అక్కడి ప్రజల జీవనం కష్టతరమౌతుంది. ఇక గతేడాది వరదల ప్రభావం అక్కడి ప్రజల పైనా, ఆర్థిక వ్యవస్థపైనా ఇప్పటికీ కొనసాగుతోంది. ఆర్థిక వ్యవస్థ పుంజుకునేందుకు ఈ వారంలో పాక్ ప్రభుత్వం ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ నుండి 6.5 బిలియన్ డాలర్ల రుణం కోసం ప్రయత్నించినప్పటికీ ఆ ప్రయత్నాలు ఫలించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఏడాదిలో జరగబోయే నేషనల్ అసెంబ్లీ ఎన్నికలు గందరగోళంగా మారే అవకాశముందని మీడియా వర్గాలు పేర్కొన్నాయి.

గతంలో ప్రధానిగా ఉన్న ఇమ్రాన్ కానీ, ఇప్పుడున్న షెహబాజ్ షరీఫ్‌లు కానీ పాక్ అభివృద్ధి దిశగా ప్రయత్నాలు చేయకపోవడం ప్రజలు నిశితంగా గమనిస్తూనే ఉన్నారని ప్రముఖ మీడియా ఛానెల్ బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. ఆర్థికంగానూ, రాజకీయంగానే కాదు.. అక్కడ ఉగ్రవాదం కూడా పెచ్చరిల్లడం ఆ దేశాభివృద్ధికి పెను సమస్యగా దాపురించింది. ఇటీవల పెషావర్ నగరంలోని మసీదులో జరిగిన ఆత్మాహుతి దాడివల్ల దాదాపు 100 మందికిపైగా మృతి చెందారు.

ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో అక్కడి ప్రజల పరిస్థితులు ఎలా ఉన్నాయని తెలుసుకోవడానికి బ్లూమబర్గ్ అనే న్యూస్ ఛానెల్ పాకిస్తానీయులను పలకరించింది. ఈ ఛానెల్‌తో మొహమ్మద్ రషీద్ అనే ఓ రెస్టారెంట్ యజమాని మాట్లాడుతూ... 'పెరుగుతున్న ధరల ద్రవ్యోల్బణం వల్ల స్థానిక వ్యాపారాలు బాగా దెబ్బతిన్నాయి. ఈ శీతాకాలంలో తన రెస్టారెంట్‌లో సీ ఫుడ్స్ 50 శాతం మేర విక్రయాలు తగ్గాయి. ధరలు పెరగడం వల్ల మధ్యతరగతి కస్టమర్లు సీ ఫుడ్‌కి దూరంగా ఉంటున్నారు.' అని అన్నారు.

ఇక గ్యాస్ స్టేషన్ మేనేజర్ ఇర్ఫాన్ అలీ బ్లూమ్‌బర్గ్ ఛానెల్‌తో మాట్లాడుతూ.. 'ప్రభుత్వం గత నెలలో పెట్రోల్ ధర పెంచింది. ప్రస్తుతం లీటర్ పెట్రోల్ ధర 262గా ఉంది. దీంతో ప్రయాణీకులు.. తమ ప్రయాణలను తగ్గించుకుంటున్నారు. లీటర్ పెట్రోల్ ధర రూ.200 ఉన్నప్పుడు 15 వేల లీటర్ల పెట్రోల్‌ని అమ్మాం. ఇప్పుడు రూ. 250కి పైగా ఉండడంతో రోజుకు 13 వేల లీటర్లే అమ్ముతున్నాము. ఒక్కోరోజు అంతకంటే తక్కువగా అమ్ముతున్నాము. ప్రస్తుతం పార్కో పాకిస్తాన్ లిమిటెడ్ పెట్రోల్ బంక్‌లు ఖాళీగా ఉంటున్నాయి' అని ఇర్ఫాన్ అలీ చెప్పుకొచ్చారు.

చాలామంది పాకిస్తానీయులు రోజువారీ అవసరాల కోసం అప్పులు చేస్తున్నారు. ఫర్జానా అనే మహిళ తన ఇంటి అవసరాల కోసం ఐదు వేల రూపాయల్ని అప్పు చేయగా.. దాన్ని తీర్చలేక 16 ఏళ్ల తన కుమారుడిని చదువు మాన్పించి రెస్టారెంట్‌లో పనికి పంపిస్తున్నట్లు మీడియాతో చెప్పారు. తన దగ్గరున్న నగలన్నీ కూడా అమ్ముకున్నానని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. ఇక మహమ్మద్ రషీద్ అనే ఓ రైతు మీడియాతో మాట్లాడుతూ.. 'గత రెండేళ్లలో కూలీల రేట్లు బాగా పెరిగిపోయాయి. వ్యవసాయ ఖర్చులు భారీగా పెరిగాయి. వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదు' అని అన్నారు.

ప్రజాస్వామ్య బలోపేతానికి చర్చలు

- అమెరికాలో లూలా పర్యటన
- బైడెన్‌తో భేటీ



వాషింగ్టన్ : ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంపై, వాతావరణ మార్పులపై ప్రధానంగా దృష్టి సారించి చర్చలు జరిపేందుకు బ్రెజిల్ అధ్యక్షులు లూలా డ సిల్వా అమెరికాలో పర్యటిస్తున్నారు. వైట్‌హౌస్‌కు లూలాను ఆహ్వానించిన అమెరికా అధ్యక్షులు జోయ్ బైడెన్ ఆయనతో సమావేశమయ్యారు. ఎన్నికల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో విజయాలు సాధించినా పదవీచ్యుతులను చేసేందుకు స్వదేశాల్లో జరిగిన మితవాద శక్తుల కుట్రలను ఇరువురు నేతలు ఎదుర్కొన్నారు. వాటిపై తమ అనుభవాలను ఇరువురు పంచుకున్నారు. 'పటిష్టమైన ప్రజాస్వామ్యాలు కలిగిన రెండు దేశాలు కాలపరీక్షలకు నిలిచాయి' అని ఒవల్ ఆఫీసులో సమావేశానికి ముందు బైడెన్ వ్యాఖ్యానించారు. కానీ ఈ రెండు దేశాల్లో ప్రజాస్వామ్యం ప్రబలంగా నిలిచిందని అన్నారు. తిరిగి బ్రెజిల్ స్థానాన్ని ప్రపంచ వేదికపై పునరుద్ధరించాలన్నది తన లక్ష్యమని, ఆ దిశగా కృషి చేస్తున్నామని లూలా చెప్పారు. నాలుగేళ్ళ పాటు బ్రెజిల్ పక్కకు నెట్టివేయబడిందన్నారు. ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్య, హైతిలో అభద్రత, వలసలు, వాతావరణ మార్పులు, అమెజాన్‌లో అడవుల నరికివేతను అడ్డుకోవడానికి చర్యలు వంటి పలు అంశాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు వైట్‌హౌస్ తెలిపింది. బ్రెజిల్‌లో విద్వేష సంస్కృతి లేదని సిఎన్ఎన్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఒక ప్రశ్నకు సమాధానంగా లూలా చెప్పారు. స్వదేశంలో అధికారాన్ని చేజిక్కించుకునేందుకు కుట్రలు పన్నిన మితవాద నాయకుడు జేర్ బోల్సోనారోని అప్పగించాల్సిందిగా కోరతారా అని ప్రశ్నించగా, వ్యక్తిగతంగా తాను ఆ విషయాలు మాట్లాడాలనుకోవడం లేదని లూలా స్పష్టం చేశారు. అవసరమైతే బ్రెజిల్ న్యాయ వ్యవస్థ ఆ విషయం చూసుకుంటుందని అన్నారు.


ఢిల్లీలో తెరపైకి మరో వివాదం

డిస్కమ్‌ల బోర్డు నుంచి ఆప్ ప్రతినిధుల తొలగింపు

- లెఫ్టినెంట్ గవర్నరు నిర్ణయంపై ఆమాద్మీ ఆగ్రహం
- ఇది రాజ్యాంగ ఉల్లంఘనేనని విమర్శ

న్యూఢిల్లీ : ఢిల్లీలోని అధికార ఆమాద్మీ పార్టీకి, లెఫ్టినెంట్ గవర్నరు వికె సక్సేనాకు మధ్య మరో వివాదం రాజుకుంది. కేంద్రంలోని మోడీ సర్కార్‌కు కీలుబొమ్మలా బిజెపి అజెండాను ఢిల్లీలో బలవంతంగా రుద్దేందుకు సక్సేనా ప్రయత్నిస్తున్నారంటూ ఇప్పటికే పలు అంశాల్లో ఆయన జోక్యాన్ని ఆప్ నిరసించిన సంగతి విదితమే. తాజాగా ఆప్ కేబినెట్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా లెఫ్టినెంట్ గవర్నరు నిర్ణయం తీసుకున్నారు. ప్రయివేటు డిస్కమ్‌ల బోర్డు సభ్యులుగా ఉన్న ఆప్ అధికార ప్రతినిధి జాస్మిన్ షా, ఆప్ ఎంపి ఎన్‌డి గుప్తా కుమారుడు నవీన్ ఎన్‌డి గుప్తాను ఆయన తొలగించారు. గవర్నర్ తీసుకున్న ఈ నిర్ణయం రాజ్యాంగ ఉల్లంఘనేనని, చట్టానికి విరుద్ధమని ఆప్ ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యుత్‌పై ఉత్తర్వులు జారీ చేసే అధికారం ఎన్నికైన ప్రభుత్వానికే ఉంటుందని, గవర్నర్‌కి ఉండదని ఆప్ విమర్శిస్తోంది. గవర్నర్ సక్సేనా సుప్రీంకోర్టు ఆదేశాలను తోసిపుచ్చుతున్నారని, రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారని ఈ సందర్భంగా ఆప్ నేత, ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా విమర్శించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికి ఉండే హక్కులను గవర్నరు కాలరాస్తున్నారని వాపోయారు. కాగా, బివైపిఎల్, బిఆర్‌పిఎల్ (అనీల్ అంబానీ), ఎన్‌డిపిడిసిఎల్ (టాటా) బోర్డుల్లో ప్రభుత్వ నామినీలుగా ఉన్న జాస్మిన్, నవీన్ గుప్తా.. రాష్ట్ర ఖజానా ఖర్చుతో ప్రైవేటు డిస్కమ్‌లకు ఆర్థిక ప్రయోజనాలను అందించారని విద్యుత్ బోర్డు ప్రధాన కార్యదర్శి అందించిన నివేదిక ఆధారంగా లెఫ్టినెంట్ గవర్నర్ బోర్డు సభ్యులుగా ఉన్న వారిని తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారని ఆయన కార్యాలయం పేర్కొంది. అలాగే అనీల్ అంబానీ యాజమాన్యంలోని డిస్కమ్‌ల బోర్డులలో జాస్మిన్, నవీన్ గుప్తా ప్రైవేట ప్రతినిధులకు సహకరించి.. 8 వేల కోట్ల మేర ప్రయోజనం చేకూర్చారని లెఫ్టినెంట్ గవర్నర్ పేర్కొన్నారు. ఇక ఆ ఇద్దరి బోర్డు సభ్యుల స్థానంలో వేరొకరిని ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వం నామినేట్ చేసేంతవరకు సీనియర్ ప్రభుత్వ అధికారులను నియమించడం ఆనవాయితీ అని సక్సేనా తెలిపారు.

టర్కీ భూకంపం :
24 వేలకు చేరిన మరణాలు



అంకారా : టర్కీ, సిరియాల్లో సంభవించిన వరుస భూకంపాలతో వేలాదిమంది మృతి చెందిన సంగతి తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం ఈ భూకంపాల వల్ల 24 వేల మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. టర్కీలో 20,665 మంది మృతి చెందారని విపపత్తు నిర్వహణా అధికారులు శనివారం వెల్లడించారు. ఇక సిరియాలో 3,500 మందికిపైగా మృతి చెందారు. ఇక దక్షిణ టర్కీలోని భూకంప ప్రాంతం నుండి 93 వేల మందిని సహాయక శిబిరాలకు తరలించినట్లు రెస్క్యూ అధికారులు తెలిపారు. ఈ సహాయక చర్యల్లో దాదాపు 16 వేల మందికిపైగా సిబ్బంది పాల్గొన్నారు. ఈ భూకంపం వల్ల రెండు దేశాల్లో 87 వేల మందికిపైగా ప్రజలకు ఆహారాన్ని అందజేయాల్సిన అవసరముందని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఆర్మేనియా, టర్కీల దేశాల మధ్య సరిహద్దు 30 ఏళ్ల తర్వాత తెరవబడింది. టర్కీలోని ఇగ్దిర్ ప్రావిన్స్‌లోని అలికాన్ సరిహద్దు గుండా ఐదు ట్రక్కుల మనుషులను పంపినట్లు ఆర్మేనియా అధికార పక్షనేత గారో పైలాన్ ట్వీట్ చేశారు.

122 గంటల తర్వాత సజీవంగా ఇద్దరు మహిళలు

కాగా, సోమవారం నుంచి అవిశ్రాంతంగా రెస్క్యూసిబ్బంది శిథిలాల కింద నుంచి మృతదేహాలను వెలికితీస్తున్నారు. మృతదేహాల నుంచి గాఢమైన వాసన వెదజల్లుతున్నా.. శిథిలాల కింద బతికున్నవారి కోసం రెస్క్యూ సిబ్బంది వెతుకుతున్నారని మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఇక శనివారం కొనసాగుతున్న సహాయక చర్యల్లో రెస్క్యూ సిబ్బంది శిథిలాల కింద ఉన్న ఇద్దరు మహిళలను బయటకు తీశారు. దాదాపు 122 గంటల తర్వాత వారిని శిథిలాల నుంచి సజీవంగా బయటకు తీసినట్లు రెస్క్యూ అధికారులు వెల్లడించారు. రెస్క్యూ సిబ్బంది రక్షించబడిన మహిళల్లో మెనెక్సే తబాక్ (70). ఈమె కహ్రామన్మరాస్ ప్రావిన్స్‌కి చెందిన వారు. ఈమెను వెంటనే చికిత్సనిమిత్తం రెస్క్యూసిబ్బంది ఆసుపత్రికి తరలించారు. ఇక రెండో మహిళ మసల్లా సిసెక్ (55). టర్కీలోని దియార్‌బాకిర్ నగరంలోని అతిపెద్ద భవనం కూలిపోయిన శిథిలాల నుంచి ఈమెను బయటకు తీసినట్లు మీడియా వర్గాలు తెలిపాయి.

బెంగళూరులో అనుమానస్పద ఉగ్రవాది అరెస్టు

బెంగళూరు : ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్)తో సంబంధాలున్నట్లు అనుమానిస్తూ బెంగళూరు ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మహమ్మద్ ఆరీఫ్‌ను అరెస్టు చేశారు. అంతర్గత భద్రత విభాగం (ఐఎస్‌డి), జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో శనివారం ఉదయం అతడిని అదుపులోకి తీసుకున్నారు. త్వరలోనే సిరియాకు వెళ్లి ఉగ్రవాద సంస్థలో చేరేందుకు నిందితుడు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. గత రెండేళ్లుగా ఒక ప్రయివేటు ఐటి సంస్థలో వర్క్ ఫ్రం హోం కింద పనిచేస్తున్న ఆరీఫ్ తానిసంద్రలో నివాసముంటున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఐఎస్ఐఎస్‌కు సంబంధించిన పేజీల్లో ఆరీఫ్ క్రియాశీలంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆరీఫ్ నుంచి ఒక ట్యాబ్‌ని, ల్యాప్‌ట్యాప్‌ని స్వాధీనం చేసుకున్నారు.

కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ.. నామినేషన్ ఉపసంహరించుకున్న అభ్యర్థి

కోహిమా: త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. కాగా, నాగాలాండ్‌లో ఫిబ్రవరి 27వ తేదీన పోలింగ్ జరగనుంది. మార్చి 2వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. అయితే, ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బరిలోకి దిగిన కాంగ్రెస్ పార్టీకి ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా అకులుటో స్థానం నుంచి బరిలోకి దిగిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఖేకషే సుమీ తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరిరోజైన శుక్రవారం.. ఆఖరి క్షణాల్లో తాను పోటీనుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. అనంతరం, తన నామినేషన్‌ను విత్ డ్రా చేసుకున్నారు. దీంతో బీజేపీ అభ్యర్థి కఝెటో కినిమీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బరిలో ఉన్న ఇద్దరిలో ఒకరు తప్పుకోవడంతో 68 ఏండ్ల కినిమీ యునానిమస్‌గా ఎన్నికైనట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. కినిమీ ఎమ్మెల్యేగా ఎన్నికవడం వరుసగా ఇది రెండోసారి. కాగా, నాగాలాండ్‌లో ఫిబ్రవరి 27వ తేదీన పోలింగ్ జరగనుంది. మార్చి 2వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బరిలోకి దిగిన కాంగ్రెస్ పార్టీకి ఊహించని ఎదురుదెబ్బ తగిలింది.

నగలు వేసుకొని విధులకు రావొద్దు

- హర్యానా వైద్య సిబ్బందికి కొత్త డ్రెస్‌కోడ్

ఛండీగఢ్ : హర్యానా రాష్ట్ర ప్రభుత్వం వైద్య సిబ్బందికి కొత్త డ్రెస్ కోడ్ అమల్లోకి తీసుకొచ్చింది. నూతన నియమావళి ప్రకారం..వైద్య సిబ్బంది ఎవ్వరూ ఇక నుంచి నగలు ధరించి కానీ, ప్రత్యేక మేకప్ వేసుకొని విధులకు హాజరు కారాదు. అలాగే ఫంకీ హెయిర్‌స్టైల్ చేసుకోరాదు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే ఉద్యోగుల్లో క్రమశిక్షణ, ఏకత్వం, సమానత్వం కోసమే నూతన డ్రెస్‌కోడ్ పాలసీని అమల్లోకి తీసుకొచ్చామని హర్యానా ఆరోగ్య శాఖ మంత్రి అనిల్ విజ్ తెలిపారు. 'ఆసుపత్రి పనివేళల్లో.. స్కర్టులు ధరించరాదు. అసాధారణ హెయిర్ స్టైళ్లతో విధులకు రాకూడదు. టీషర్టులు, జీన్స్‌లు, స్కర్టులు, లెదర్ ప్యాంట్లు, క్రాప్‌టాప్‌లను అనుమతించబోం. ఫార్మల్ దుస్తులనే ధరించాలి' అని అనిల్ విజ్ తెలిపారు.

వారసత్వ కట్టడాలను పరిరక్షించుకోవాలి

- రాష్ట్ర మైనారిటీ కమిషన్ సలహాదారులు ఏకేఖాన్
- దోమకొండ కోటలో తెలంగాణ ఉర్దూ సాహిత్య కవి సమ్మేళనం

నవతెలంగాణ-దోమకొండ

చారిత్రక వారసత్వ కట్టడాలను పరిరక్షించుకోవాలని రాష్ట్ర మైనారిటీ కమిషన్ సలహాదారులు ఏకే ఖాన్ అన్నారు. కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలోని గడికోటలో సంస్థాన వారసులు కామినేని అనిల్ శోభన ఆధ్వర్యంలో శనివారం ఉర్దూ కవి సమ్మేళనం నిర్వహించారు. గతంలో దోమకొండ సంస్థానం వారి ఆధ్వర్యంలో ఉర్దూ సాహిత్యానికి అందించిన సేవ.. ముఖ్యంగా రాజరాజేశ్వరరావు ఆరు భాషల్లో తెలంగాణ సాహిత్యానికి అందించిన సేవలపై వక్తలు మాట్లాడారు. ఈ సందర్భంగా ఏకే ఖాన్ మాటాడుతూ.. ప్రపంచ వారసత్వ కట్టడాలలో దోమకొండ కోటకు యూనెస్కో అవార్డు రావడం చాలా సంతోషమని, వారసత్వ కట్టడాలను కాపాడుకోవాలని అన్నారు. రాష్ట్రంలో ఇంకా ఎన్నో ముఖ్యమైన సంస్థానాలు ఉన్నట్టు తెలిపారు. వాటిని కూడా పునరుద్ధరించాలన్నారు. ఇక్కడ ఉర్దూ సాహిత్యం కవి సమ్మేళనం నిర్వహించడం చాలా సంతోషకరమని చెప్పారు. మన సంస్కృతి, సంస్కారం, సాహిత్యం.. ఈ మూడింటి ద్వారా త్వరగా అభివృద్ధి అయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గడికోట వారసులు కామినేని అనిల్ కుమార్, కలెక్టర్ జితేష్ పాటిల్, అడిషనల్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ కానుగంటి శారద నాగరాజు, జెడ్పీటీసీ తిరుమల గౌడ్, గడి ట్రస్ట్ మేనేజర్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

త్రిపురలో మోడీ ప్రచారం

అంబాసా : పార్లమెంటులో ప్రతిపక్షాలు సంధించిన ప్రశ్నలకు కానీ, దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు కానీ ఏ మాత్రం సమాధానం చెప్పకుండా ఎదురుదాడి సాగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ..త్రిపురలో ఎన్నికల ప్రచార సభలోనే అదే తీరుతో ప్రసంగించారు. రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలకు చేసిన మేళ్ల ఏమిటో చెప్పకుండా గత ప్రభుత్వాలపై దుమ్మెత్తి పోయడమే లక్ష్యంగా ఆయన ప్రసంగం సాగింది. త్రిపుర ఎన్నికల సందర్భంగా ధలాయ్ జిల్లాలోని అంబాసాలో జరిగిన ఎన్నికల సభలో ఆయన మాట్లాడారు. త్రిపురలో ఏళ్ళ తరబడి వారి పాలన వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారంటూ ప్రధాని మోడీ పేర్కొన్నారు. గిరిజనుల్లో గత ప్రభుత్వాలు చీలికలను సృష్టించాయని, కానీ బిజెపి మాత్రం వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తోందని చెప్పుకొచ్చారు. ఈ రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడకుండా వుండాలంటే బిజెపికే ఓటు వేయాలని కోరారు.

తూర్పు జర్మనీ చివరి కమ్యూనిస్టు నేత హన్స్ మొద్రో కన్నుమూత

బెర్లిన్ : తూర్పు జర్మనీ చిట్టచివరి కమ్యూనిస్టు నేత హన్స్ మొద్రో (95) శనివారం తెల్లవారు జామున కన్నుమూశారని వామపక్ష పార్లమెంటరీ గ్రూపు తెలియచేసింది. సంస్కరణలవాదీ అయిన మొద్రో బెర్లిన్ గోడ కూలిన వెంటనే తూర్పు జర్మనీ పాలనా బాధ్యతలు చేపట్టారు. తర్వాత ప్రభుత్వంలోకి చేరాల్సిందిగా ప్రతిపక్ష శక్తులను కూడా ఆహ్వానించారు. 'జర్మనీ ఐక్యతను సుస్థిరం చేసే ప్రక్రియ మొత్తంగా శాంతియుతంగా సాగడం ప్రధానంగా ఆయన సాధించిన ప్రత్యేక విజయంగా భావించాలి.' అని వామపక్ష పార్లమెంటరీ గ్రూపు ట్విట్టర్‌లో వ్యాఖ్యానించింది. ఆయన రాజకీయ వారసత్వం ఎన్నటికీ నిలిచి వుంటుందని పేర్కొంది. కమ్యూనిస్టు పార్టీ చీఫ్‌గా 16ఏళ్ళు పాటు పనిచేశారు.

వేధింపుల నుంచి డొమెస్టిక్ వర్కర్స్‌కు రక్షణ కల్పించాలి :ఎఐసీసీడీడబ్ల్యూ డిమాండ్

న్యూఢిల్లీ : గుర్‌గావ్‌లోని ఒక ఇంట్లో పనిచేస్తున్న మహిళపై అమానవీయమైన రీతిలో వేధింపులకు, దూషణలకు పాల్పడుతున్న దంపతులపై కఠిన చర్య తీసుకోవాలని అఖిల భారత డొమెస్టిక్ వర్కర్స్ సమన్వయ కమిటీ (ఎఐసీసీడీడబ్ల్యూ) పోలీసులను కోరింది. ఈ వేధింపులపై దర్యాప్తు జరిపి, ఈ ఇంట్లో ఆమెను పనికి నియమించిన సంస్థపై కూడా చర్యలు తీసుకోవాలని కోరింది. బాధిత మైనర్ అని వార్తలు వస్తున్నాయని, అదే గనుక నిజమైతే పనిలో పెట్టుకున్న దంపతులు, పనిలో పెట్టిన సంస్థ ఇరు పక్షాలను బాల కార్మిక రక్షణ, నియంత్రణ చట్టం కింద విచారించాలని కోరింది. 14ఏళ్ళ లోపు వారు ఏ రంగంలో పని చేయకుండా నిషేధించాలని ఆ చట్టం కోరుతోంది. అలాగే బాధితురాలికి తగిన వైద్య చికిత్సనందించి, నష్టపరిహారం అందించాలని కమిటీ కోరింది. ఎన్‌సిఆర్ రీజియన్‌లో ఇలా పనిమనుష్యులను వేధిస్తున్న కేసులు అనేకం వెలుగులోకి వచ్చినప్పటికీ, అటు కార్మిక శాఖ గానీ ఇటు పోలీసులు గానీ వీటిపై స్పందించి చర్యలు తీసుకున్న దాఖలా కనిపించడం లేదని ఎఐసీసీడీడబ్ల్యూ పేర్కొంది. ప్రఖ్యాతి చెందిన సంస్థల్లో పనిచేస్తూ, మంచి ఆకర్షణీయమైన వేతనాలు సంపాదించుకుంటున్న వారు తమ ఇళ్లలో పనిచేసే వారిని కనీసం మనుష్యులుగా కూడా చూడకపోవడం విచారకరమని పేర్కొంది. రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు ఈ విషయంలో మౌనం పాటించడం మరింత దిగ్భ్రాంతికరమని కమిటీ పేర్కొంది. డొమెస్టిక్ వర్కర్స్ పని పరిస్థితులను క్రమబద్ధీకరించి, వారికి ఇలాంటి వేధింపుల నుండి రక్షణ కల్పించాల్సిన తక్షణావశ్యకత వుందని పేర్కొంది. ఇటువంటి కేసులు ఎక్కడ జరిగినా అప్రమత్తంగా వుండి వెంటనే యూనియన్‌కు, స్థానిక పోలీసులకు తెలియచేయాలని కమిటీ కోరింది.

రాజ్యాంగ లక్ష్యాల సాధనకు కృషి

- ఇది పౌరులందరి బాధ్యత
- మహారాష్ట్ర న్యాయ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో జస్టిస్ చంద్రచూడ్



ముంబయి : భారత రాజ్యాంగ పీఠికలో మనకు మనం నిర్దేశించుకున్న 'అందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం' లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ కోరారు. రాజ్యాంగ లక్ష్యాల సాధన అనేది దేశ పౌరులందరి బాధ్యత అని ఆయన నొక్కి చెప్పారు. శనివారం నాగ్‌పూర్‌లోని మహారాష్ట్ర జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవ కార్యక్రమంలో జస్టిస్ చంద్రచూడ్ ప్రసంగించారు. "అందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం సాధించాలి" అంటూ పీఠికలో పేర్కొన్న వాగ్దానాన్ని నెరవేర్చడానికి పౌరులుగా ప్రతి ఒక్కరం పాటు పడాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగమనేది స్వపరిపాలన, గౌరవం, స్వాతంత్ర్యం యొక్క అత్యద్భుతమైన స్వదేశీ ఉత్పత్తిగా ఆయన అభివర్ణించారు. కానీ కొందరు దీనిపై పూర్తిగా ద్వేషపూరితమైన రీతిలో మాట్లాడుతుంటే, చాలామంది భారత రాజ్యాంగం సాధించిన విజయం గురించి విరక్తిగా మాట్లాడతారని అన్నారు. కానీ ఈ రెండింట్లోనూ వాస్తవికత లేదని అన్నారు. భారతదేశ వలసవాద నాయకులు మనపై రాజ్యాంగాన్ని రుద్దలేదన్న విషయాన్ని గుర్తు చేశారు. మన రాజ్యాంగమనేది ఎలా ఆవిర్భవించిందో ఆ కోణంలో నుండి చూసినట్లైతే, అదొక అత్యద్భుతమైన అంశంగా గుర్తిస్తారని ఆయన స్పష్టం చేశారు. చేయాల్సిన పనులు ఇంకా చాలా వున్నప్పటికీ రాజ్యాంగం చేసిన పనులు, కృషి కూడా చాలా వుందని అన్నారు. యువ న్యాయ విద్యార్థులు, న్యాయ పట్టభద్రులు రాజ్యాంగ విలువల మార్గదర్శకత్వంతో వృత్తి జీవితంలో ముందుకు సాగినట్లైతే వారెన్నటికీ విఫలమవరని ఆయన వ్యాఖ్యానించారు. రాజ్యాంగ పీఠిక గురించి ప్రస్తావిస్తూ, చిన్నదిగానే వున్నా రాజ్యాంగానికి ఇది బరువును చేకూర్చిందన్నారు. భారత ప్రజలుగా మనం ఈ రాజ్యాంగానికి కట్టుబడి వుండాలని ఆకాంక్షించారు. ఈనాడు అత్యంత సులభంగా మనం అనుభవిస్తున్న రాజ్యాంగ హక్కులు, సౌకర్యాలకు గానూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కు మన భారతీయులందరం రుణపడి వున్నామన్నారు.

ఎంపీ మాగుంట తనయుడు అరెస్టు

- ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో రోజుల ఈడీ కస్టడీ



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఒంగోలు వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి కుమారుడు మాగుంట రాఘవ రెడ్డిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసింది. రఘవ రెడ్డికి సీబీఐ ప్రత్యేక కోర్టు పది రోజుల ఈడి కస్టడీని విధించింది. అలాగే ప్రతిరోజు గంట పాటు రఘవ రెడ్డిని కలుసుకునేందుకు కుటుంబ సభ్యులు అవకాశం కల్పించింది. శనివారం ఢిల్లీలోని రౌస్ అవెన్యూలో సీబీఐ ప్రత్యేక కోర్టులోని న్యాయమూర్తి జస్టిస్ నరేష్ కుమార్ లాకా ధర్మాసనం ముందు మాగుంట రాఘవను ఈడీ అధికారులు హజరు పరిచారు. మద్యం విధాన రూపకల్పనలో రూ.వంద కోట్లు చేతులు మారాయని న్యాయస్థానంలో ఈడీ తరపు న్యాయవాది ఎన్ కె మట్ట తెలిపారు. సౌత్ గ్రూప్ పేరుతో డబ్బులు వసూలు చేసి కీలక వ్యక్తుల ద్వారా పంపించారని పేర్కొన్నారు. మాగుంట రాఘవకు తయారీ, హెూల్ సేల్ వ్యాపారం, 2 రిటైల్ జోన్స్ కూడా ఉన్నాయని ఈడీ వివరించారు. రూ. వంద కోట్ల ముడుపుల్లో రాఘవ కీలకంగా వ్యవహరించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

నాలుగు రెట్లు పెరిగిన సాగు : మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో ఎక్కడా లేని విధంగా 24 గంటల కరెంటు ఇస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. శనివారం శాసనసభలో ఆయన పద్దులపై మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగు రెట్లు సాగుతో పాటు దిగుబడి పెరిగిందని చెప్పారు.

వ్యవసాయ రంగానికి నిధుల కేటాయింపులతో రాష్ట్రంలో నేరాల రేటు తగ్గిందన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. రైతుల ఆదాయం రెట్టింపు చేసేందుకు వీలుగా స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ను అమలు చేస్తామంటూ చెప్పిన ప్రధాని మోడీ ఆ మాటను విస్మరించారని విమర్శించారు. చివరకు సుప్రీంకోర్టు చెప్పినా దాన్ని అమలు చేయలేదని వాపోయారు. మరోవైపు మద్దతు ధరలను కల్పిస్తామంటూ పార్లమెంటులో వచ్చి అబద్ధాలు చెబుతున్నారని మోడీని ఉద్దేశించి ఎద్దేవా చేశారు.

రాబోయే ఎన్నికల్లో ఆర్‌జెడి, జెఎంఎం కలిసి పోటీ

రాంచి : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఆర్‌జెడి, జెఎంఎం కలిసి పోటీ చేస్తాయని బీహార్ డిప్యూటీ ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ చెప్పారు. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌తో శనివారం తన నివాసంలో సమావేశం అనంతరం తేజస్వి యాదవ్ మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్ళ గురించి, రాబోయే ఎన్నికల్లో కలిసి పోటీ చేయడంపై ఇరువురం మాట్లాడుకున్నామని తెలిపారు. జార్ఖండ్‌లో పార్టీ కార్యకలాపాలను సమీక్షించాలన్న ఆర్‌జెడి ఆలోచనల గురించి కూడా తేజస్వి చెప్పారు. లాలూ అనారోగ్యంతో గతంలో అనుకున్న కొన్ని కార్యకలాపాలు నిలిచిపోయాయని, కానీ ఇప్పుడు ఆయన ఆరోగ్యం బాగవడంతో మళ్లీ అన్ని కార్యక్రమాలు సజావుగా జరుగుతాయని భావిస్తున్నట్లు చెప్పారు. జార్ఖండ్‌లో మహాగత బంధన్ కూటమిని బలోపేతం చేసే దిశగా కృషి చేస్తామన్నారు. చవకబారు రాజకీయాలకు పాల్పడుతున్న బిజెపి ఓటర్లను కొనుగోలు చేసేందుకు యత్నిస్తోందన్నారు.